


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 309

SUNDAY Special

ఆదివారం 23-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బంగ్లాదేశ్‌తో మూడో వన్డే 'టై'

బంగ్లాదేశ్ మహిళలతో భారత మహిళల జట్టు ఆడిన చివరి వన్డే 'టై'గా ముగిసింది. బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేయగా.. భారత్ 225 పరుగులకు ఆలౌట్ అయ్యింది.


- వివరాలు 12లో



మరో టైటిల్‌కు అడుగు దూరంలో...

భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కొరియా ఓపెన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లారు. సెమీస్‌లో 21–15, 24–22తో లియాంగ్– వాంగ్ చాంగ్ (చైనా)పై గెలుపొందారు.

- వివరాలు 12లో



జాతి క్షేమాన్ని మించిన పదవీ కాంక్ష

గత యూపీఏ సర్కార్ అధికార వ్యామోహంతో బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



మహిళా ఐఏఎస్ అరెస్ట్

ఛత్తీస్‌గఢ్ బొగ్గు లెవీ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై మహిళా ఐఏఎస్ రానూ సాహూను ఈడీ అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్‌పై రష్యా దాడులు

ఉక్రెయిన్ దేశవ్యాప్తంగా రష్యా జరిపిన దాడుల్లో 8 మంది పౌరులు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



ఇనుములో.. హృదయం మొలిచెనా!

అమెరికాలో ఓ చిన్న ప్లాటినం ముక్క తనలో పుట్టుకొచ్చిన పగుళ్లను తనంతట తానుగా నయం చేసుకుంది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మూడు రోజులు విస్తారంగా వానలు



బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

వివరాలు 13లో ▸

ఇది రైతుల స్వర్ణ యుగం



వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఏపీ కార్ల్‌లో ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు మొదటి బ్యాచ్‌ను మంత్రి కాకాణి ప్రారంభించారు. ప్రతి ఆర్బీకే ఒక వ్యవసాయ పరిశోధనశాల కావాలన్న సీఎం జగన్ ఆకాంక్షకు రైతు సాధికార సంస్థ కార్యరూపం ఇస్తోందన్నారు.

వివరాలు 10లో ▸

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

వివేకా హత్యపై చార్జ్‌షీట్‌లో అభియోగాలన్నీ నిరాధారం

1,226 రోజుల దర్యాప్తులో సాధించింది శూన్యం

దేశంలోనే ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'ద వైర్' విశ్లేషణ

- వివేకా అప్పట్లో రాజకీయాల్లో క్రియాశీలకంగా లేరు
- 2011 ఉప ఎన్నికలతోనే ఆయన ప్రాభవం ముగిసింది.. కడప ఎంపీ అభ్యర్థిని నిర్ణయించే స్థాయిలో లేరు
- షర్మిలను ఎంపీగా పోటీ చేయమని వివేకా కోరారనడానికి ఆధారం లేదు
- అవినాశ్ బలహీన అభ్యర్థి అనే షర్మిల అభిప్రాయం సరికాదు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమిపై సీబీఐది కట్టుకథే
- వివేకా రెండో వివాహాన్ని, బయటి శక్తుల పాత్రను పట్టించుకోని సీబీఐ



సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు.. రాజకీయంగా అత్యంత సంచలనమైన కేసు.. దర్యాప్తు చేస్తోంది దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ. దర్యాప్తు చేపట్టిన 1,226 రోజుల తర్వాత కూడా సీబీఐ సాధించింది ఇదీ అని చెప్పడానికి ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. హత్య వెనుక విస్తృత కుట్ర ఉందనే మాట చెప్పడం తప్ప.. అందుకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన అభియోగాలకు ఒక్కటంటే ఒక్క దానికి కూడా ఆధారాలు చూపించలేకపోయింది' అని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. నిష్పాక్షికమైన థర్డ్ పార్టీగా 'ద వైర్' వెబ్‌సైట్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇటీవల దాఖలు చేసిన తుది చార్జ్‌షీట్‌లోని అంశాలను విశ్లేషించింది. రాజకీయ, నేర, న్యాయ సంబంధమైన వార్తా విశ్లేషకురాలిగా

మిగతా 2వ పేజీలో ▸

తిరుపతి జిల్లా కమ్మకంద్రిగ జెడ్పీ హైస్కూల్‌లో రెండో సెమిస్టర్ పుస్తకాలతో విద్యార్థులు, టీచర్లు



45 వేల పాఠశాలలు.. 1.06 కోట్ల పుస్తకాలు

36 లక్షల మంది విద్యార్థులకు ఒకేరోజు రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

- రెండు నెలల ముందే బుక్స్ అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- నవంబర్‌లో ప్రారంభం కానున్న సెమిస్టర్–2 బోధన
- పుస్తకాల పంపిణీలో పాల్గొన్న ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు
- ముందస్తు ప్రణాళికతో పంపిణీ చేసిన విద్యాశాఖ.. 20వ తేదీ నాటికే అన్ని స్కూళ్లకు చేరుకున్న పుస్తకాలు

సాక్షి, అమరావతి: వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు విద్యాకానుక అందించి చరిత్ర సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు రెండో సెమిస్టర్‌కు పుస్తకాల పంపిణీ విషయంలోనూ రికార్డు నెలకొల్పింది. నవంబర్‌లో ప్రారంభమయ్యే 2వ సెమిస్టర్ పుస్తకాలను విద్యార్థులకు 2 నెలల ముందే పంపిణీ చేసింది. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో సైతం పుస్తకాల పంపిణీ పూర్తిచేసింది. రాష్ట్రంలోని 45,409 పాఠశాలల్లో


మిగతా 2వ పేజీలో ▸



మణిపూర్‌లో మరో దారుణం

మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన రోజే అక్కడికి 40 కి.మీ. దూరంలో మరో దారుణం జరిగింది. ఇద్దరు యువతుల్ని సామూహికంగా అత్యాచారం చేసి.. రంపాలపై పడేసి హత్య చేశారు. 100 మందికిపైగా దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఓ బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది.

6లో



ఎంఎస్‌ఎంఈలకు బంపర్ ఆఫర్

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయనుంది. బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి, రెడీ టు వర్క్ విధానంలో అభివృద్ధి చేయాలని సంకల్పించింది.

2లో



ఐదుగురిని బలిగొన్న 'ట్యాంకర్'

ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తు ఐదుగురి ప్రాణాలు తీసింది. అన్నమయ్య జిల్లా చిన్నఓరంపాడు వద్ద ఆర్టీసీ బస్సును సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. దీనిపై సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆదేశించారు.

10లో

క్లుప్తంగా...

రేపు సీఎం జగన్ గుంటూరు జిల్లా పర్యటన

- సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్న సీఎం
- వెంకటపాలెం బహిరంగ సభలో ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ సోమవారం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. సీఆర్‌డీఏ పరిధిలో (కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్) పేదల ఇళ్ల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కృష్ణాయపాలెం హౌసింగ్ లే అవుట్‌కు చేరుకుంటారు. వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన మోడల్ హౌస్‌ను పరిశీలిస్తారు. అనంతరం వెంకటపాలెం చేరుకుని లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాల పంపిణీకోసం ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొంటారు.

స్టార్టప్‌ల హబ్‌గా విశాఖ



మాట్లాడుతున్న ఏపీఐఎస్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరం స్టార్టప్ కంపెనీల స్థాపనకు అనుకూలమని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ(ఏపీఐఎస్) సీఈవో అనిల్ కుమార్ చెప్పారు. వీటి ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందిస్తున్నాయన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం స్టార్టప్‌ల సక్సెస్ రేటు 5శాతం ఉందని, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ యంగ్ ఇండియన్స్ చైర్ రాయ్ కొడాలి, గ్రామీణ ఇంక్యుబేషన్ సెంటర్ ఫౌండర్ బి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రామన్- II రాకెట్ ఇంజిన్ టెస్ట్ సక్సెస్



ప్రయోగాత్మక పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): స్పేస్ స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఏరోస్పేస్ తమిళనాడు రాష్ట్రం మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ రీసెర్చ్ కాంప్లెక్స్‌లో రామన్- II రాకెట్ ఇంజిన్‌కు శుక్రవారం ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించింది. ఇది విజయవంతమైందని ఇస్రో శనివారం వెల్లడించింది. ఇస్రోలో అంతర్భాగంగా.. వాణిజ్యపరంగా ఏర్పాటు చేసిన ఇన్‌స్పేస్ సంస్థ ఒప్పందంలో భాగంగా ఈ పరీక్షను నిర్వహించారు. రామన్- II ఇంజిన్ సామర్థ్యాన్ని మరింతగా మెరుగుపరచడానికి మరిన్ని పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది నవంబర్ 18న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ విక్రమ్-ఎస్ అనే ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించింది. ఈసారి విక్రమ్-I అనే రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ రాకెట్ నాలుగో దశలో రామన్- II ఇంజిన్‌ను ఉపయోగించనున్నారు.

ప్రాధాన్యతక్రమంలో రాయితీలు విడుదల



సాక్షి, అమరావతి: సులభతర వాణిజ్యంలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం పరిశ్రమల రాయితీలనూ సకాలంలో విడుదల చేసేలా వివిధ పారిశ్రామిక పాలసీలకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేశారు. పారిశ్రామిక రాయితీల విడుదలలో ప్రకృతి వైపరీత్యాలు, ఎంఎస్‌ఎంఈలు, డీఐపీసీ గుర్తించిన సిక్ యూనిట్లు, 100 శాతం మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమలకు తొలుత ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ కరికాల వలవన్ పేర్కొన్నారు.

'ఏపీతో భాగస్వాములుకండి'



సాక్షి, అమరావతి: టెక్స్‌టైల్, పారిశ్రామిక నైపుణ్యాల్లో ఏపీతో భాగస్వామి కావాలని వియత్నాం ప్రభుత్వాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కోరారు. వియత్నాం పర్యటనలో శనివారం ఆ ప్రభుత్వ ప్రణాళిక, పరిశ్రమల డిప్యూటీ మినిస్టర్ డో తాన్హ్ ట్రంగ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఒకేషనల్ ట్రైనింగ్, పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. దీనిపై డో తాన్హ్ ట్రంగ్ స్పందిస్తూ ఏపీకి మరింత సహకారం అందించే దిశగా ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుకు అంగీకరించారు. అనంతరం వియత్నాం చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ట్రాన్ కోక్ ఫుంగ్‌ను కలిశారు. అతి పెద్ద వస్త్ర తయారీ పరిశ్రమ 'గార్కో 10'ను ఆయన సందర్శించి.. రాష్ట్రంలో టెక్స్‌టైల్ కంపెనీల ఏర్పాటుకు గల అవకాశాలపై యాజమాన్యంతో చర్చించారు. హనోయ్ టెక్స్‌టైల్ అండ్ గార్మెంట్స్ వర్సిటీని సందర్శించి ప్రతినిధులతో మాట్లాడారు.

ఎంఎస్‌ఎంఈలకు బంపర్ ఆఫర్..

- ప్రతీ జిల్లాలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఉమ్మడి సౌకర్యాలతో రెడీ టు వర్క్ విధానంలో వీటి అభివృద్ధి
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52 క్లస్టర్ల అభివృద్ధికి ప్రణాళిక
- ఇప్పటికే రంగాల వారీగా జిల్లాల క్లస్టర్ల ఎంపిక
- ఎంఎస్‌ఎంఈలకు నిర్వహణ వ్యయం తగ్గింపే లక్ష్యం
- వీటి అభివృద్ధికి తక్షణం భూ కేటాయింపులు చేయాలంటూ కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అత్యధికంగా ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాపార నిర్వహణలో ఈ సంస్థలు ఎదుర్కొనే ఆర్థిక కష్టాలను తగ్గించి తక్కువ పెట్టుబడితో వేగంగా ఉత్పత్తి ప్రారంభించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను ఏర్పాటుచేయనుంది. ఇందులో భాగంగా.. కనీసం మూడు నుంచి ఐదెకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి అక్కడే ఉమ్మడి సౌకర్యాలతో రెడీ టు వర్క్ విధానంలో వీటిని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. నిజానికి.. ఒక ఎంఎస్‌ఎంఈ ఏర్పాటులో ఎక్కువ మొత్తం స్థలం కొనుగోలు, వాటి నిర్మాణానికే కేటాయించాల్సి రావడంతో ఆయా సంస్థలు వర్కింగ్ క్యాపిటల్‌కు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి సౌకర్యాలతో కూడిన భవనాలను నిర్మించి వాటిని లీజు విధానంలో ఇస్తే వెంటనే ఉత్పత్తిని ప్రారంభించడంతో పాటు వర్కింగ్ క్యాపిటల్ ఇబ్బందులూ తగ్గుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో ఈ విధానంలో రెండు క్లస్టర్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

జిల్లాల వారీగా ఏర్పాటుచేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు..

జిల్లా	ఎంపిక చేసిన క్లస్టర్లు
అనకాపల్లి	కాయర్, రైస్ మిల్లులు
అనంతపురం	గోల్డ్ జ్యూవెలరీ, అగ్రి ప్రాసెసింగ్
అన్నమయ్య	చెక్కతో చేసిన ఆటబొమ్మలు, పట్టు చీరల వ్రాపింగ్-డయింగ్
అల్లూరి సీతారామరాజు	రబ్బరు ఉత్పత్తులు, కాఫీ క్లస్టర్
బాపట్ల	హెల్త్‌కేర్ సర్వీసెస్, ఇంజనీరింగ్
చిత్తూరు	ప్రింటింగ్, పవర్‌లూమ్స్
తూర్పు గోదావరి	గ్రాఫైట్ క్రుసిబెల్స్, సిరామిక్
ఏలూరు	గోల్డ్ జ్యూవెలరీ, కార్పెట్స్
గుంటూరు	పప్పుల మిల్లులు, వెండి ఆభరణాలు
కాకినాడ	రైస్‌మిల్, పాలీమర్
కోనసీమ	కాయిర్, పరుపులు
కృష్ణా	ప్రింటింగ్-ప్యాకింగ్, వ్యవసాయ పనిముట్లు
కర్నూలు	హెల్త్‌కేర్, గోల్డ్ జ్యూవెలరీ
నంద్యాల	స్టోన్ ప్రాసెసింగ్, స్టోన్ కార్వింగ్
ఎన్టీఆర్	ప్రింటింగ్, రెడీమేడ్ గార్మెంట్స్
పల్నాడు	ఫర్నిచర్, హెల్త్‌కేర్
పార్వతీపురం మన్యం	రైస్‌మిల్, బంగారు ఆభరణాలు
ప్రకాశం	గ్రానైట్, మిర్చి ప్రాసెసింగ్
నెల్లూరు	చీరల డిజైనింగ్-ముద్రణ, ప్రింటింగ్
శ్రీ సత్యసాయి	మురుగునీటి శుద్ధి, పవర్ లూమ్స్
శ్రీకాకుళం	మెడికల్ సర్వీసులు, పండ్లు ప్రాసెసింగ్
తిరుపతి	కలంకారి హ్యాండిక్రాఫ్ట్స్, ప్రింటింగ్
విశాఖపట్నం	మెడికల్ సేవలకు కామన్ ఈటీపీ,హెల్త్‌కేర్ సేవలు
విజయనగరం	రైస్ మిల్లులు, హెల్త్‌కేర్ సేవలు
పశ్చిమ గోదావరి	ఆక్వా ప్రాసెసింగ్, హెల్త్‌కేర్
వైఎస్సార్	గోల్డ్, పవర్‌లూమ్స్

కేంద్రానికి ప్రతిపాదనలు..

ఇక ఆయా జిల్లాల్లో ఉన్న డిమాండ్లను గుర్తించి వాటికి అనుగుణంగా రెండేసి క్లస్టర్లను ఎంపికచేసి వాటి ఏర్పాటుపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణ వ్యయంలో కేంద్రం 60 శాతం గ్రాంట్‌గా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించిందన్నారు. మొత్తం 26 జిల్లాలకు సంబంధించి 52 క్లస్టర్లను ఎంపిక చేశామని.. ఇందులో ఇప్పటికే 19 ప్రతిపాదనలకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి పంపినట్లు ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

నాలుగేళ్లలో 12.61 లక్షల మందికి ఉపాధి..

ఇక సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కొత్తగా 2,00,995 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.24,059 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 12,61,512 మందికి ఉపాధి లభించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లోనే 92,707 యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.9,677 కోట్ల పెట్టుబడులతో 3,61,172 మందికి ఉపాధి లభించింది. ఇలా ఎంఎస్‌ఎంఈలు అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తుండటంతో వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. జవహర్‌రెడ్డి 15 రోజులకొకసారి సమీక్ష నిర్వహించి ఈ క్లస్టర్ల అభివృద్ధిపై కలెక్టర్లకు ఆదేశాలను జారీచేస్తున్నారు. తాజాగా జరిగిన సమీక్షలో ఈ ఎఫ్ఎఫ్‌సీల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులను తక్షణం చేయాల్సిందిగా ఆయన కలెక్టర్లను ఆదేశించారు. అదే విధంగా కేంద్రానికి పంపిన ప్రతిపాదనలకు కూడా త్వరగా ఆమోదం లభించేందుకు ఏపీ భవన్ అధికారులతో సంప్రదింపులు నిర్వహించాలని కూడా కోరారు.

45 వేల పాఠశాలలు.. 1.06 కోట్ల పుస్తకాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఒకటి నుంచి 9వ తరగతి వరకు 36 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి అవసరమైన 1,06,82,080 రెండో సెమిస్టర్ పుస్తకాలను శనివారం అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలా సాగిన పుస్తకాల పంపిణీలో విద్యాశాఖ అధికారులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని అమలాపురం ఎంపీపీ స్కూల్‌లోను, ఎస్.రాయవరం మండలంలోని రేవు పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేశారు.

ముందస్తు ప్రణాళిక విజయవంతం

ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు అవసరమైన అన్ని వసతుల కల్పనలోను లోటు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలై నాలుగో శనివారాన్ని 'పుస్తకాల పంపిణీ రోజు'గా పాఠశాల విద్యాశాఖ ముందే ప్రకటించి అందుకు అనుగుణంగా పనులు చేపట్టింది. విద్యార్థులకు పుస్తకాల కొరత ఉండరాదని విద్యా సంవత్సరం ప్రారంభం రోజే అన్ని పుస్తకాలను అందించిన అధికారులు.. నవంబర్‌లో ప్రారంభమయ్యే రెండో సెమిస్టర్‌కు అవసరమైన 1,06,82,080 పుస్తకాలను జూన్ నెలాఖరునాటికే సిద్ధం చేశారు. దీనికోసం పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు. పుస్తకాలను మొదట ప్రింటర్స్ నుంచి స్టాక్ పాయింట్లకు, ఆపై ఈనెల 16వ తేదీ నాటికి మండల కేంద్రాలకు చేరవేశారు. ఉపాధ్యాయులకు ఎలాంటి శ్రమ లేకుండా పౌర సరఫరాల శాఖ సహాయం తీసుకున్నారు. ఈనెల 17వ తేదీ నాటికి ఇంటింటి రేషన్ సరుకుల పంపిణీ పూర్తవడంతో 3,400 ఎండీయూ వాహనాల్లో పుస్తకాలను పాఠశాలలకు చేరవేశారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న 1,000 పాఠశాలలకు అమెజాన్ కొరియర్ సేవలను వినియోగించుకుని పుస్తకాలను పంపిణీ చేశారు. 20వ తేదీనాటికే రాష్ట్రంలోని 45,409 పాఠశాలల్లో రెండో సెమిస్టర్ పుస్తకాలను సిద్ధంగా ఉంచి, శనివారం అన్ని పాఠశాలల్లోను ఒకేసారి పంపిణీ చేశారు.



జగనన్న విద్యాకానుక పంపిణీ సైతం..

ఎలాంటి విమర్శలకు తావులేకుండా 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 43,10,165 మంది విద్యార్థులకు పాఠశాలలు తెరిచిన మొదటిరోజు జగనన్న విద్యా కానుకను అందించి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ప్రణాళికాబద్ధంగా మండలాల్లో స్టాక్ పాయింట్లను సిద్ధం చేయడంతో పాటు ప్రత్యేకంగా ఆయా కేంద్రాల్లో క్వాలిటీ వాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి బైలింగువల్ పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, వర్క్ బుక్స్, కుట్టు కూలితో 3 జతల యూనిఫామ్ క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్-తెలుగు డిక్షనరీ, ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్‌ను బడులు తెరిచిన మొదటి రోజే అందజేసింది. ఇదే ప్రణాళికను సెమిస్టర్-2 పుస్తకాల పంపిణీలోను విద్యాశాఖ అమలు చేసి విజయం సాధించింది.

ఏపీలో మహిళలకు ప్రాధాన్యంపై జర్మనీ ప్రశంస

- క్లీన్ గ్రీన్ సిటీల అభివృద్ధికి సహకరిస్తామన్న ప్రపంచ బ్యాంకు
- అమెరికాలో 'హై లెవెల్ పొలిటికల్ ఫోరం' సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఏపీ స్టాల్



ఏపీలో అమలవుతున్న కార్యక్రమాల ప్లకార్డులతో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఏపీలో మహిళల కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాల కల్పనపై జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు ప్రశంసించారు. నగరాలు, పట్టణాల పరిశుభ్రతకు ఈ-ఆటోలు అందించడం, వాటికి డ్రైవర్లుగా మహిళలనే నియమించడంపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సైతం అభినందనలు తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఇటీవల 'హై లెవెల్ పొలిటికల్ ఫోరం' పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి స్పెషల్ కన్సల్టెటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ రాష్ట్రం తరఫున ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సీఎం జగన్ 'నాడు-నేడు' కింద అమలు చేస్తున్న పలు పథకాలు, మహిళల కోసం ప్రత్యేక పథకాలు, సస్టెయినబుల్ గ్రీన్ సిటీస్ నిర్మాణం గురించి వివరిస్తూ ఫొటోలను ప్రదర్శించారు. వీటిలో ముఖ్యంగా మున్సిపల్ శాఖ చెత్త సేకరణ కోసం ఈ-ఆటోలు అందించడంతోపాటు డ్రైవర్లుగా మహిళలనే నియమించడం, పట్టణ పేద మహిళలకు రూపాయికే ఇల్లు అందించడం వంటి అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ, పట్టణాల్లో సామాజిక అడవులు, రహదారుల వెంబడి మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నట్లు షకిన్‌కుమార్ తెలిపారు. ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరించడం, తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడాన్ని వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారని, క్లీన్ అండ్ గ్రీన్ సిటీల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. రూపాయికే ఇల్లు ఇవ్వడాన్ని యూఎన్ఓలోని అమెరికా ప్రతినిధి బిల్‌గ్రాహం మెచ్చుకున్నారని తెలిపారు.

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

▶ మొదటి పేజీ తరువాయి

సుదీర్ఘ అనుభవం ఉన్న సరిత రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన విశ్లేషాత్మక వ్యాసం ఇలా..

సాధించింది శూన్యం

2020 మార్చి 11న వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి బదిలీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే 120 రోజుల సమయం తీసుకుంది. మరో 474 రోజుల తర్వాత 2021 అక్టోబర్‌లో మొదటి చార్జిషీట్ దాఖలు చేసింది. వివేకా హత్యలో పాలుపంచుకున్నారని చెబుతూ ఎర్ర గంగిరెడ్డి(ఏ-1), సునీల్ యాదవ్(ఏ-2), గజ్జల ఉమాశంకర్ రెడ్డి(ఏ-3), దస్తగిరి(ఏ-4)లను నిందితులుగా పేర్కొంది. ఈ హత్య వెనుక విస్తృత కుట్రను వెలికి తీయాల్సి ఉందని చెప్పింది. సీబీఐ తుది చార్జిషీట్ 2023 జూలై 20న బయటకు వచ్చింది. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వారి సన్నిహితుడు డి.శివశంకర్ రెడ్డిలను కూడా నిందితులుగా పేర్కొంది. కానీ సీబీఐ మొదటి నుంచీ పేర్కొంటూ వచ్చిన విస్తృత కుట్ర గురించి మాత్రం ఏమీ చెప్పలేకపోయింది. హత్య వెనుక ఉద్దేశం అంటూ 14 పేరాల సుదీర్ఘ వ్యాసాన్ని చార్జిషీట్‌లో పొందుపరిచింది. అందులో ఏముంది అంటే అందరికీ తెలిసిన వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబ నేపథ్యం, వంశ చరిత్ర మాత్రమే. ఇది తప్ప వాస్తవానికి హత్య వెనుక విస్తృత కుట్ర గురించి సీబీఐ స్పష్టంగా ఏమీ చెప్పలేకపోయింది. ఇంతకీ ఇంతటి హైప్రొఫైల్ కేసుకు సంబంధించిన తుది చార్జిషీట్‌లో పేర్కొన్న అంశాలు, వాటిలోని వాస్తవాలను పరిశీలిస్తే సీబీఐ దర్యాప్తులో డొల్లతనం బట్టబయలు అవుతోంది. సీబీఐ తాను పేర్కొన్న అభియోగాలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క దానికి కూడా ఆధారం చూపించలేకపోయింది. అంతకు మించి వివేకా హత్య వెనుక ఆయన సొంత కుటుంబంలో విభేదాలు, బయట శక్తుల ప్రమేయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడం విస్మయ పరుస్తోంది. చార్జిషీట్‌లో సీబీఐ ఏం చెప్పింది.. అందులోని వాస్తవం ఏమిటన్నది అంశాల వారీగా పరిశీలిస్తే ఈ కేసులో సీబీఐ ఇప్పటి వరకు సాధించింది శూన్యమన్నది స్పష్టమవుతోంది. సీబీఐ చెప్పిందేమిటి? వాస్తవం ఏమిటి? అన్నది చూద్దాం.

1.వివేకా క్రియాశీలకమైన నేతా?

సీబీఐ: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత. రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు.

వాస్తవం: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత కాదు. హత్యకు గురయ్యే 15 ఏళ్ల ముందు 2004లో చివరిసారిగా ఎన్నికల్లో గెలిచారు. దశాబ్ద కాలంగా రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. 2008లో స్వదేశానికి తిరిగి వచ్చిన వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సోనియా గాంధీని కలిశారు. కానీ ఆయనకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం తిరస్కరించింది. వివేకా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారని ఆయన కుమార్తె సునీతనే సీబీఐకి రెండుసార్లు చెప్పారు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో వైఎస్ విజయమ్మపై పోటీ చేసి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన రాజకీయాల నుంచి రిటైరై పోయినట్టేనని ఆమె చెప్పారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా రాజీనామా చేసిన తర్వాత నుంచి ఆయన ఎలాంటి పదవిలో లేరు. పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మ చేతిలో భారీ తేడాతో ఓడిపోయాక కాంగ్రెస్ పార్టీ కూడా ఆయన్ను పట్టించుకోలేదు. ఎమ్మెల్సీగా కూడా నామినేట్ చేయలేదు. ఆయన అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం కూడా ఇందుకు కారణం అయిఉండొచ్చు.

2.అవినాశ్ బలమైన అభ్యర్థి కాదా?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వైఎస్ అవినాశ్ రెడ్డి బలహీనమైన అభ్యర్థి అని వివేకానందరెడ్డి భావించారని షర్మిల సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు.

వాస్తవం: అవినాశ్‌రెడ్డి బలహీనమైన అభ్యర్థి అన్నది పూర్తిగా అవాస్తవం. ఆయన అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో 1,90,323 ఓట్ల భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచారు. ఆయన ఎంత బలమైన అభ్యర్థో ఆ మెజార్టీనే చెబుతుంది. ప్రత్యేక హోదా సాధన డిమాండ్‌తో పార్టీ నిర్ణయం మేరకు తన ఎంపీ పదవికి 2018లో రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అవినాశ్‌రెడ్డి మరింత భారీ మెజార్టీతో అంటే 3,80,976 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డిపై అంత మెజార్టీ సాధించడం విశేషం. ఏ రకంగా చూసినా అవినాశ్‌రెడ్డి బలమైన అభ్యర్థి అన్నదాంట్లో సందేహం లేదు. వివేకానందరెడ్డి తాను హత్యకు గురికావడానికి ముందు వరకు కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేశారని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. వివేక హత్యకు గురైన ముందు రోజు రాత్రి కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం జమ్మలమడుగులో ప్రచారం చేశారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పినట్టు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డే ఎంపీ అభ్యర్థి అన్న విషయంలో మరో మాటే లేదని వివేకానందరెడ్డి సోదరి వైఎస్ విమల కూడా స్పష్టం చేశారు.

3. షర్మిల వాంగ్మూలంలో చెప్పినదానికి ఆధారం ఎక్కడ?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా షర్మిల కానీ, విజయమ్మ కానీ పోటీ చేయాలని వివేకా భావించారనే విషయాన్ని షర్మిల వెల్లడించారు.

వాస్తవం: కడప ఎంపీ అభ్యర్థిత్వం విషయంపై వివేకానందరెడ్డి తనతో చెప్పినట్టుగా షర్మిల వెల్లడించిన సమాచారానికి ఎలాంటి ఆధారం లేదు. ఎంపీగా తానుగానీ తన తల్లి విజయమ్మగానీ పోటీ చేయాలని వివేకా చెప్పినట్టు వాంగ్మూలం ఇచ్చిన షర్మిల.. అందుకు ఎలాంటి ఆధారం చూపించలేకపోయారు. ఎంపీ టికెట్ అంశంపై వారిద్దరు మాట్లాడుకున్నట్టు కూడా గతంలో ఎప్పుడూ మీడియాలోగానీ పార్టీ వర్గాలుగానీ చెప్పలేదు. వైఎస్ జగన్ సీఎం అయిన రెండేళ్ల తర్వాత షర్మిల సొంతంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ విషయం కూడా ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నదే. ఒక వేళ కడప ఎంపీ అభ్యర్థి విషయంపై వివేకానందరెడ్డికి వేరే అభిప్రాయం ఉన్నా సరే రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపించదు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మపై పోటీ చేసినప్పటి నుంచి వైఎస్సార్ కుటుంబ వ్యవహారాల్లో ఆయన పాత్ర పెద్దగా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ రాజకీయ నిర్ణయాల్లో కూడా ఆయన పాత్ర పెద్దగా ఏమీ లేదన్నది ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ తెలిసిన విషయమే. వివేకానందరెడ్డిపై సానుకూల దృక్పథంతో వైఎస్ జగన్ ఆయన్ను వైఎస్సార్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ చేశారు. కానీ వివేకా ఏనాడూ కూడా పార్టీ ముఖ్య నేతగా ఉండలేదు.

4. ఎమ్మెల్సీ ఎన్నికలపై సీబీఐ చెప్పింది కట్టుకథే

సీబీఐ: 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి కారణం. అవినాశ్‌రెడ్డి అనుచరుడు డి.శివశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావించినప్పటికీ వైఎస్ జగన్ తన చిన్నాన్న వివేకానందరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి పని చేశారు. దాంతో వివేకా ఆగ్రహంతో డి.శివశంకర్‌రెడ్డిని దూషించారు.

వాస్తవం: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ శంకర్‌రెడ్డి కారణమనడానికి సీబీఐ ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. ఆ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 10 నియోజకవర్గాల పరిధిలోని 800 మందికిపైగా ఓటర్లలో ఎవర్ని ప్రలోభాలకు గురిచేశారో కూడా చెప్పలేకపోయింది. ఆ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో సీబీఐ కనీసం మాట్లాడనే లేదు. ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి, ఆయన హత్యకు సంబంధం ఉన్నట్టుగా కూడా సీబీఐ ఎలాంటి ఆధారాన్ని చూపించనే లేదు. రెండేళ్ల క్రితం నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విషయంపై తలెత్తిన వివాదం వల్ల తమను దూషించారనే ఉద్దేశంతో 2019 ఎన్నికల ముందు హత్యకు ఎవరైనా ప్రయత్నిస్తారా? అందులోనూ 2014 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అభ్యర్థి కుటుంబం 2019 ఎన్నికల ముందు హత్య వంటి దుందుడుకు పనులకు ఎందుకు ఒడిగడుతుంది?

బయటి శక్తుల పాత్ర పట్టించుకోని సీబీఐ

వివేకా హత్య కేసు విషయంలో సీబీఐ చెబుతున్న కారణాలేవీ నమ్మదగ్గవిగా లేవు. వాటికి ఎలాంటి ఆధారాలూ లేవు. అదే సమయంలో వివేకా కుటుంబంలో విభేదాలు, ఇతర అంశాలను కూడా లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి కుటుంబంలో విభేదాలు అనే అంశాన్నే సీబీఐ ప్రధానంగా ప్రస్తావిస్తుండటం కేవలం కేసును తప్పుదారి పట్టించేందుకేనని స్పష్టమవుతోంది. వివేకా హత్య వెనుక బయటి శక్తుల ప్రమేయంపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు. ఇప్పటి వరకు కేవలం సీబీఐ అప్రూవర్‌గా మార్చిన నిందితుడు దస్తగిరి, వాచ్‌మేన్ రంగయ్య వాంగ్మూలాలనే ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేస్తోంది. కానీ వారు నిజాలే చెబుతున్నారనడానికి ఆధారం ఏమిటి?

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు

షమీమ్ అనే మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. వివేకా గుండెకు ఆపరేషన్ చేసుకున్నప్పటికీ ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ పులివెందులలో ఉండటం లేదు. హైదరాబాద్‌లో తన కుమార్తె సునీత నివాసంలో ఉంటున్నారు. నెలకు ఒకట్రెండుసార్లు పులివెందుల వచ్చి వెళుతున్నారు. 'షమీమ్‌తో మా నాన్న సహజీవనం చేస్తున్నారని 2011లో బయటపడినప్పటి నుంచి ఆయనతో నేను సఖ్యతగా లేను. పులివెందులకు ఎప్పుడోగాని వెళ్లడం లేదు. 2018లో క్రిస్మస్ తర్వాత మళ్లీ నేను పులివెందుల వెళ్లనే లేదు. నా భర్త ఎన్.రాజశేఖర్‌రెడ్డి మాత్రం అప్పుడప్పుడు వెళుతుండేవారు' అని సునీత చెప్పారు. వివేకానందరెడ్డి తన పేరును అక్బర్‌ఖాన్‌గా మార్చుకుని షమీమ్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు. షమీమ్ కుటుంబం నిర్వహణ బాధ్యత చూస్తుండటంతోపాటు ఆమె చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. బలపనూరులో ఆమె ఇంటి పై అంతస్తును నిర్మించడంతోపాటు 8 సెంట్ల స్థలం కొన్నారు. ఇక వివేకా మొదటి భార్య సోదరులు తనను బెదిరించేవారని షమీమ్ సీబీఐకి చెప్పారు. పెద్ద భార్య పెద్ద సోదరుడు శివప్రకాశ్‌రెడ్డి తన ఇంటికి వచ్చి బెదిరించారని తెలిపారు. తన కుమారుడికి హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సీటు ఇప్పించడంతోపాటు అక్కడే ఓ ఇల్లు కొనిచ్చి.. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వివేకా షమీమ్‌కు మాట ఇచ్చారు. అంతలోనే వివేకా హత్యకు గురయ్యారు.

అప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వివేకా

వివేకానందరెడ్డి షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడంతోపాటు ఆస్తి ఇస్తానని చెప్పడంతో మొదటి భార్య కుటుంబం ఆగ్రహించింది. కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకు చెక్ పవర్ రద్దు చేసింది.చెక్‌పవర్ రద్దు కావడంతో వివేకా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. మద్యం, ఇతర అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేక అల్లాడిపోయారని వివేకా ఇంట్లో పనివానిగా ఉన్న పెంచింటి రాజశేఖర్ చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన సునీల్ యాదవ్, దస్తగిరిలతో సన్నిహితమయ్యారు. వారు చెప్పినట్టు చేస్తే వారిద్దరు డబ్బులు తెస్తారని ఎర్ర గంగిరెడ్డి వివేకాతో చెప్పేవారు. ఎనిమిది మంది నుంచి రూ.5 కోట్లు అప్పు తీసుకున్నారు. ఓసారి పెందింటి రాజశేఖర్ వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. తమ ఇంట్లో డబ్బు కోసం ఏదో గొడవ జరుగుతోంది.. వివేకానందరెడ్డి బాగా తాగేసి గొడవ చేస్తున్నారని చెప్పారు. 'మా నాన్న వివేకా ఇష్టానుసారంగా అప్పులు చేసి, తీర్చకపోవడంతో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ట్రాక్ రికార్డ్ సరిగా లేకపోవడంతో కంపెనీలకు బ్యాంకులు అప్పులు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. కంపెనీల నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు అడ్డంకిగా ఉండకూడదనే మా నాన్న చెక్ పవర్‌ను రద్దు చేశాం' అని సునీత చెప్పారు. వాస్తవం ఏమిటంటే.. వివేకానందరెడ్డి హత్య తర్వాత ఆయన స్థానంలో సునీత ఆ కంపెనీల్లో డైరెక్టర్ అయ్యారు. జీవించి ఉండగా రోజువారి ఖర్చుల కోసం వివేకా ఇబ్బందులు పడ్డారు. కానీ ఆయన మరణించిన తర్వాత కొన్ని నెలలకే నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆ కంపెనీ అప్పులన్నీ చాలా వరకు తీర్చేశారు. కంపెనీలన్నీ గాడిలో పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో 93 ఎకరాల భూమిని సౌభాగ్యమ్మ, సునీత పేరిట బదిలీ చేశారు.

పేదల గుండెల్లో జగనన్న

1,028వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు


రిలే దీక్షల్లో బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదల కలలు సాకారం చేస్తున్న జగనన్న ఎప్పటికీ తమ గుండెల్లో నిలిచే ఉంటారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టంచేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం 1,028వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ సీఆర్డీఏ చట్టంలో పొందుపరచిన విధంగానే 5 శాతం భూమిని పేదలకు కేటాయించి అందులో పట్టాలిచ్చి, ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. అయితే వ్యవస్థలను తప్పుదారి పట్టించి ఏదో జరుగుతుందనే భావన కల్పించడమే లక్ష్యంగా ఎల్లో మీడియా, బాబు అండ్ కో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని చెప్పారు. ఈ నెల 24న జరిగే పట్టాల పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బహుజనులు లక్షలాదిగా హాజరై తమ సంఘీభావం తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

గిరిజన యువకుడిపై మూత్రం పోసిన కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఒంగోలు టౌన్: గిరిజన యువకుడు మోటా నవీన్‌పై దాడిచేసి మూత్రం పోసిన కేసులో ప్రధాన నిందితుడు మన్నెం రామాంజనేయ చౌదరిని అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ వి.నారాయణరెడ్డి తెలిపారు. ఒంగోలులోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన ఈ కేసు వివరాలు వెల్లడించారు. నవీన్‌పై దాడి కేసులో మొత్తం 9 మంది నిందితులు ఉండగా, తొలుత ఆరుగురిని అరెస్టు చేశామని... ఇప్పుడు మిగిలిన ముగ్గురు మన్నెం రామాంజనేయ చౌదరి, అప్పిబోయిన ఏకాంబరం నరేంద్ర, చేపల ప్రభును కూడా అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గతంలో నవీన్, రామాంజనేయ చౌదరి కలిసి దొంగతనాలు చేసేవారని తెలిపారు. వారు విడిపోయిన తర్వాత ఒకసారి తనపై నవీన్ దాడిచేసి మూత్రం పోశాడని.. దానికి ప్రతీకారంగానే ఇప్పుడు ఒక బాలిక విషయమై రాజీ పేరుతో పిలిచి నవీన్‌పై దాడి చేసి మూత్రం పోసినట్లు నిందితుడు రామాంజనేయ చౌదరి చెప్పాడని డీఎస్పీ వెల్లడించారు.

ఉక్కు ఉద్యమానికి మద్దతుగా కాంగ్రెస్ పాదయాత్ర


మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

కూర్మన్నపాలెం(గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్షలు 900వ రోజుకు చేరుతున్న సందర్భంగా శనివారం గాజువాకలోని జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్' పేరుతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వరంగం సర్వనాశనమైందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆగస్టులో రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం కార్మికులు చేస్తున్న దీక్షకు సంఘీభావం తెలియజేస్తారని చెప్పారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు మౌనం వీడి ముందుకురావాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, నాయకులు రాకేష్‌రెడ్డి, గొంప గోవింద్, లక్కరాజు రామారావు, వేగి వెంకటేష్, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు సన్నద్ధం



సచివాలయాలు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీలు

- మొత్తం 2.99 లక్షల మ్యాచ్‌ల నిర్వహణ
- అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు నిర్వహించాలన్న సీఎం జగన్ ఆదేశాల మేరకు.. అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పురుషులు, మహిళలకు అన్ని స్థాయిల్లో కలిపి మొత్తం 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వీటితో పాటు సంప్రదాయ క్రీడల్లో కూడా పోటీలు నిర్వహించాలని సూచించారు. వీటి నిర్వహణకు అవసరమైన అన్ని క్రీడా మైదానాలను గుర్తించి.. సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే అవసరమైనంత మంది పీఈటీలు, పీడీలను కూడా సన్నద్ధం చేయాలని స్పష్టం చేశారు. పోటీల నిర్వహణ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇంజినీర్లు, పంచాయతీరాజ్ ఈవోలకు తగిన ఆదేశాలివ్వాలని సూచించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు రవాణా, ఆహారం, వసతి ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో పోటీల నిర్వహణకు మొత్తం 46 రోజులు పడుతుందన్నారు. అన్ని మ్యాచ్‌లు సంబంధిత చీఫ్ కోచ్ రూపొందించిన ప్రణాళిక ప్రకారమే నిర్వహించాలని స్పష్టం చేశారు.

ప్రతి స్థాయిలో పోటీల నిర్వహణకు ఆర్గనైజింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి స్థాయిలోనూ ఆర్గనైజింగ్ కమిటీలు, టెక్నికల్ కమిటీలు కలిసి పోటీల నిర్వహణకు గ్రౌండ్లు ఖరారు చేయాలని.. క్రమశిక్షణ కోసం ఒక గేమ్ ఇన్‌చార్జ్, వెన్యూ ఇన్‌చార్జ్‌ను నియమించాలని ఆదేశించారు. గ్రౌండ్స్ ప్రిపరేషన్ కమిటీలు, నాణ్యత కమిటీలు, కిట్స్ మానిటరింగ్ సెల్, లాజిస్టిక్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాల్లో అందుబాటులో ఉన్న ప్రముఖ క్రీడాకారులను అంబాసిడర్లుగా నియమించాలని సూచించారు. టోర్నీకి సంబంధించిన మెటీరియల్ నాణ్యతను ముందుగా జిల్లా స్థాయి క్వాలిటీ కంట్రోల్ కమిటీ ధ్రువీకరించాలని.. ఆ తర్వాతే వాటిని పోటీల నిర్వహణ కోసం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే క్రీడా శాఖతో పాటు పాఠశాల విద్యా శాఖ, ఉన్నత విద్యా శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపల్, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, సమాచార శాఖలకు పోటీల నిర్వహణకు సంబంధించిన పలు బాధ్యతలను సీఎస్ జవహర్‌రెడ్డి అప్పగించారు.

కొత్త కొత్తగా గ్రామాలకు రహదారులు

- గ్రామీణ ప్రాంతాల్లో 916.22 కి.మీ. కొత్త రోడ్లు
- సమీప పట్టణాలకు కలిపే 115 రోడ్లు పూర్తి స్థాయిలో ఆధునీకరణ
- 72 పెద్ద బ్రిడ్జిలు కూడా.. వీటి పొడవే దాదాపు ఏడు కిలోమీటర్లు
- రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం
- వీటి నిర్మాణానికి రూ. 1,045.44 కోట్లు ఖర్చు
- అందులో రూ. 459.38 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానివే...
- ఆగస్టులో టెండర్లు.. త్వరలో ఆధునీకరణ పనులు

సాక్షి, అమరావతి : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం కొత్తగా మరో 115 రోడ్లను పూర్తిగా ఆధునీకరించబోతోంది. రాష్ట్ర–కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో చేపట్టే పీఎంజీఎస్‌వై కార్యక్రమంలో రాష్ట్రానికి మరో 916.22 కిలోమీటర్ల పొడవున కొత్త తారు రోడ్ల నిర్మాణం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్రం అనుమతి తెలిపింది. ఈ మేరకు కేంద్రం గ్రామీణాభివృద్ధి శాఖ శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు లేఖ రాసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 72 పెద్ద వంతెల నిర్మాణానికి కూడా అనుమతి తెలిపింది. ఈ 72 బ్రిడ్జిల మొత్తం పొడవే 6,918.97 మీటర్లు (దాదాపు ఏడు కిలోమీటర్లు). వీటిలో 22 బ్రిడ్జిలు ఒక్కొక్కటి 150 మీటర్లకంటే ఎక్కువ పొడవు ఉంటాయని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. కొత్త తారురోడ్ల నిర్మాణానికి రూ.576.15 కోట్లు, వంతెనల నిర్మాణానికి రూ.469.29 కోట్లు.. మొత్తం రూ.1,045.44 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో రూ.459.38 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి ముందుకొచ్చింది. ఈ రోడ్లలో గ్రామాలను సమీప పట్టణ ప్రాంతాలకు, లేదంటే కాలేజీ, మార్కెట్ యార్డు, పెద్ద ప్రభుత్వాసుపత్రి, మండల కేంద్ర స్థాయి పెద్ద గ్రామాలను కలిపేవేనని అధికారులు వివరించారు. ఈ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కూడా పొంది, ఆగస్టు మొదటి వారంలో టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ బి. బాలునాయక్ 'సాక్షి'కి తెలిపారు. సెప్టెంబరు ఆరంభంలోనే టెండర్ల ప్రక్రియ కూడ ముగుస్తుందన్నారు.

నాలుగేళ్లలో పీఎంజీఎస్‌వైలోనే 2,759 కి.మీ.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో 1.25 లక్షల కిలోమీటర్ల పాత రోడ్ల ఆధునీకరణకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2019 జూలైలో పీఎంజీఎస్‌వై–3 కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకయ్యే ఖర్చులో రాష్ట్రాలు 40 శాతం, కేంద్రం 60 శాతం భరించాలి. పీఎంజీఎస్‌వై –3లో మన రాష్ట్రానికి మొత్తం 3,285 కిలోమీటర్ల పొడవున రోడ్ల ఆధునీకరణకు అప్పట్లో కేంద్రం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిల పొడవు అధికంగా ఉంటే నిర్ణీత నిష్పత్తికన్నా రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు భరించాల్సి ఉంటుంది. కాగా, గత నాలుగేళ్లలో రాష్ట్రంలో 2,308 కిలోమీటర్ల పొడవు ఉండే 300 రోడ్లకు కేంద్రం ఆమోదం తెలపగా, ఇందులో 1,879 కిలోమీటర్ల రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. 2020లో కొన్ని, 2022లో మరికొన్ని చొప్పున రాష్ట్రంలో 300 రోడ్ల పనులు మొదలవగా.. వీటిలో 245 రోడ్ల పనులు పూర్తయినట్టు అధికారులు వివరించారు.

- పీఎంజీఎస్‌వై, నక్సల్స్ తీవ్రవాద ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఉద్దేశించిన పథకం కింద గతంలో టీడీపీ హయాంలో కేంద్రం మంజూరు చేసిన 880 కిలోమీటర్ల రోడ్ల పనులను చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వీటికి అప్పట్లో కేంద్రం నిధులు విడుదల చేసిన ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ రోడ్లను కూడా పూర్తిచేసింది. వీటిని కూడా కలుపుకొంటే గత నాలుగేళ్లలో ఒక్క పీఎంజీఎస్‌వై కార్యక్రమంలోనే మొత్తం 2,759 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని జగన్ ప్రభుత్వం పూర్తి చేసింది.
- పీఎంజీఎస్‌వై–3లో రాష్ట్రానికి కేటాయించిన 3,285 కి.మీ.లో తాజాగా మంజూరు చేసిన రోడ్లతో కలిపి మొత్తం 3,224.22 కి.మీ. రోడ్లకు ఈ నాలుగేళ్లలో కేంద్రం అనుమతించింది. మిగిలిన 60 కిలోమీటర్ల పనులకు కూడా ప్రతిపాదనలను కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

వారిది ఆత్మగౌరవ దీక్ష కాదు.. మహిళల ఆత్మవంచన దీక్ష

- టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనితను చూసి మహిళా జాతి సిగ్గుపడుతోంది
- వారి స్పీచ్‌లు చూస్తే వారి పిల్లలే చెప్పులతో కొడతారు
- మహిళల పాలిట సైకో చంద్రబాబు
- టీడీపీ అంటే తెలుగు దుశ్శాసనుల పార్టీ
- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: విజయవాడలో టీడీపీ, మిగతా పార్టీల్లో ఉన్న తెలుగుదేశం సానుభూతిపరులు నిర్వహించింది మహిళల ఆత్మగౌరవ దీక్ష కాదని, మహిళల ఆత్మవంచన దీక్ష అని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి అన్నారు. ఆమె శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆ వేదిక మీద టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనిత ఉన్నందున అది ఆత్మవంచన దీక్షే అవుతుందన్నారు. మహిళలను నిత్యం దూషించి, అవమానించే అనితను చూసి మహిళా జాతి సిగ్గుపడుతోందన్నారు. మహిళల్ని మోసం చేసి, మహిళల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన పార్టీ టీడీపీ అని, అది తెలుగు దుశ్శాసనుల పార్టీ, తెలుగు డర్టీ పార్టీ అని మండిపడ్డారు. అనిత, ఆమె వెంట ఉన్నవారి ప్రెస్‌మీట్‌లు, స్పీచ్‌లు చూస్తే వారి పిల్లలే అసహ్యించుకొని చెప్పులతో కొడతారని చెప్పారు. మరోసారి భారతమ్మను, విజయమ్మను దూషిస్తే మహిళలందరూ బురదలో ముంచిన చెప్పులతో కొడతారని హెచ్చరించారు. ఆడబిడ్డల పుట్టుకనే అవహేళన చేసిన మహిళా ద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. జగనన్న ఇంట్లో మహిళల మీద అసభ్యకరమైన ట్రోల్స్ చేసిన సైకో, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌తో ఎంతోమంది మహిళల ఆత్మహత్యలకు కారణమైన వ్యక్తులకు సపోర్టు చేసిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, సాధికారత దిశగా నడిపిస్తున్నారని చెప్పారు. మహిళల భద్రతకు సీఎం జగనన్న తీసుకున్న చర్యలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. మహిళల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే 10 నిమిషాల్లోనే దిశ వెహికల్ వెళ్లి రక్షించే వ్యవస్థ ఏర్పాటు చేశారని వివరించారు.

మణిపూర్ ఘటనలు చాలా దారుణం

మణిపూర్ ఘటనలు చాలా దారుణమని కల్యాణి అన్నారు. ఇలాంటి ఘటనలు టీడీపీ పాలనలో రాష్ట్రంలోనూ జరిగాయన్నారు. పెందుర్తి నియోజకవర్గం జెర్రిపోతులపాలెంలో నాటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అనుచరులు ఎస్టీ మహిళను వివస్త్రను చేసి రోడ్డుపై హింసించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

విమానం ఎగురుతుండగా డోర్ తీసేందుకు యత్నం

- అరెస్టు చేసిన బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం పోలీసులు
- నిందితుడు రాజమండ్రికి చెందిన వ్యక్తి

దొడ్డబళ్లాపురం: విమానం ఆకాశంలో ఎగురుతుండగానే డోరు తెరవడానికి ప్రయత్నించిన ప్రయాణికుణ్ణి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 15న ప్యారిస్ నుంచి ఎయిర్ ఫ్రాన్స్ విమానం బెంగళూరుకు వస్తోంది. బెంగళూరుకు చేరడానికి ఇంకా నాలుగు గంటలు ఉండగా అందులో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన వెంకట్ మోహిత్ (29) అనే ప్రయాణికుడు వింతగా ప్రవర్తించసాగాడు. విమానం వెనుక ఎడమ వైపు ఉన్న తలుపును తెరవడానికి ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. విమానం బెంగళూరుకు చేరిన తర్వాత సిబ్బంది ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసుకుని వెంకట్ మోహిత్‌ను అరెస్టు చేశారు. తర్వాత బెయిల్‌పై అతడిని విడుదల చేశారు.

ఆస్తి రాసివ్వలేదని.. కన్నపేగుపై పగ!

జీవితం చాలా విచిత్రమైనది. వయస్సులో భార్య, పిల్లల పోషణకే సరిపోతుంది. ముదసలి వచ్చేసరికి బిడ్డలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కడుపున పుట్టిన నలుసు సక్రమంగా నడుచుకుంటే పర్లేదు. లేకుంటే నరకం అనుభవించాల్సి వస్తుంది. ఇలాంటిదే చంద్రగిరి నియోజకవర్గంలో వెలుగు చూసింది. తల్లిదండ్రులను సక్రమంగా చూసుకోని ఓ కొడుకు తమపేరుపై ఉన్న 0.75 సెంట్ల భూమిని తన పేరున రాసివ్వలేదని కక్ష పెంచుకున్నాడు. భార్యతో కలిసి కన్నతల్లిదండ్రులను రాసిరంపాన పెట్టడం మొదలుపెట్టాడు. ఇంటి నుంచి వెళ్లగొట్టి బతకనీయకుండా నరకం చూపిస్తున్నాడు. పాడుబడిన ఇంటికీ కరెంట్ లేకుండా చేసి వేడుక చూస్తున్నాడు. నిత్యం వేధింపులు భరించలేక మనసు చంపుకుని ఆ వృద్ధ తల్లిదండ్రులు కన్నకొడుకుపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కినా ఫలితం లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అసలు ఎందుకు.. ఏంటో మీరే చదవండి..

- భార్యతో కలిసి చిత్రహింసలు
- కన్నకొడుకుపై పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులను కొట్టి బయటకు గెంటేశాడు ఓ ప్రబుద్ధుడు. తాను ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులను బయటకు నెట్టేసి 15 రోజులు కావస్తున్నా కనికరించలేదు ఆ కసాయి కొడుకు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని ఆ వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురానికి చెందిన తులసి, రఘునాథ్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. అష్టకష్టాలు పడి ఇద్దర్నీ చదివించి పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కుమారుడు బాలాజీ వకుళమాత ఆలయం వద్ద హోంగార్డుగా పనిచేస్తున్నాడు. రఘునాథ్‌కు శ్రీనివాసమంగాపురం సమీపంలో 0.75 సెంట్ల భూమి, రెండు ప్లాట్లు ఉన్నాయి. ఈ ఆస్తి తనపేర రాసి ఇవ్వాలని కుమారుడు బాలాజీ నిత్యం తల్లిదండ్రులను వేధించేవాడు. ఆస్తి కోసం ఏడు నెలల క్రితం తల్లిదండ్రులను తీవ్రంగా కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. మరళా పెద్దలు సర్ది చెప్పడంతో వారిని ఇంట్లోకి చేర్చుకున్నాడు.


చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేసిన రఘునాథ్, తులసీ దంపతులు

ఆకలి కేకలు!

కోడలు కూర్చొని ఉంటే వృద్ధులైన అత్తామామలు ఇంటి పని, వంటపని చేయాలి. లేదంటే పిడికెడు మెతుకులు రాలవు. కాలుచెయ్యి ఆడేటప్పుడే ఇలా ఉంటే మంచాన పడితే ఎలా అని రఘునాథ్ భార్య తులసి బోరున విలపిస్తోంది. ఆస్తి మొత్తం రాసివ్వాలని, లేదంటే 'చచ్చిపోండి' అంటూ కుమారుడు బాలాజీ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ రాసుకోనీయకుండా ఆధార్ కార్డు కూడా పెరికిపెట్టుకున్నాడని వాపోయారు. ప్రాధేయపడినా కొడుకు కనికరించడంలేదని, నాకు ఆస్తి రాసి ఇచ్చే వరకు ఏమీ ఇవ్వనని మరొకసారి కొట్టి తరిమేశాడని కన్నీటిపర్యంతమయ్యారు.

వేధింపులు తీవ్రతరం

కొడుకు బాలాజీ కొట్టితరిమేయడంతో గ్రామంలోనే ఓ పాడుబడిన ఇంట్లో 15 రోజులుగా తలదాచుకుంటున్నామని రఘునాథ్ తెలిపారు. అయినా అక్కడ కూడా ఉండకుండా చేయాలని ఆ ఇంటికి కరెంట్ కూడా కట్ చేశాడని ఆరోపించారు. ప్రస్తుత అప్పు చేసి పిడికెడు మెతుకులు తింటున్నామని తెలిపారు. కరెంటు లేని ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వాపోయారు. 15 రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆస్తి కోసం వేధిస్తున్న కొడుకు నుంచి తమకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోతే తమకు చావే శరణ్యమని కన్నీళ్లు పెట్టుకున్నారు.

పేదింట క్రీడా 'స్ఫూర్తి' నైనా

- రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం కైవసం
- అండర్–11 విభాగంలో నంబర్ వన్

కారెంపూడి: పేదింటి గిరిజన బాలిక టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. ప్రస్తుతం అండర్–11 స్టేట్ ర్యాంకింగ్‌లో నంబర్ వన్‌గా నిలిచి ఆగస్టులో బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమౌతోంది. జాతీయస్థాయిలో కూడా సత్తా చాటి ఒలంపిక్స్‌లో ఆడాలని కలలు కంటున్నది ఆమె.




గోల్డ్ మెడల్ అందుకుంటున్న స్ఫూర్తి నైనా, టేబుల్ టెన్నిస్ ఆడుతున్న స్ఫూర్తి నైనా (ఫైల్ ఫొటోలు)

పేదింటి నుంచి...

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చదల ఏసుబాబు కుమార్తె స్ఫూర్తి నైనా. ఏసుబాబు తండ్రి ఆటోడ్రైవర్, తల్లి వ్యవసాయ కూలి. వారిద్దరూ నిరక్షరాస్యులే. ఏసుబాబే వారి వంశంలో తొలి తరం విద్యాభ్యాసకుడు. వ్యాయామ ఉపాధ్యాయునిగా ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు. కుమార్తె, కుమారుడు. స్ఫూర్తినైనా కారెంపూడిలోని ప్రైవేటు స్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. చదువులోనూ చురుగ్గా ఉంటూ మరోవైపు టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటుతూ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ అండర్–11లో నంబర్ వన్‌గా ఎదిగింది. కుటుంబ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ తండ్రి ఏసుబాబు కూడా బాలికను ఉన్నత స్థానంలో చూడాలని శ్రమిస్తున్నాడు.

తండ్రి శిక్షణతోనే విజయపథంలో..

పేదరికం వల్ల శిక్షణ ఇప్పించలేని పరిస్థితి. దీంతో తండ్రే బాలికకు ఇంట్లో ఏర్పాట్లు చేసి శిక్షణ ఇస్తున్నాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. 2022లో విజయవాడ, గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. కానీ పట్టు వీడకుండా జులై 8, 2023లో రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అండర్ 11 విభాగంలో నంబర్ వన్‌గా నిలిచి బంగారు పతకం అందుకుంది. బెంగళూరులో ఆగస్టులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం అవుతోంది.

ఏకలవ్య సాధన

ఒకప్పుడు తండ్రి ఏసుబాబు జిల్లా క్రికెట్ టీంలో ప్రతిభ చూపాడు. కానీ అతనికి ఇంకా ఎదిగే అవకాశం రాలేదు. దీంతో తన కుమార్తెలో ఏదో ఒక క్రీడలో ప్రతిభను చూడాలని తాపత్రయ పడ్డాడు. టేబుల్ టెన్నిస్‌లో పాప ఏకాగ్రతను పసిగట్టి తనకు టేబుల్ టెన్నిస్ రాకున్నా సాధన చేసి నేర్చుకుని కుమార్తెకు శిక్షణ ఇస్తున్నాడు. స్వతహాగా ఏకలవ్య ఏకాగ్రత ఉన్న స్ఫూర్తినైనా తండ్రి చెబుతున్న మెలకువలను వంట బట్టించుకుని క్రీడలో సత్తా చాటుతోంది. ఏ నాటికైనా ఒలంపిక్స్‌లో ఆడి సత్తా చాటాలని స్ఫూర్తినైనా కలలు కంటోంది.

మరో ఏడాదే...

కానీ పేదరికం అడ్డుగోడలా నిలుస్తోంది. తండ్రి ఏసుబాబు జీతం కుటుంబ పోషణకు, ఇద్దరు పిల్లలను చదివించడానికే సరిపోతోంది. కుటుంబ ఖర్చులు తగ్గించుకుని కుమార్తెను పోటీలకు తీసుకెళ్తున్నాడు. పాండిచ్చేరి, వడోదర, హైదరాబాద్‌లలో జరిగిన జాతీయ పోటీలకు తీసుకెళ్లాడు. వందల మందిని వెనుకకు నెట్టి 29వ స్థానం దాకా చేరుకుంది. 11 ఏళ్లు నిండడానికి మరో ఏడాది సమయం ఉంది. ఈలోగా జాతీయ స్థాయిలో రాణిస్తే నైనా కలలు నిజమయ్యే తరుణం ఆసన్నమవుతుంది.

నాట్యంలో నర్తకీ 'మణులు'

జాతీయస్థాయిలో అద్భుత ప్రతిభ చాటిన గుంటూరు నృత్య కారిణులు


శ్రీకాళహస్తిలో పొందిన అవార్డులతో నాట్య గురువు వనజ శేఖర్, నృత్య కళాకారిణులు

గుంటూరు ఎడ్యుకేషన్: నాట్యంలో ఆరితేరిన నృత్య కారిణులు రాయలసీమ గడ్డపై గుంటూరు కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. తమ నటనా సంపత్తితో శ్రీకాళహస్తీశ్వరునికి నాట్య నీరాజనం సమర్పించారు. సిటిజన్ వెల్ఫేర్ ఫోరం అండ్ ఫ్రెడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15,16వ తేదీల్లో శ్రీకాళహస్తిలో 'నటరాజ నాట్యాంజలి' పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో గుంటూరు నగరంలోని శ్రీనగర్ ఏడో లైనుకు చెందిన అనూ డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం భాగస్వాములయ్యారు. మన రాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నాట్య కారిణులతో పోటీ పడి నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. అత్యంత క్లిష్టమైన కళింగ నర్తనతోపాటు నవదుర్గ, అన్నమాచార్య కీర్తనలు ప్రదర్శనలకు ప్రేక్షకులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. గుంటూరు నగరంతోపాటు వట్టిచెరుకూరు నుంచి 20 మంది నృత్య కారిణులతోకూడిన బృందం శ్రీకాళహస్తిలో అద్భుతమైన ప్రదర్శనలతో భక్తులు, కళాభిమానులను ఆకట్టుకుంది. సోలో, బృంద నాట్యాలకుగాను ప్రశంసాపత్రం, బంగారు పతకంతోపాటు నాట్యమయూరి, శివనంది, శ్రీ గరుడ ఎక్స్‌లెన్స్, శ్రీకృష్ణదేవరాయ అవార్డులను అందుకున్నారు. నృత్య శిక్షకురాలు వనజ శేఖర్‌ను నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించారు.

కాణిపాకంలో శాశ్వత రీతిలోనృత్య ప్రదర్శనలు

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రతి ఏటా వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అనూ డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం ప్రదర్శనలు ఇస్తోంది. నృత్యంలో ఉత్తమ ప్రతిభ, క్రమశిక్షణతో నృత్యకారిణులు ఇస్తున్న ప్రదర్శనలపై ప్రశంసలు కురిపించిన దేవస్థాన పాలకమండలి ప్రతి ఏటా కాణిపాక బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చేందుకు గుంటూరులోని అనూ డ్యాన్స్ అకాడమీకి శాశ్వత రీతిలో ఆహ్వానం పలికారు. రెండేళ్లపాటు వరుసగా ప్రదర్శనలు ఇచ్చిన నృత్య బృందం సెప్టెంబర్‌లో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో మరోసారి ప్రదర్శనలు ఇవ్వనుంది. వినాయకచవితి, దసరా ఉత్సవాల సమయంలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, దేవస్థానాల్లో నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీ మారింది.

గుంటూరుకు గుర్తింపు

శ్రీకాళహస్తిలో మొదటిసారిగా ఇచ్చిన ప్రదర్శన ద్వారా నృత్య కారిణులు నిర్వాహకులతోపాటు కళాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. నాట్యంపై ఎంతో శ్రద్ధగా శిక్షణ పొందుతున్న చిన్నారులు, తల్లిదండ్రుల సహకారంతో జాతీయస్థాయి పోటీల్లో గుంటూరుకు గుర్తింపు తీసుకురాగలిగాం.

– టి.వనజ శేఖర్, నాట్య గురువు, అనూ డ్యాన్స్ అకాడమీ

చిన్నతనం నుంచి తల్లి శిక్షణలో..

నాట్య శిక్షకురాలైన అమ్మ వద్ద చిన్నతనం నుంచి నృత్యంలో శిక్షణ పొందాను. శ్రీకాళహస్తిలో ఇచ్చిన సోలో, బృంద నాట్య ప్రదర్శనకు శ్రీ గరుడ, శివనంది అవార్డులు అందుకున్నాను.

–టి.జ్ఞానితి, నృత్యకారిణి

ప్రాణంతో సమానంగా నాట్యం

నాకు నాట్యం అంటే ప్రాణం. ఆరేళ్లుగా నాట్యంలో శిక్షణ పొందుతున్నాను. నాతోపాటు నా చెల్లెలు కావ్యశ్రీ వైభవి నృత్యంలో శిక్షణ పొందడంతోపాటు నృత్య ప్రదర్శనలు ఇస్తోంది.

– కన్నేపల్లి హిమ శ్రీవైష్ణవి, నృత్యకారిణి



ఏ రాజు దరిద్రులకు సత్యముగా న్యాయము తీర్చునో ఆ రాజు సింహాసనము నిత్యముగా స్థిరపరచబడును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.పంచమి ఉ.7.54 వరకు, తదుపరి షష్ఠి **నక్షత్రం:** ఉత్తర సా.4.55 వరకు, తదుపరి హస, **వర్జ్యం:** రా.1.59 నుండి 3.40 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.42 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.04 నుండి 10.43 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జె.పి. నడ్డా (బీజేపీ అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తొలిరోజు పార్లమెంటు సమావేశాలు మొదలైన కాసేపటికే కిషన్ రెడ్డి నుండి నాకు ఫోన్ కాల్ వచ్చింది! కిషన్ రెడ్డి ఉండేది లోక్‌సభలో. నేనుండేది రాజ్యసభలో.

"జీకే.. ఏమైంది! మణిపుర ఇన్సిడెంట్ గురించైతే మనం బ్రేక్‌లో మాట్లాడుకోవచ్చు కదా.." అన్నాను.

"నేను లోక్‌సభలో లేను నడ్డాజీ.. హైదరాబాద్‌లో ఉన్నాను.." అన్నాడు జీకే!

"హైదరాబాదా! సరే, నేనే నీకు బ్రేక్‌లో ఫోన్ చేస్తాలే.." అని కాల్ కట్ చేశాను.

కిషన్ రెడ్డి సెంట్రల్ మినిస్టర్. టూరిజం, కల్చర్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి... ఈ మూడు శాఖలూ ఆయనవే. మణిపుర కూడా ఈశాన్య రాష్ట్రమే కనుక అక్కడ జరుగుతున్న ఘోరాతిఘోరాలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తానని చెప్పడానికైనా ఫోన్ చేసి ఉంటాడా! మణిపుర ఘటనపై మోదీజీ ఆల్రెడీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాక, కిషన్ రెడ్డి కూడా ఎందుకు తన రాజీనామాతో పార్టీని దిగ్భ్రాంతి పరచడం?!

బ్రేక్‌లో బయటికి వచ్చాక కిషన్ రెడ్డికి కాల్ చేయడానికి ఫోన్ తీశాను. మిస్డ్ కాల్స్!



అన్నీ కిషన్ రెడ్డి నుంచే!! వెంటనే ఫోన్ చేశాను. లిఫ్ట్ చేయలేదు. మళ్లీ చేశాను. మళ్లీ ఎత్తలేదు. ఏమై ఉంటుంది?! కిషన్ రెడ్డి కాస్త మెతక. సంజయ్‌లా స్ట్రాంగ్ కాదు. సంజయ్ కేసీఆర్‌ను కేసీఆర్ అనగలడు. కిషన్ రెడ్డి కేసీఆర్‌ను 'కేసీఆర్ గారు' అని మాత్రమే అనగలడు.

బ్రేక్ తర్వాత తిరిగి రాజ్యసభ లోపలికి వెళుతుంటే తెలంగాణ బీజేపీ లోక్‌సభ ఎంపీలు ఎదురయ్యారు. "కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారట నడ్డాజీ.." అని చెప్పారు!

"అరెస్టు చేసి?" అని అడిగాను.

"విడిచి పెట్టారట.." అన్నారు.

ఆ అరెస్టుకు, విడిచి పెట్టడానికి మధ్యలో కిషన్ రెడ్డి కాల్స్ నేను, నా కాల్స్ కిషన్ రెడ్డి మిస్ అయినట్లున్నాం!

రెండో రోజు ఉదయాన్నే మళ్లీ కిషన్ రెడ్డి నుండి నాకు కాల్ వచ్చింది!

"చెప్పు జీకే! డబుల్ ఇళ్లు ఎంతవరకు వచ్చాయో చూద్దానికి వెళితే కేసీఆర్ నిన్ను అరెస్ట్ చేయించాడట కదా.. ఈరోజు ఎక్కడికి వెళుతున్నావ్?" అని పెద్దగా నవ్వాను.

కిషన్ రెడ్డి కూడా నవ్వాడు.

"నడ్డాజీ! ఉదయాన్నే చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్‌కి వెళుతున్నా, అక్కడి నుంచి బషీర్‌బాగ్‌లో కనకదుర్గ టెంపుల్, ఆ తర్వాత అంబర్‌పేట జ్యోతీరావు ఫూలే స్టాచ్యూ, తర్వాత ట్యాంక్ బండ్ అంబేడ్కర్ స్టాచ్యూ, ఆ తర్వాత అసెంబ్లీ ఎదురుగా అమర వీరుల స్మారక స్తూపం.. అక్కడి నుంచి నాంపల్లిలో మన పార్టీ ఆఫీసుకి.." అని చెప్పాడు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు జీకేని తెలంగాణ పార్టీకి అధ్యక్షుడిని చేశాం కదా అని! నాకింకా మైండ్‌లో సంజయే ఉన్నాడు.

"మంచిది జీకే! నువ్వేమిటో కేసీఆర్‌కి చూపించాలి.." అన్నాను.

"అలాగే నడ్డాజీ! నేనేమిటో కేసీఆర్ గారికి చూపిస్తాను" అన్నాడు!!

బెస్టాఫ్ లక్ చెప్పాక, ఫోన్ పెట్టేయ బోతుంటే గుర్తొచ్చి.."అవును జీకే... నిన్న ఎందుకు ఫోన్ చేశావు, ఇవాళ ఎందుకు ఫోన్ చేశావు?" అని అడిగాను.

"నడ్డాజీ! నిన్న ఎందుకు ఫోన్ చేశానో, ఈరోజూ అందుకే ఫోన్ చేశాను. నిన్న చెప్పడానికి కుదర్లేదు. ఈరోజూ కుదరదేమో అనుకున్నా.." అన్నాడు నవ్వుతూ.

"చెప్పు జీకే.." అన్నాను.

"నడ్డాజీ! తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఉన్నారు. ఎంతకాదన్నా కాంగ్రెస్సే ఇక్కడ మన శత్రువు కాబట్టి కాంగ్రెస్‌ను ఓడించాలంటే మనకు ఐదుగురు కాకున్నా కనీసం ఒక వర్కింగ్ ప్రెసిడెంట్ అయినా ఉండాలి. అది చెప్పడానికే మీకు ఫోన్ చేశాను.." అన్నాడు!

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిషన్ రెడ్డి ఎవర్ని అడగబోతాడో నాకు తెలుసు.

అందుకే 'ఎవర్ని తీసుకుంటావ్ జీకే?' అని నేను అడగలేదు.

నా దేశం నగ్నదేహమా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి



అర నిమిషం నిడివి కూడా లేని ఆ వీడియో అణు విస్ఫోటనాన్ని తలపించింది. కోటానుకోట్ల మనసుల్ని షాక్‌కు గురిచేసిన ఆ విద్యుదావేశాన్ని కొలవడానికి వోల్టేజీ లెక్కలు సరిపోకపోవచ్చు. క్రోధం, దుఃఖం, అవమానం, అసహ్యం, భయం వగైరాలన్నీ సునామీ కెరటాల్లా గుండెల లోతుల్లోంచి దూసుకొస్తున్నాయి. మణిపురలో జరిగిన బర్బర క్రీడను కోట్ల గొంతుకలు ఖండిస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ వార్తాసంస్థలన్నీ ఈ అమానుషాన్ని ప్రముఖంగా ప్రకటించాయి. ఒక్క బీబీసీని అయితే బెదిరించగలిగాం కానీ ఇంతమందిని బెదిరించడం సాధ్యం కాలేదు. కనుక ఈ వార్త అందరికీ తెలిసిపోయింది. ప్రపంచం నివ్వెరపోయింది.

మూకదాడులు చెలరేగిన ప్రతిచోటా మహిళల దేహాలు శత్రువుల చేతుల్లో ఆయుధాలుగా మారుతూనే ఉన్నాయి. చిత్రవధల రచనకు క్యాన్వాస్‌లవుతూనే ఉన్నాయి. ఈ ధోరణి మణిపురలో మాత్రమే ప్రారంభం కాలేదు. మణిపురతో అంతమూ కాదు. మూకదాడుల్లో తమ ప్రాబల్య విస్తరణ పరమార్థమున్న రాజకీయ శక్తులున్నంతకాలం మణిపురలు మండుతూనే ఉంటాయి. మానవత్వం కాలుతూనే ఉంటుంది. మణిపుర అల్లర్లను కేవలం మైతేయ్ (ఓబీసీ), కుకీ (ఎస్టీ)ల ఘర్షణగానే చూడాలా? అంతకు మించిన వృత్తాంతమున్నదా?

అందుబాటులో ఉన్న సమాచారం మేరకు మణిపుర జనాభాలో 53 శాతం మంది మైతేయ్ తెగవారు. వీరు ప్రధానంగా సారవంతమైన ఇంఫాల్ లోయభూముల్లోనే నివసిస్తున్నారు. కొండ ప్రాంతాల్లో నివసించే నాగా, కుకీ జాతులవారు 40 శాతం వరకు ఉంటారు. మిగిలినవారు చిన్నచిన్న గిరిజన తెగలు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన హిందువులు, ముస్లింలు. గిరిజన తెగల్లో అత్యధికులు క్రైస్తవులు. మైతేయ్‌ల్లో అత్యధికులు హిందువులు. మహాభారతంలోని బభ్రువాహనునికి వారసులమని వారి విశ్వాసం.

అర్జునుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు తిరుగుతూ తిరుగుతూ అక్కడకు చేరుకొని రాజకుమారి చిత్రాంగద ప్రేమలో పడతాడు. వీరికో కుమారుడు. వాళ్లనక్కడే వదిలేసి అర్జునుడు తన మానాన తాను వెళ్లిపోతాడు. యుద్ధం ముగిసి ధర్మరాజు చక్రవర్తి అయిన తర్వాత అశ్వమేధ యాగం చేస్తాడు. అశ్వాన్ని మణిపుర ప్రాంతం రాజకుమారుడు బభ్రువాహనుడు బంధిస్తాడు. రక్షణగా వెళ్లిన అర్జునుడిని కూడా ఓడించి గాయపరుస్తాడు. అదే ప్రాంతంలో ఉండే అర్జునుడి మరో భార్య ఉలూచి అనే నాగినికి విషయం తెలిసి నాగమణి ప్రభావంతో అర్జునుడిని కాపాడుతుంది. కథ సుఖాంతమై ఇద్దరు భార్యలతో అర్జునుడు హస్తినకు చేరుకుంటాడు. ఈ కథ యథాతథంగా వ్యాసభారతంలో లేదట! రవీంద్రనాథ్ టాగోర్ రాసిన ఒక నాటకంలో ఈ ఉదంతం ఉన్నదట! తెలుగు, కన్నడ భాషల్లో 'బభ్రువాహన' పేరుతో సినిమాలు కూడా వచ్చాయి. ఇందులో ఆసక్తికరమైన విషయమేమిటంటే చిత్రాంగదది మైతేయ్ (మణిపురి) తెగ. ఉలూచిది నాగా తెగ. ఇప్పుడీ రెండు తెగలవారు అక్కడ గణనీయంగా ఉన్నారు.

చిత్రాంగద గొప్ప యోధ. ఆమె తండ్రి చిత్రవాహనుడికి మగ సంతానం లేనందువలన ఆమెకు యుద్ధ విద్యల్లో తర్ఫీదునిస్తాడు. ఆమె శిక్షణలోనే రాటుదేలిన బభ్రువాహనుడు తండ్రినే ఓడిస్తాడు. నిన్న మొన్నటి ఈరోమ్ షర్మిల వరకు మణిపురి మహిళల సాహస స్వభావం మనకు కనిపిస్తూనే ఉన్నది. ఈశాన్య రాష్ట్రాల్లో అమలులో ఉన్న సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పీఏ) ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ 16 సంవత్సరాల పాటు ఈరోమ్ షర్మిల నిరాహారదీక్ష చేశారు. ఒక దశలో ఇంఫాల్ లోయ ప్రాంతాన్ని (ఎక్కువగా మైతేయ్‌లు నివసించే ప్రాంతం) చట్ట పరిధి నుంచి మినహాయించి ఈరోమ్‌ను దీక్ష విరమించాలని ప్రభుత్వం కోరింది. కొండ ప్రాంతాల్లోని గిరిజన తెగలు ఇంకా చీకటి చట్టం మాటున మగ్గుతుండగా తాను ఎట్లా ఉద్యమాన్ని విరమిస్తానని ఈరోమ్ ప్రశ్నించింది. ఆమె మైతేయ్ తెగ మహిళ.

స్వభావ సిద్ధంగా ప్రజల మధ్య విభజన లేదు. చీకటి చట్టం మాటున మన సాయుధ జవాన్లు అన్ని తెగల మీద తమ దాష్టీకాన్ని ప్రయోగించారు. మహిళల మీద అత్యాచారాలు ఒక అలవాటుగా మార్చుకున్నారు. థాంజోమ్ మనోరమ అనే మహిళను పారా మిలటరీ జవాన్లు సామూహిక అత్యాచారం చేసి చంపేయడం అన్ని తెగల మహిళల్నీ కదిలించింది. కొందరు మహిళలు నగ్నంగా వీధుల్లోకి వచ్చి 'ఇండియన్ ఆర్మీ... రేప్ అజ్' అనే బ్యానర్‌తో ప్రదర్శన చేసిన ఘటన, ఇరవయ్యేళ్లు గడిచినా ఇంకా వెన్నాడుతున్న పీడకలగానే మిగిలిపోయింది.

తెగల మధ్య సహజంగా ఉండే చిన్నచిన్న వైరుధ్యాలు సెగలు గక్కే శత్రు వైరుధ్యాలుగా పరిణమించవలసిన అవసరం లేదు. ఆ అవసరం కొన్ని సంకుచిత శక్తులకున్నది. మంటల్లో చలికాచుకునే రాజకీయ శక్తులకున్నది. సంఘాన్ని మెజారిటీ – మైనారిటీలుగా విడగొట్టి మెజారిటీ పక్షాన పేటెంట్ హక్కు రాసుకొనే స్వార్థ వర్గాలకున్నది. మైనారిటీల మీద మూకదాడులకు మెజారిటీలను ఉసిగొలిపే వ్యూహకర్తలకున్నది. ఈ మూకదాడులు క్షణికావేశాలు కావనీ, ప్రణాళికాబద్ధమేనని బిల్కిస్ బానో ఉదంతం మనకు చాటి చెప్పింది. గుజరాత్ అల్లర్లలో ఆమె కుటుంబ సభ్యులందరినీ అల్లరిమూక చంపేసింది. ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఆమె ధైర్యంగా పట్టుదలతో హంతకుల మీద కేసు నడిపింది. వారికి శిక్ష పడింది. శిక్షాకాలం పూర్తి కాకముందే స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఆ హంతకులు రాచమర్యాదలతో విడుదలయ్యారు. వారికి స్వాతంత్య్ర సమరయోధుల కంటే మిన్నగా స్వాగత సత్కారాలు లభించాయి.

తెగల మధ్య సహజంగా ఉండే చిన్నచిన్న వైరుధ్యాలు సెగలు గక్కే శత్రు వైరుధ్యాలుగా పరిణమించవలసిన అవసరం లేదు. ఆ అవసరం కొన్ని సంకుచిత శక్తులకున్నది. మంటల్లో చలికాచుకునే రాజకీయ శక్తులకున్నది. సంఘాన్ని మెజారిటీ – మైనారిటీలుగా విడగొట్టి మెజారిటీ పక్షాన పేటెంట్ హక్కు రాసుకొనే స్వార్థ వర్గాల కున్నది. మైనారిటీల మీద మూకదాడులకు మెజారిటీలను ఉసిగొలిపే వ్యూహకర్తలకున్నది. ఈ మూకదాడులు క్షణికావేశాలు కావనీ, ప్రణాళికాబద్ధమేనని బిల్కిస్ బానో ఉదంతం మనకు చాటి చెప్పింది. గుజరాత్ అల్లర్లలో ఆమె కుటుంబ సభ్యులందరినీ అల్లరిమూక చంపేసింది. ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఆమె ధైర్యంగా పట్టుదలతో హంతకుల మీద కేసు నడిపింది. వారికి శిక్ష పడింది. శిక్షాకాలం పూర్తి కాక ముందే స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఆ హంతకులు రాచమర్యాదలతో విడుదలయ్యారు. వారికి స్వాతంత్య్ర సమరయోధుల కంటే మిన్నగా స్వాగత సత్కారాలు లభించాయి. ఈ ఘటన నేర్పుతున్న పాఠమేమిటి? మణిపుర ఘటనలు 'డబుల్ ఇంజన్' సర్కార్ నిర్వాకమని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. అది తప్పు. అక్కడున్నది 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనిపించే ఇంజన్‌లయితే కనిపించని ఆ మూడో ఇంజనే పరివార్... సంఘ్ పరివార్! ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో ముఖ్యంగా గిరిజన తెగల్లో క్రైస్తవ ప్రాబల్యం పెరుగుతుండడంతో పరివార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. వారి వ్యూహం ఫలించడం మొదలైంది. కాషాయ పార్టీ అక్కడ బలం పుంజుకున్నది.

ఈ ఘటన నేర్పుతున్న పాఠమేమిటి?

మణిపుర ఘటనలు 'డబుల్ ఇంజన్' సర్కార్ నిర్వాకమని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. అది తప్పు. అక్కడున్నది 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనిపించే ఇంజన్‌లయితే కనిపించని ఆ మూడో ఇంజనే పరివార్... సంఘ్ పరివార్! ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో ముఖ్యంగా గిరిజన తెగల్లో క్రైస్తవ ప్రాబల్యం పెరుగుతుండడంతో పరివార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. వారి వ్యూహం ఫలించడం మొదలైంది. కాషాయ పార్టీ అక్కడ బలం పుంజుకున్నది. మణిపుర అల్లర్లు ఎలా మొదలయ్యాయి? ఒక మైతేయ్ మహిళను కుకీ తెగవారు రేప్ చేశారని ఒక ఫేక్ వార్త దావానలంగా వ్యాపించింది. క్షణాల్లో అటువంటి వార్తలను ప్రచారంలో పెట్టగల ప్రావీణ్యం ఎవరికి ఉంటుంది. ఆ యూనివర్సిటీ ఎవరి అధీనంలో ఉన్నదో అందరికీ తెలిసిన విషయమే. వార్త ప్రచారమైందే తడవుగా వేల సంఖ్యలో మైతేయ్ ప్రజలు గుంపులు గుంపులుగా కుకీ గ్రామాల మీద పడ్డారు. ఒక్కరోజులోనే ఒక వర్గానికి చెందిన వందకు పైగా ప్రార్థనాలయాలు ధ్వంసమయ్యాయంటే, ప్రార్థనలు చేయించేవారిని వెతికి పట్టుకొని దాడులు చేశారంటే మనకు బోధపడుతున్న వాస్తవమేమిటి? అదే వరసలో ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి దిగంబరంగా పరేడ్ చేయించారు. వారితో జుగుప్సాకరంగా ప్రవర్తించారు. అడ్డుకోబోయిన ఒక అమ్మాయి సోదరుని, తండ్రిని చంపేశారు. ఆ ముగ్గురిలో ఒకరు ఆర్మీ జవాన్ భార్య. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాడు. దేశాన్ని కాపాడాడు. తన భార్యను మాత్రం కాపాడుకోలేక పోయానని విలపిస్తున్నాడు.

దేశాన్ని మెజారిటీ, మైనారిటీలుగా విడగొట్టడంలో మన పరివారం గణనీయమైన విజయాలే సాధించింది. మెజారిటీ వర్గాన్ని రంజింపజేయగల చక్కెరపూత భావజాలాన్ని అది సృష్టించగలిగింది. అదే నేటి ఆధిపత్య భావజాలం. దేశం మీద పెత్తనం చేస్తున్నది. ఈ ఆధిపత్య భావజాలానికి మైనారిటీల మీద, నిమ్న జాతుల మీదనే చిన్నచూపు కాదు. జనాభాలో సగభాగమైన మహిళల మీదా చిన్నచూపే! దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ వేదికల మీద జాతీయ పతాకాల్లా ఎగరేసిన క్రీడాకారుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ఈ దేశం గమనించింది. వాళ్లను అవమానించి వేధించినవాడు దర్జాగా పార్లమెంట్‌లో కూర్చుంటున్నాడు. ఆధిపత్య భావజాలంతో రెచ్చిపోతున్న నికృష్ట మూకలు నగ్నదేహాలతో ఆటలాడటాన్ని కూడా దేశం చూసింది. నేటి మన ఆధిపత్య భావజాలపు ప్రధాన వ్యూహం టార్గెట్ వర్గాలపై అసత్య ప్రచారాలు చేసి ఏకాకుల్ని చేయడం, వారంతా భూతాలు, ప్రేతాలు, పిశాచాలు అనే భయాన్ని సమాజంలో కలిగించడం! చేతబడి అనే సాకు చూపి ఒక కుటుంబాన్ని ఊరంతా కలిసి చంపేయడాలు మనకు తెలిసిందే కదా! అదిగో ఆ మూఢత్వానికే మన వాళ్లు జాతీయ హోదా కల్పించారు. ఇప్పుడా చేతబడి ప్రచారాన్ని కుకీల మీద చేస్తున్నారు. వారంతా పరాయి దేశం వాళ్లట. లవ్ జిహాద్, గోహత్య వగైరా వగైరా చేతబడి వ్యూహాలతో ఎల్లకాలం నెట్టుకురావడం సాధ్యం కాకపోవచ్చు. ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' ఘటన గుర్తున్నది కదా! నాటి యూపీఏ ప్రభుత్వాన్ని చెత్త కుప్పలోకి విసిరేయడంలో చోదకపాత్ర పోషించిన ఉదంతం. మణిపుర మహిళల నగ్న పరేడ్ అంతకంటే చిన్న విషయమేమీ కాదు. దాని ప్రకంపనలు ఇప్పుడప్పుడే సద్దుమణగవు. నా దేశం నగ్న దేహం కాదు. అది నవచైతన్య పతాకం.

vardhelli1959@gmail.com

వారు స్త్రీలు మాత్రమే కాదు!

అభిప్రాయం



కె.ఎన్. మల్లీశ్వరి

దేశం నివ్వెరపోయింది. ఆ మహిళ దేహం మీద నిర్భీతిగా, నిర్లజ్జగా, నిస్సంకోచంగా పాకిన ఆ మగ చేతిని చూసి ప్రజానీకం నిస్సహాయ క్రోధంతో వణికిపోతున్నారు. మణిపుర కుకీ గిరిజన తెగకి చెందిన ముగ్గురు క్రిస్టియన్ మహిళలను నగ్నంగా మార్చి, ఊరేగించి, అందులో ఒకరిని అత్యాచారం చేసిన ఘటన తాలూకు వీడియో ఇపుడు దేశంలో అనేకమందిని కలవరానికి లోను చేస్తోంది. సోషల్ మీడియా అందరికీ అందుబాటులోకి వచ్చాక స్త్రీలను, దళిత, గిరిజనులను వివస్త్రలను చేసి చితకబాదడం, చంపడం వంటి వీడియోలు అడపాదడపా వైరల్ అవుతూ ఉన్నాయి. నచ్చిన దుస్తులు వేసుకోవడం, నచ్చిన చోట్లకి వెళ్లడం, నచ్చిన వారితో కలిసి గడపడం, ఇష్టమైన ఆహారం తినడం తప్పుగా మారిపోయాయి. ప్రేమలు, పరువులు, చేతబడుల వంక బెట్టి వారి శరీరాలను దారుణంగా హింసించడం – వీటన్నిటికీ పీడిత వర్గాల పట్ల సమాజానికి ఉన్న తక్కువ భావనే తక్షణ కారణం అయి ఉండొచ్చు. కానీ చాలా సందర్భాల్లో వేరే బలమైన కారణాలు ఉంటాయి.

గుజరాత్‌లో ముస్లిం జాతి హనన మారణకాండలో వేలాది స్త్రీలమీద మూకుమ్మడి అత్యాచారాలు చేయడం, ప్రాబల్య కులాల స్త్రీలు కూడా దగ్గరుండి ప్రోత్సహించడం సమీప చరిత్ర. నగ్నదేహాలతో, రోడ్డున దొరికే చిత్తుపాతలు కప్పుకుంటూ ప్రాణాలు కాపాడుకోవడానికి పోలీస్ స్టేషన్లకు పరుగులు పెట్టిన గుజరాత్ ముస్లిం మహిళల గురించి అనేక నివేదికలు తెలియజెప్పాయి. ఇప్పుడు మణిపురలో జరుగుతున్నది సారంలో గుజరాత్‌కి భిన్నం కాదు. అక్కడ ముస్లింలు అయితే ఇక్కడ గిరిజన క్రిస్టియన్లు. ఇటువంటి సందర్భాలకి ప్రతిస్పందించే విషయంలో మనం చాలాసార్లు చేసే పొరపాటు – బాధితులను జండర్‌కి మాత్రమే కుదించి చూడడం. మణిపుర ఘటన వెనుక మతం, రాజకీయ ప్రయోజనాలతో పాటు ఆర్థిక అంశాల పాత్ర తిరుగులేనిది.

కులమైనా, మతమైనా, దేశమైనా– సమాజంలోని ఏ ప్రధానమైన అంశంలోనయినా బలమైన వర్గం బలహీన వర్గంపై దాడి చేయాలంటే అందుకు అనువుగా దొరికేది ముందుగా స్త్రీలు. వారి ద్వారా ప్రత్యర్థి వర్గం మీద పైచేయి సాధించడం ఆటవిక సమాజాల స్వభావం. అదిప్పటికీ సాగుతూనే ఉంది. అయితే ఏ స్త్రీలు ప్రధానంగా బాధితులు అన్నది గ్రహించడం చాలా ముఖ్యం. పై మహిళల విషయానికి వస్తే వారి చుట్టూ కొల్లగొట్టదగిన ఖనిజ సంపదలు ఉన్నాయి కనుక, వారు కుకీ తెగ గిరిజనులు కనుక, వారు క్రిస్టియన్లు కనుక, ఈ అస్తిత్వాలు మైనార్టీ కనుకనే వారి మీద వందలాదిగా తరలి వచ్చి దాడి చేశారు. వందల, వేల గుంపులు కూడి సాగించే దాడులలో ప్రధానంగా కులమో, మతమో, వర్గమో, దేశభక్తో ఉండి తీరుతుంది. ఆయా కక్షలు తీర్చుకోవడానికి స్త్రీలను వాహికలుగా ఉపయోగించుకుంటారు. ఈ ఘటనలో నగ్నంగా ఊరేగించిన తమ స్త్రీలను కాపాడుకోవడానికి ప్రయత్నించిన ఒక తండ్రిని, అతని కొడుకుని విద్వేషకారులు చంపేయడం చూస్తే అక్కడి మైనార్టీలకి మాత్రమే సంపదలు ఒనగూడుతున్నాయన్న తీవ్ర ద్వేషం కనపడుతుంది.

ఇటువంటి ఘటనలలో గుర్తించవలసిన మరొక విషయం – దాడులు సాగించినవారే కాస్త సమయం చూసుకుని తమ ప్రతాపాలను వీడియోల రూపంలో సోషల్ మీడియాకి ఎక్కించడం. మూకుమ్మడిగా దాడి చేయడం వల్ల తమ ఉనికి తెలీదన్న ధీమా, తప్పొప్పుల విచక్షణ ఏ కోశానా లేకపోవడం, కులం, మతం, వర్గం, స్థానిక ప్రభుత్వాల దన్ను తమకు ఉంటుందన్న అహం ఆణువణువూ నిండిపోవడం, పై పెచ్చు ఇవన్నీ విజయ సంకేతాలుగా భావించడం – యథా రాజా తథా ప్రజ. ప్రభుత్వం ఈ వీడియోను అన్ని మాధ్యమాల నుంచి తొలగించే పని సత్వరం చేయడానికి కారణం ప్రజల భావోద్వేగాల పట్ల అక్కర కొద్దీ కాదు... ఎన్నికల ముందు తటస్థులను దూరం చేసుకోకూడదన్న విజ్ఞత వల్ల మాత్రమే!

ఇక మెల్లిగా 'ఉరిశిక్ష రాగం' గొంతు సవరిస్తోంది. ఆ మహిళలకు న్యాయం జరగాలంటే ఉరిశిక్ష వేస్తామని ఒక పెద్దాయన సెలవిచ్చాడు. మరి వందల మందికి, ఆ మహిళలని మూకకి అప్పగించి చూస్తూ నిలబడిన పోలీసులకి ఉరితాళ్ళు సిద్ధం చేస్తున్నారా సారూ! ఈ సారైనా మనం 'ఉరి' ఉచ్చులో చిక్కుకోకూడదు. రగిలే గుండెలకీ, భయంతో వణికే మనసుకీ అటువంటి శిక్ష కాస్త సాంత్వననూ, ధైర్యాన్నీ ఇవ్వొచ్చు. అక్కడికి దుష్ట శిక్షణ జరిగిందని ఊపిరి పీల్చుకోవచ్చు. కానీ మన బాధ్యత అక్కడితో తీరేది కాదు. అందరూ ప్రభుత్వాలతో తలపడే ఆచరణలోకి దిగలేకపోవచ్చు. కనీసంగానైనా మనమేం చేయాలి?

లోకపు రీతుల పట్ల మనం ఏర్పరుచుకునే అవగాహన, భవిష్యత్ నాయకుల ఎంపికకు మార్గాన్ని చూపుతుందని నమ్మాలి. దాడి చేసినవారిలో అనువుగా దొరికిన ఒకరిద్దరిని ఉరితీసి, ప్రజల కోరికని మన్నించిన వీరుల్లా ఛాతీ విరుచుకు నిలబడే అసలు దొంగలను గుర్తించాలి. మణిపురలో కుకీ జాతి హనన మారణకాండకు వెనకుండి అండదండలు అందించిన శక్తులను ముందుగా మనం గుర్తించాలి. సొంత ప్రజల మధ్యనున్న వర్గ, సామాజిక వైరుధ్యాలను అవకాశవాదంతో పక్కన పెట్టి, సాంస్కృతిక, రాజకీయ భిన్నత్వపు సౌందర్యాన్ని ధ్వంసం చేసి, 'జాతీయ' రహదారి మీద ఏకతా యాత్ర చేస్తున్న బుల్డోజర్‌కి అందరమొక్కటై ఎదురుగా నిలబడాలి. నిలబడదాం రండి!

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే

కవిత్వం ఎలా రాయాలి!

కవిత



ప్రతిష్ఠా పాండ్యా

కొంచెం సిగ్గుపడమని చెప్పకు నాతో
నోరు అదుపులో పెట్టుకోమనీ చెప్పకు

నీ కవితా సాంప్రదాయాల వలువలు
ఒక్కటొక్కటిగా విప్పేస్తున్నాను
వాక్యాలు, పదబంధాలు, యతి విరామాలూ,
నుడుగులు, లయలు, ఛందస్సులు, ప్రాసలు,
అనుప్రాసలు, విరామ విన్యాసాలు

నీ పాపపంకిల ఓనమాలను
నా ఎద నుంచి చీరేస్తున్నాను

నా తొడల మధ్య గాయాలను
కప్పిపుచ్చుతున్న శప్త ప్రతీకలను
తోసి అవతల పారేస్తున్నాను

అవును,
నీ నాగరిక వీధుల్లో
నిర్లజ్జగా,
నగ్నంగా,
రక్తమోడుతూ తిరుగుతున్నది
నేనే!

ఏయ్, నోర్మూయ్!
గొంతు తగ్గించమని చెప్పకు నాతో

విను!
నేను గొంతు చించుకుని చేస్తున్న
నా ఆర్తనాదాన్ని,
నా పొలికేకనూ,
నా గర్జననూ,
నా విస్ఫోటననూ

చూడు!
ఈ పుణ్యభూమిలో నేను పక్కపక్కనే పేర్చిన
ఈ ముతక, క్షతగాత్ర,
ఛిద్ర పదాల బారును చూడు,
ఇవి చెరచబడ్డ మహిళల నగ్నదేహాలు,
ఇవి కుకి–జొమి, మైతేయి, దళిత,
క్రైస్తవ, ఆదివాసీ, హిందు,
ముస్లిం మహిళల నగ్నదేహాలు

కవిత్వం ఎలా రాయాలో
నేర్పించవద్దు నాకు ఇవాళ!



మూలం (ఆంగ్లం): ప్రతిష్ఠా పాండ్యా
తెలుగు: అనంతు చింతలపల్లి


ప్రతిష్ఠా పాండ్యా ఆంగ్ల, గుజరాతీ కవయిత్రి. పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా(పరి)లో సంపాదకురాలిగా, అనువాదకురాలిగా పనిచేస్తున్నారు.

How to write poetry

Don't tell me to have some shame
Don't tell me to rein my tongue
I am stripping off all your poetic conventions
One by one.. lines, hemistich, caesura,
stanza, rhythm, meter, rhyme,
alliteration, enjambment...
I am tearing off your bloody Alphabet
from my chest
I am pulling away the cursed metaphors
covering the wounds between my thighs
Yes, I am roaming your civilized streets
shameless and naked, bleeding....
Oh, shut up!
Don't tell me to keep my voice down.
Hear me...
Hear me scream, howl, roar, explode,
ululate in high pitched trills
Watch me
make these raw, wounded,
mangled words lie stretched out
on this pristine ground
like naked bodies of raped women —
kuki-zomi, meitei,
dalit, christian, adivasi, hindu, muslim...
all next to each other.
Don't teach me
how to write poetry today.

ఏది వృద్ధి? ఏది క్షయం?

మానవాళి మనుగడకు, అనగా భవిష్యత్తులో రాబోయే తరాల మనుషుల సుఖ జీవనానికి ఏది మంచిదో, ఏది చెడుగా పరిణమిస్తుందో నిర్ణయించడం ఎలా అన్న ధర్మ సందేహానికి సమాధానం అవగతమయ్యేలా చేయడానికే అన్నట్లుగా వ్యాసులవారి మహాభారతం, ఉద్యోగ పర్వం, 39వ అధ్యాయంలో 6వ శ్లోకం ఉంది. 'న వృద్ధిర్బహు మన్తవ్యా యా వృద్ధిః క్షయమావహేత్/ క్షయోపి బహుమన్తవ్యోయః క్షయో వృద్ధిమావహేత్' అనగా, 'ఏది వృద్ధి? ఏది క్షయం? అని తర్కించుకున్నపుడు రెండు ముఖ్యమైన విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతంలో జరుగుతున్నదిగా కనబడుతున్న ఏ అభివృద్ధి వలన భవిష్యత్తులో వినాశనం జరగడానికి అవకాశం ఉంటుందో, అది వృద్ధి కాదు. దానిని క్షయంగానే నిర్ణయించుకోవాలి. అలాగే ప్రస్తుతంలో ఏది క్షీణించిపోవడం, నశించిపోవడం వలన భవిష్యత్తులో మానవకోటికి ఎక్కువగా ఉపయోగం జరిగే అవకాశం ఉంటుందో అది క్షయం అనిపించుకోదు, దానినే నిజమైన వృద్ధికి కారణంగా నిర్ణయించుకుని ఆచరణలో పెట్టాలి' అని పై శ్లోకం భావం. ఒక సందర్భంలో విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పిన మాటలలో ఒకటి పై శ్లోకం.



జ్యోతిర్మయం

ఈ సూత్రానికి, ధర్మసూక్ష్మానికి దృష్టాంతంగా అన్నట్లుగా, అంతకు ముందు శ్లోకంలోనే విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పిన మాటలు ఉంటాయి. భవిష్యత్తులోకి చూడగలిగే శక్తి ఉన్న ఋషితుల్యులైన వ్యక్తులు, మంచి చెడులను బాగా ఆలోచించి, చెప్పే మాటలను వినకపోవడం వలన మానవకోటికి ఎంత అనర్థం జరుగుతుందో తెలియజెప్పేవై ఆసక్తిని రేకెత్తించేవిగా ఉంటాయి ఆ శ్లోకంలోని మాటలు. 'ఉక్తం మయా జాతమాత్రేపి రాజన్/దుర్యోధనం త్యజ పుత్రం త్వమేకమ్/తస్య త్యాగాత్ పుత్రశతస్య వృద్ధి/రస్యాత్యాగాత్ పుత్రశతస్య నాశః' అనగా, 'దుర్యోధనుడు పుట్టినప్పుడే నీకు నేను చెప్పాను – కేవలం ఈ ఒక్కడినీ నువ్వు త్యాగం చెయ్యి, వందమంది పుత్రుల వృద్ధి నీకు అవుతుంది. ఈ ఒక్కడినీ త్యాగం చేయక పోవడం వలన నీకు వందమంది పుత్రుల నాశనం జరుగుతుంది' అని ఆ శ్లోకంలోని మాటల భావం. ముందు చూపుతో విదురుడు చెప్పిన మాటను ధృతరాష్ట్రుడు వినలేదు. ఫలితంగా దుర్యోధనుడితో పాటుగా మిగతా వందమంది పుత్రులనే కాకుండా, ఇరువైపుల నుండి మొత్తం 18 అక్షౌహిణుల సైన్యం హతమయ్యే మహావినాశనానికి కారణం అయ్యాడు.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో శ్రీరామ్ విలాస్ వేదాంతి



శ్రీరామ విలాస్ వేదాంతికి అమ్మవారి చిత్ర పటం అందచేస్తున్న వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ పంచహారతుల సేవలో అయోధ్య రామ జన్మభూమి న్యాస్ పీఠానికి చెందిన హెచ్‌హెచ్.శ్రీరామ విలాస్ వేదాంతి శనివారం పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. పండితులు వేద స్వస్తి పలకగా, ఆలయ అధికారి శ్రీనివాసరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కూడా జస్టిస్ శ్యాంసుందర్ దర్శించుకున్నారు.

ఆరుగురు విద్యార్థులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది(భీమిలి): రుషికొండ బీచ్‌లో పెనుప్రమాదం తప్పింది. బీచ్‌లో మునిగిపోబోతున్న ఆరుగురు యువకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఆరుగురు విద్యార్థులు ఎం.పియూష్, ఎన్. కౌషిక్, టి.సిద్ధు, ఎం.శ్రీరామ్, ఎం.బవిట్‌రెడ్డి, ఎ.చరణ్ రుషికొండ బీచ్‌కు వచ్చారు. సాయంత్రం స్నానాలు చేసేందుకు వీరంతా బీచ్‌లో దిగారు. ప్రస్తుతం తుఫాన్ నేపథ్యంలో కెరటాలు ఉధృతంగా ఉండడంతో ఈ ఆరుగురు ఒక్కసారిగా నీటిలోకి కొట్టుకుపోయారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ అప్రమత్తమై ఆరుగురుని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ కె. సతీష్‌కుమార్, ఎస్ఐ మురళీ కృష్ణ అభినందించారు.

24న అంగప్రదక్షిణ టికెట్ల కోటా విడుదల

- ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కూడా..

తిరుమల: తిరుమల శ్రీవారి అంగప్రదక్షిణ టికెట్లు, శ్రీవాణి ట్రస్టు దాతలకు దర్శనం, గదులకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను ఈ నెల 24న ఉదయం 10, 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా అక్టోబర్ నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 25న విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతి, తలకోనలో అక్టోబర్ నెల గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

చిన్నారి పొట్ట నుంచి కిలోన్నర వెంట్రుకల తొలగింపు



ఏలూరు (ఆర్‌ఆర్ పేట): పుట్టిన మూడో ఏట నుంచే విపరీతమైన కడుపునొప్పితో బాధ పడుతున్న ఒక చిన్నారి కడుపు నుంచి ఓ ప్రైవేటు హాస్పిటల్ వైద్యులు కిలోన్నర బరువున్న వెంట్రుకలను తొలగించి పాపకు సాంత్వన చేకూర్చారు. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన అరవ సంతోష్, జ్యోతి దంపతుల కుమార్తె (7) నాలుగేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి చిన్నారిని తీసుకువెళ్లగా వారు అన్ని పరీక్షలూ నిర్వహించి చిన్నారి కడుపులో వెంట్రుకలు, ఊపిరితిత్తిలో రాళ్లు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స అవసరమని సూచించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు ఏలూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడిని సంప్రదించగా, శనివారం శస్త్రచికిత్స నిర్వహించారు. బాలిక కడుపు నుంచి కిలోన్నర వెంట్రుకలు, పసరతిత్తిలోని రాళ్లను ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్స ద్వారా తొలగించారు.

కోనసీమలో కొబ్బరి పరిశ్రమలు

వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్‌లో కొబ్బరి ఎంపిక

- విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు
- పరిశ్రమల ఏర్పాటుకు ఒకే వేదికపైకి ప్రభుత్వ శాఖలు
- రైతు సంఘాలు, ఔత్సాహికులకు పెద్ద పరిశ్రమలు
- డ్వాక్రా మహిళలతో కుటీర పరిశ్రమలు



కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు

సాక్షి అమలాపురం: పచ్చని చేలు.. కొబ్బరి తోటలు.. డెల్టా కాలువతో అలరారే కోనసీమకు ఇక పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయి. ఇప్పటివరకు స్థానికంగా పరిశ్రమలు ఉన్నా.. చెప్పుకొనేస్థాయిలో లేవు. వ్యవసాయ, ఉద్యాన పంటల విలువ ఆధారిత పరిశ్రమలు లేక రైతులు నష్టపోతున్నారు. దీన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా కీలక ప్రభుత్వ శాఖలను, బ్యాంకర్లను, ఆర్థికసంస్థలను ఒక వేదిక మీదకు తీసుకొచ్చింది. రాష్ట్రంలో సుమారు మూడులక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా.. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే సుమారు 1.30 లక్షల ఎకరాల వరకు సాగవుతోంది. ఏటా సుమారు 72 కోట్ల కాయలు దిగుమతి అవుతున్నాయి. స్థానికంగా కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసే పరిశ్రమలు లేవు. కొబ్బరి డొక్క నుంచి కొబ్బరి పీచుతో ఉత్పత్తులు చేసే పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూడా మధ్య, చిన్నతరహా పరిశ్రమలే అధికం. కొబ్బరి నీరు, కొబ్బరి ముక్కల నుంచి ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. కొబ్బరి నూనె మిల్లులు గిట్టుబాటు కాక పోవడం వల్ల మూతపడుతున్నాయి. పరిశ్రమలు లేక రైతులు కొబ్బరిని నేరుగా, రెండుమూడు రకాల ఉత్పత్తులుగా మాత్రమే తయారు చేసి విక్రయిస్తున్నారు. దీనివల్ల పెద్దగా ధర లేక కొబ్బరి తరచు సంక్షోభంలో కూరుకుపోతోంది.

వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ ద్వారా చేయూత

కోనసీమలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా కొబ్బరికి స్థానికంగా డిమాండ్ తీసుకురావాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్'కు జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరిని ఎంపిక చేసింది. ఈ పథకంలో జిల్లా యంత్రాంగం కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మహిళా స్వయంశక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీల)తో కొబ్బరి కుటీర పరిశ్రమలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు), ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో మధ్యతరహా, పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. నాలుగు నెలలు కసరత్తు చేసి ఈ ప్రణాళికలకు తుదిరూపం ఇచ్చారు.

గుర్తించిన పరిశ్రమలు ఇవే..

కొబ్బరి పాలు, వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ ఆయిల్, ఉడ్‌ప్రెస్డ్ ఆయిల్, డెసికేటెడ్ కోకోనట్ పౌడర్, కోకోనట్ చిప్స్, కోకోనట్ కుర్‌కురి, కోకోనట్ చార్‌కోల్, బయోచార్, మినిమల్ ప్రాసెస్ టెండర్ కోకోనట్‌తోపాటు కాయర్ ఉత్పత్తులను గుర్తించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కొబ్బరితో తయారు చేసే స్వీట్లు, బిస్కెట్లు, కొబ్బరి పాలు తయారు చేసే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.



సమన్వయం, సహకారం

విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం, ఔత్సాహికులను గుర్తించే ఉద్యానశాఖతో పాటు పరిశ్రమలు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి ప్రభుత్వ శాఖలను, కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ), కాయర్ బోర్డులను ఒక వేదిక మీదకు తెచ్చారు. జిల్లా లీడ్ బ్యాంక్, నాబార్డ్, ఎంఎస్ఎంఈ, స్మాల్ ఫార్మర్స్ అగ్రిబిజినెస్ కన్సార్టియం (ఎస్ఎఫ్ఏసీ) వంటి ఆర్థికసంస్థలకు ఈ వేదికలో భాగస్వామ్యం కల్పించారు. ఔత్సాహికుల గుర్తింపు, సాంకేతిక సహకారం, రుణ సదుపాయం, అధునాతన యంత్రాల ఎంపిక, ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ విషయాల్లో ఈ శాఖలు, సంస్థలు సమన్వయ, సహకారాలతో పనిచేయనున్నాయి. ఉత్పత్తులకు మార్కెట్ లింకేజ్, ఆన్‌లైన్ అమ్మకాలను ప్రోత్సహించనున్నాయి.

రెండు సంస్థల నుంచి రాయితీ వచ్చేలా..

ఏదైనా ఒక ప్రభుత్వశాఖ, ప్రభుత్వ అనుబంధసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు వాటినుంచి మాత్రమే రాయితీ వస్తుంది. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు రెండు శాఖలు లేదా సంస్థల నుంచి రాయితీ అందేలా జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనివల్ల కేవలం 25 నుంచి 35 శాతం వరకు ఉండే రాయితీ 50 శాతం అందనుంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులు రూ.లక్షకుపైగా ఎఫ్‌పీవోలు రూ.పదికోట్ల విలువైన పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



నెలకొకసారి సమీక్ష



విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా కొబ్బరికి డిమాండ్ తీసుకురావాలన్నదే లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుపై నెలకు ఒకసారి సమీక్ష నిర్వహించి ప్రగతిని పరిశీలిస్తాం. నెల రోజుల్లో కనీసం 50 వరకు కొబ్బరి ఆయిల్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నదే తొలి లక్ష్యం.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

అన్నిరకాల సహకారం



కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఉత్పత్తి ఎంపిక నుంచి మార్కెటింగ్ వరకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తాం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, డ్వాక్రా సంఘాలు సంయుక్తంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

– డి.వి.రమణ, ఉద్యానశాఖ జిల్లా అధికారి

రూ.2 లక్షల కోట్లు కేటాయించండి

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా రాజ్యాంగ బద్ధమైన సంస్థగా జాతీయ బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంను ఢిల్లీలో కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చలలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ జి.కృష్ణ, నందగోపాల్, కర్రి వేణుమాధవ్, రాజ్ కుమార్, జోషి రాఘవ, భాషయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, దేశంలోని 75 కోట్ల మంది బీసీల సంక్షేమానికి కేంద్రం బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించడం దారుణమన్నారు. విద్యారంగానికి రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ హంసరాజ్ గంగారాం హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు.

జగన్ ఫ్రస్ట్రేషన్ బాయ్

- యువగళం పాదయాత్రలో లోకేశ్

పొదిలి: సీఎం వైఎస్ జగన్‌కు ఫ్రస్ట్రేషన్ బాయ్‌గా పేరు పెడుతున్నానని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం రాత్రి ప్రకాశం జిల్లా పొదిలి బహిరంగ సభలో మాట్లాడుతూ.. 'జగన్‌కు భయం పట్టుకుంది. రాత్రి వేళల్లో లోకేశ్ కలలోకి వస్తున్నాడు. వెంకటగిరి సభలో జగన్ ఫ్రస్ట్రేషన్ బయటపడింది. ఈ రోజు నుంచి ఆయనకు ఫ్రస్ట్రేషన్ బాయ్‌గా పేరు పెడుతున్నా' అన్నారు. టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీలో జగన్ జైలుకెళ్లారని, బాబాయ్‌ని మర్డర్ చేయించి, పిన్ని పసుపు కుంకాలు తుడిచేశారన్నారు. సొంత చెల్లి క్యారెక్టర్‌నే దిగజార్చిన క్యారెక్టర్ లెస్ ఫెలో అని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ఉద్యోగాలిస్తానని మోసం చేశారని, వందకు పైగా సంక్షేమ పథకాలను రద్దు చేశారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత వ్యక్తిగతంగా తానే తీసుకుంటానన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్నారు. మార్కాపురం ఎమ్మెల్యేపైన తీవ్రమైన ఆరోపణలు చేశారు.

ఆలయ నిర్వహణలో ప్రపంచానికే టీటీడీ దిక్సూచి

- వారణాసిలో ఆలయాల నిర్వహణపై అంతర్జాతీయ సమ్మేళనం
- పాల్గొన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి
- తిరుమల కార్యక్రమాలపై ప్రజెంటేషన్



ధర్మారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

తిరుమల: ఆలయ నిర్వహణకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) ప్రపంచానికే దిక్సూచిగా నిలుస్తోందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 30 దేశాలకు చెందిన వివిధ హిందూ దేవాలయాల నిర్వాహకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు టీటీడీ కల్పిస్తున్న వసతులు, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు, ఆలయ నిర్వహణకు సంబంధించి అరగంట పాటు ధర్మారెడ్డి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఆహూతులను విశేషంగా ఆకర్షించింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ యాత్రికులకు శ్రీవారి దర్శనం, వసతి, తలనీలాలు, లడ్డూల తయారీ తదితర అంశాల్లో టీటీడీ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. సమర్థ నిర్వహణ వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఆలయాలు పవిత్రంగా, పరిశుభ్రంగా ఉండాలని, భక్తులకు సులభంగా దర్శనం, చక్కటి వసతులు కల్పించాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్యం, అన్నదానం, వేద సంస్కృతి పరిరక్షణ తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను టీటీడీ పెద్దఎత్తున చేస్తోందని చెప్పారు. స్విట్జర్లాండ్, సింగపూర్ లాంటి దేశాల తరహాలో తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణ ఉందన్నారు.

పురాతన ఆలయాల పునరుద్ధరణకు శ్రీవాణి ట్రస్టు

పురాతన ఆలయాల పునరుద్ధరణకు, మతమార్పిడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్టును ప్రారంభించామని ధర్మారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 170 పురాతన ఆలయాల పునరుద్ధరణకు ఆర్థిక సాయం అందించామని చెప్పారు. భక్తులు దాదాపు రూ. 900 కోట్లు శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందజేశారని, ఇప్పటివరకు రూ. 330 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఏడాదిన్నర కిందట ప్రారంభించిన శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో 1,600కు పైగా గుండె శస్త్రచికిత్సలు, నాలుగు గుండె మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. చిన్నపిల్లలకు కార్డియాలజీతో పాటు ఇతర విభాగాలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు.

టీటీడీ విశిష్ట సేవలు

టీటీడీ ఆధ్వర్యంలో 71 ఆలయాలు, 11 ట్రస్టులు, 14 ఆసుపత్రులు, 35 విద్యాసంస్థలు, 9 వేద పాఠశాలలు, నాలుగు గోశాలలు, 300 కళ్యాణ మండపాలు, 10 ధార్మిక సంస్థలు, నాలుగు భాషల్లో శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్, అనాథ పిల్లల కోసం బాలమందిరం, రెండు మ్యూజియంలు ఉన్నాయని ధర్మారెడ్డి చెప్పారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే తోటి భక్తులకు సేవలందించేందుకు 2000 సంవత్సరంలో శ్రీవారి సేవ విభాగాన్ని ప్రారంభించామని, ఇప్పటివరకు 14 లక్షల మంది సేవకులు నమోదయ్యారని తెలిపారు. శ్రీవారికి నైవేద్యం కోసం గోఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగిస్తున్నామని తెలిపారు. కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పటి నుంచి శ్రీనివాస కళ్యాణం, వేంకటేశ్వర వైభవోత్సవాలు, గుడికో గోమాత కార్యక్రమం, విషూచిక మహామంత్రంతో పారాయణాలు ప్రపంచ భక్తుల దృష్టిని ఏ విధంగా ఆకర్షించాయో వివరించారు.

టీటీడీకి ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రశంసలు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ తన ప్రసంగంలో శ్రీవాణి ట్రస్ట్ సేవలపై ప్రశంసలు కురిపించారు. వెనుకబడిన ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణను పెద్దఎత్తున చేపట్టినందుకు టీటీడీని కొనియాడారు. టీటీడీ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను ఆయన ప్రస్తుతించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డిని సమ్మేళనం చెర్మన్ ప్రసాద్ మినేష్ లాడ్, టెంపుల్స్ కనెక్ట్ వ్యవస్థాపకులు గిరీష్ కులకర్ణి సత్కరించారు.

కచ్చిడి చేప @ రూ.3.10 లక్షలు



కాకినాడ తీరంలో ఉప్పాడ పల్లెపేటకు చెందిన మత్స్యకారుడు మత్సా సతీష్ వలకు అరుదైన చేప కచ్చిడి చిక్కింది. సుమారు 25 కిలోల బరువు ఉన్న ఈ చేపను కాకినాడ కుంభాభిషేకంలో శనివారం వేలం పెట్టగా రూ.3.10 లక్షలకు ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. కాకినాడ తీరంలో ఇదే అత్యధిక ధర. ఔషధాల గనిగా పేర్కొనే ఈ చేపను పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లో గోల్డ్ ఫిష్‌గా పిలుస్తారు.

కాకినాడ రూరల్

కోవిడ్ అనంతర గుండెపోటు మరణాలపై పరిశోధన

- నేషనల్ హెల్త్ మిషన్ ఏపీ, తెలంగాణ కార్యదర్శి అనురాధ



సభలో మాట్లాడుతున్న ఏపీ, తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ కార్యదర్శి అనురాధ

కర్నూలు (హాస్పిటల్): కోవిడ్ అనంతరం గుండెపోటు మరణాలు బాగా పెరిగాయని, ముఖ్యంగా యువత అధికంగా గుండెపోటుకు గురై ఆకస్మికంగా మరణిస్తున్నారని, ఇది ఏ స్ట్రెయిన్ కారణంగా విశ్లేషించి ప్రభుత్వానికి నివేదించాలని ఏపీ, తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ కార్యదర్శి అనురాధ కోరారు. ఏపీ కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ ప్రారంభ కార్యక్రమం శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనురాధ మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కేథలాబ్ మిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, గుంటూరు, తిరుపతి, విజయవాడ, అనంతపురంలో స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్టెమి ఇండియా కార్యక్రమాన్ని త్వరలో కర్నూలు, వైజాగ్, గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. కర్నూలులో ఏర్పాటవుతున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పేదలకు ఓ వరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్యసేవలు బాగున్నాయని, క్షేత్రస్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పీసీ రత్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం కార్డియాలజీ హెచ్‌వోడీ, కార్యక్రమ నిర్వాహక చైర్మన్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇచ్చి సన్మానించారు. ఏపీసీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీఎస్‌ఆర్ మూర్తి, ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.వసంతకుమార్, కార్యదర్శి డాక్టర్ అంజిత్, ట్రెజరర్ డాక్టర్ పూర్ణానంద తదితరులు పాల్గొన్నారు. కాగా గుంటూరుకు చెందిన జె.తేజస్వినికి బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ (కార్డియాలజీ)గా గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేశారు. ఆమె వైద్యవిద్యను 2022లో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. అవగాహన లేకే ఎక్కువ మంది గుండెజబ్బులతో మరణిస్తున్నారని ఆమె తన పరిశోధనల ద్వారా కనుగొన్నారు.

కామ్రేడ్స్ పేరుతో బెదిరించి రూ.2 కోట్లు డిమాండ్

- ఆక్వా రైతుకు బెదిరింపు కాల్స్
- ముగ్గురిని పట్టుకున్న పోలీసులు



పట్టుబడిన నిందితులతో సీఐ, ఎస్ఐ

కైకలూరు: ఓ ఆక్వా రైతును నెల రోజులుగా కామ్రేడ్స్ పేరుతో సెల్ ఫోన్ల ద్వారా బెదిరించి రూ.2 కోట్లు డిమాండ్ చేస్తున్న డ్రైవర్ల గ్యాంగ్‌ను ఏలూరు జిల్లా కైకలూరు టౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టౌన్ స్టేషన్‌లో సీఐ ఆకుల రఘు, ఎస్ఐ జ్యోతిబసు వివరాలు వెల్లడించారు. కైకలూరుకు చెందిన ఐబీకేవీ ప్రసాదరాజు (వజ్రం రాజు) ప్రముఖ ఆక్వా రైతు. నెల రోజులుగా రెండు నంబర్ల నుంచి 'కామ్రేడ్స్ మాట్లాడుతున్నాం.. మాకు రూ.2 కోట్లు ఇవ్వకపోతే నీతో పాటు నీ కొడుకును చంపేస్తాం' అంటూ బెదిరిస్తున్నారు. పదే పదే ఫోన్లు రావడంతో ప్రసాదరాజు ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితులను కనిపెట్టారు. మండవల్లి మండలం చావలిపాడు గ్రామానికి చెందిన తోకల ఏసేబు (36), చిన్నం బారంబాసు (51), హైదరాబాదు, ఏజీ కాలనీ, ఎర్రగడ్డకు చెందిన శీలం హేమంత్‌కుమార్ (33), హైదరాబాదు, హిమాయత్‌నగర్‌కు చెందిన దారా మాణిక్యరావు (44)గా వారిని గుర్తించారు. వీరిలో ఏసేబు, మాణిక్యరావు కైకలూరులో ప్రసాదరాజు దగ్గర గతంలో కారు డ్రైవర్లుగా పనిచేశారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మాణిక్యరావు హైదరాబాదులోని తన స్నేహితుడు, కారు డ్రైవర్ హేమంత్‌కుమార్‌తో రెండు సిమ్ కార్డులు కొనుగోలు చేయించాడు. హైదరాబాదు శివారు రింగురోడ్డు నుంచి ఫోన్లు చేసి ప్రసాదరాజును డబ్బు కోసం బెదిరించారు. నిందితుల్లో ఏసేబు, బారంబాసు, హేమంత్‌కుమార్‌ను అరెస్టు చేశామని, మాణిక్యరావును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

అమెరికాలో ప్రాణాపాయ స్థితిలో ఒంగోలు విద్యార్థి

- స్విమ్మింగ్‌పూల్‌లో జారిపడి కోమాలోకి...
- ప్రభుత్వం ఆదుకోవాలని తల్లిదండ్రుల వినతి



మెర్సీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కరీముల్లా

ఒంగోలు టౌన్: ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన ఒంగోలుకు చెందిన యువకుడు ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కోమాలో ఉన్న అతనికి మిస్సోరిలోని మెర్సీ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలులోని గొడుగుపాలేనికి చెందిన సయ్యద్ బాషా, షెహనాజ్ దంపతులకు సయ్యద్ కరీముల్లా (24) ఒక్కడే సంతానం. బాషా స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో సెల్ ఫోన్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కరీముల్లాకు బీ.టెక్ పూర్తయిన తర్వాత అమెరికాలోని మిస్సోరిలో ఉన్న సెయింట్ లూయిస్ యూనివర్సిటీలో ఎంఎస్ సీటు వచ్చింది. దీంతో బాషా తన కుమారుడి జీవితం బాగుంటుందనే ఆశతో అప్పులు చేసి రూ.40లక్షల వరకు ఖర్చు చేసి కరీముల్లాను అమెరికా పంపించాడు. గత జనవరిలో అమెరికా వెళ్లిన కరీముల్లా ఈ నెల 8వ తేదీన తన స్నేహితులతో కలిసి వెళుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి లోతైన స్విమ్మింగ్ పూల్‌లో పడ్డాడు. స్థానికుల సహాయంతో అతడిని రక్షించి మిస్సోరిలోని మెర్సీ హాస్పిటల్‌కు తరలించారు. ఏడు నిమిషాలు నీటిలో మునిగి ఉండడంతో ఊపిరాడక పొట్టనిండా నీరు తాగాడని, దీంతో మెదడు దెబ్బతిని కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ మీద ఉంచి చికిత్స అందిస్తున్నారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం అందుకున్న బాషా, షెహనాజ్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అమెరికా వెళ్లి తమ కుమారుడికి మెరుగైన చికిత్స చేయించే ఆర్థిక స్తోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమ కుమారుడికి వైద్యం కోసం సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


క్లుప్తంగా...

ఛత్తీస్‌గఢ్ బొగ్గు కుంభకోణంలో మహిళా ఐఏఎస్ అరెస్ట్




రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన బొగ్గు లెవీ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం మహిళా ఐఏఎస్ అధికారి రానూ సాహూను అరెస్ట్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో డైరెక్టర్‌గా ఉన్న రానూ సాహూకు అదనపు జిల్లా జడ్జి అజయ్ సింగ్ రాజ్‌పుత్ మూడు రోజుల ఈడీ కస్టడీకి అనుమతించారు. బొగ్గు కుంభకోణం కేసులో అరెస్టయిన రెండో ఐఏఎస్ అధికారి సాహూ. రాయ్‌గఢ్, కోర్బా జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆమె అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ లాయర్ సౌరభ పాండే తెలిపారు. ఆమె రూ.5.52 కోట్ల విలువైన చరాస్తులను పోగేశారని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను సాహూ లాయర్ ఖండించారు. ఆమెను కల్పితమైన కారణాలతోనే అధికారులు అరెస్ట్ చేశారన్నారు.

25న మళ్లీ చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్‌కు ఈనెల 25న అయిదోసారి కక్ష్య దూరాన్ని పెంచనున్నారు. బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం శాస్త్రవేత్తలు 25న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో ఈ ఆపరేషన్ చేపట్టనున్నారు. భూమికి సంబంధించిన కక్ష్యలో ఆఖరిసారిగా చేపట్టే ఆపరేషన్‌తో చంద్రయాన్–3 భూమి నుంచి విశ్వంలో చంద్రుడ్ని చేరుకునే దిశగా ప్రయాణిస్తుంది. ఆగస్టు 1 నాటికి చంద్రయాన్–3 లూనార్ ఆర్బిట్ (చంద్ర కక్ష్య)కు చేరుకుంటుంది. అక్కడ నుంచి 17 రోజుల పాటు చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఆగస్టు 23న చంద్రునికి 30 కిలో మీటర్ల ఎత్తులో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్‌ను విడిచి పెడుతుంది. అదే రోజు సాయంత్రం ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రాంతంలో చంద్రుడి ఉపరితలంపై దిగుతుంది.



లోహాల్లో పగుళ్లను సూక్ష్మస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన స్పెషలైజ్డ్ ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ టెక్నిక్ ద్వారా లిథియం ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్న శాండియా నేషనల్ లేబొరేటరీస్ పరిశోధకుడు ర్యాన్ షోల్

ఐశ్వర్యారాయ్ లాంటి ప్రపంచ సుందరిని అతి సమీపంలో చూసేసరికి రజనీ వంటి రోబోలో కూడా రసస్పందన కలిగింది. తట్టుకోలేని తమకంలో తలమునకలయ్యాడు. భగవంతుని ఈ సృష్టి వైచిత్రిని తలచుకుని తెగ ఆశ్చర్యపోయాడు. తనవంటి జడపదార్థంలోనూ జమకాలు పాడించిన ఆడదానికి ఓరచూపు పవరుకు పదేపదే సలాములు చేశాడు. ఇనుములో హృదయం మొలిచెనే... అనుకుంటూ డ్యుయెట్లు పాడుకుని మురిసిపోయాడు. దర్శక దిగ్గజం శంకర్ సృజన నుంచి పుట్టుకొచ్చిన ఈ సూపర్‌హిట్ సినీ ఫాంటసీ నిజ జీవితంలోనూ జరిగితే? ఇనుములో నిజంగానే హృదయం మొలిస్తే? అమెరికాలో సరిగ్గా ఇదే జరిగింది. ఓ చిన్న ప్లాటినం ముక్క తనలో పుట్టుకొచ్చిన పగుళ్లను తనంత తానుగా నయం చేసుకుంది. అదీ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలంతా కళ్లారా చూస్తుండగా! ఈ పరిణామాన్ని అతి సూక్ష్మమైన మైక్రోస్కోప్ ద్వారా వీక్షించి వాళ్లంతా అక్షరాలా అవాక్కయ్యారు. "మా కళ్లను మేమే నమ్మలేకపోయాం. దీనికి కారణమేమిటన్నది మాకైతే అంతుబట్టడం లేదు. మానవ మేధకు బహుశా ఎప్పటికీ అంతుబట్టదేమో!"అని చెప్పుకొచ్చారు. ప్రాకృతిక నియమాలనే పూర్తిగా తలకిందులు చేయగల ఈ పరిణామం ఎలా సాధ్యమైందన్న కీలకాన్ని పట్టుకోగలిగితే ఇంజనీరింగ్ రంగంలో కనీవినీ ఎరగని విప్లవాత్మక మార్పులు ఖాయమని వారంతా ముక్త కంఠంతో అంటున్నారు. ఇప్పుడా కీలకాన్ని ఒడిసిపట్టే పనిలో తలమునకలుగా ఉన్నారు...

-సాక్షి, నేషనల్ డెస్క్

ఇనుములో... హృదయం మొలిచెనా..?!

నిరంతర వాడకం తదితరాల వల్ల అరుగుదల వంటివి జరిగి యంత్రాలు పగుళ్లివ్వడం, అవి క్రమంగా పెరిగిపోయి చివరికి పాడవడం సర్వసాధారణం. ఆ మాటకొస్తే ఇది ప్రతి ఇనుప వస్తువు విషయంలోనూ జరిగేదే. నిజానికి చాలా పరిశ్రమల్లో ఈ అరుగుదల తదితరాల ఖర్చే తడిసి మోపెడవుతూ ఉంటుంది కూడా. మరి కార్లు, బస్సులు, భారీ ఇంజన్లు, బ్రిడ్జిలు, విమానాల వంటి ఇనుప వస్తువులన్నీ తమలో తలెత్తే పగుళ్ల వంటి సమస్యలన్నింటినీ తమంతట తామే ఎప్పటికప్పుడు సరిచేసుకోగలిగితే? వాటి భద్రతపై దిగులుండదు. జీవితకాలమూ పెరుగుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా నిర్వహణ తదితర భారీ ఖర్చులన్నీ పూర్తిగా తప్పుతాయి. ఎంతగా అంటే, ఒక్క అమెరికాలోనే ఏటా వేలాది కోట్ల డాలర్లు ఆదా అవుతాయని ఈ పరిశోధనకు పూనుకున్న శాస్త్రవేత్తల బృందమే అంచనా వేస్తోంది! పైగా రిపేర్లు తదితరాలకు పట్టే అతి విలువైన సమయమూ పూర్తిగా ఆదా అవుతుంది! ఇప్పటికిది అందమైన ఊహే అయినా ముందు నిజమయ్యే ఆస్కారం పుష్కలంగా ఉందంటున్నారు ప్రఖ్యాత అంతర్జాతీయ శాస్త్రవేత్తలు. అదే జరిగితే మౌలిక శాస్త్ర సాంకేతిక సిద్ధాంతాలన్నీ పూర్తిగా మారిపోవడం ఖాయమని కూడా చెబుతున్నారు.


పగుళ్లను తనంత తానే పూడ్చుకున్న ప్లాటినం ముక్క

- మానవ ప్రమేయం లేకుండానే జరిగిన అద్భుత ఘటన
- సంభ్రమాశ్చర్యాల్లో శాస్త్ర, సాంకేతిక ప్రపంచం
- ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు!

ఆ అద్భుతం జరిగిందిలా...

ఇనుప పరికరాల్లో అతి సూక్ష్మస్థాయిలో పగుళ్లు ఎలా మొదలవుతాయో తెలుసుకునేందుకు అమెరికాలో ఇంధన శాఖకు చెందిన సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ నానోటెక్నాలజీస్ శాస్త్రవేత్తల బృందం ఇటీవల ఓ పరిశోధన చేసింది. అందులో యాదృచ్ఛికంగా అద్భుతమొకటి జరిగింది. ఏమైందంటే...

- అమెరికాలోని శాండియా, లాస్ అలామోస్ నేషనల్ లేబొరేటరీస్, టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ సంయుక్తంగా ఈ పరిశోధనకు పూనుకున్నాయి. అతి సూక్ష్మ పరిమాణంలోని ప్లాటినం ముక్కలో పగుళ్లు మొదలయ్యే తీరును లోతుగా పరిశోధించడం దీని ముఖ్యోద్దేశం.
- కానీ తీరా ప్రయోగం మొదలైన 40 నిమిషాలకు వారు కలలో కూడా ఊహించనిది జరిగింది. ప్లాటినం ముక్క మొదలైన పగులు విస్తరించడం ఆగిపోయింది!
- ఇదేమిటా అని వాళ్లు తల బద్దలు కొట్టుకుంటుండగానే, ఆ పగులు తనంతట తానే చిన్నదవుతూ క్రమంగా పూర్తిగా పూడి కనుమరుగైపోయింది! ఎంతగా అంటే, అక్కడ పగులు వచ్చిన ఆనవాలు కూడా కనిపించలేదు!
- ఇలా మానవ జోక్యం అసలే లేకుండా ఓ లోహం తనలోని పగుళ్లను తానే పూడ్చుకోవడం మనకు తెలిసిన చరిత్రలో బహుశా తొలిసారి జరిగిందని సైంటిస్టులు చెబుతున్నారు.
- ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత జర్నల్ నేచర్‌లో ప్రచురితమయ్యాయి.



ఫొటోలో కన్పిస్తున్న ఎరుపు గుర్తులు పగుళ్లను, అవి నయమవుతున్న తీరును ఆకుపచ్చ గుర్తులు చూపిస్తున్నాయి

> లోహాల్లో పగుళ్లంటూ మొదలైతే పెరుగుతూనే పోతాయి. కానీ, అత్యంత జడమైనవిగా భావించే లోహాలకు కూడా ఇలా తమను తాము నయం చేసుకోగల స్వాభావిక సామర్థ్యం ఉందని మా పరిశోధన తేటతెల్లం చేయడం ఓ నమ్మశక్యం కాని నిజం!"
>
> – బ్రాడ్ బాయ్స్, మెటీరియల్స్ సైంటిస్టు, శాండియా నేషనల్ లేబొరేటరీస్

అచ్చం అతను సూత్రీకరించినట్టే...

ఇలాంటి దృగ్విషయాన్ని టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ ప్రొఫెసర్ మైకేల్ డెంకోవిజ్ కొన్నేళ్ల క్రితమే కంప్యూటర్ సిమ్యులేషన్ల ఆధారంగా సూత్రీకరించాడు.తాజా పరిశోధన ఫలితం గురించి తెలిసి ఆయనిప్పుడు ఎంతగానో ఆనందపడుతున్నాడు. తన పాత ప్రయోగాన్ని మరోసారి చేసి చూపిస్తూ, 'అప్పట్లో నేనెలా సూత్రీకరించానో ఇప్పుడు అక్షరాలా అలాగే జరిగిం'దంటూ సంబరపడిపోతున్నాడు.

అద్భుతమే, కాకపోతే...

జరిగింది నిజంగానే మహాద్భుతమే. ఇందులో అనుమానమే లేదు. కాకపోతే లోహాల్లో అసలు ఈ 'స్వీయ వైద్యం'ఎలా సాధ్యమన్నది మాత్రం మనకు ప్రస్తుతానికి ఏమీ తెలియదు. దీన్ని ఇంజనీరింగ్, తయారీ రంగాలకు ఎలా అన్వయించుకోవాలన్నది అంతకంటే అవగాహనలోకి రాలేదు. ''అతి సూక్ష్మ స్ఫటికాకార లోహంపై గాలి తదితరాల ఆనవాలు కూడా లేని పూర్తి నియంత్రిత, కృత్రిమ శూన్య పరిస్థితుల్లో ఇది జరిగింది. సాధారణ వాతావరణంలో సంప్రదాయ లోహాల్లో ఇది ఏ మేరకు సాధ్యమన్నది ప్రస్తుతానికి పెద్ద ప్రశ్నే''అని బాయ్స్ చెప్పుకొచ్చారు.

కొసమెరుపు

ఇదెలా సాధ్యపడిందన్న దానిపై నెలకొన్న అస్పష్టత, దీన్ని మనకు మేలు జరిగేలా మలచుకోవడం ఏ మేరకు సాధ్యమన్న సందిగ్ధత తదితరాలను పక్కన పెడితే ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ వంటి పలు రంగాల్లో ఈ పరిశోధన ఫలితం అతి పెద్ద ముందడుగన్నది మాత్రం నిస్సందేహం.

జ్యోతి బసు రికార్డును తిరగరాసిన నవీన్



భువనేశ్వర్: దేశంలో సుదీర్ఘ కాలం కొనసాగిన రెండో ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్ సీఎం జ్యోతి బసు పేరిట ఉన్న రికార్డును ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తిరగరాశారు. దేశంలోనే సుదీర్ఘ కాలం పాటు, 24 ఏళ్లకు పైగా అధికారంలో కొనసాగిన సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ మొదటి స్థానంలోనే కొనసాగుతున్నారు. ఆయన తర్వాత కమ్యూనిస్టు యోధుడు జ్యోతి బసు 1977 జూన్ 21 నుంచి 2000 నవంబర్ 5వ తేదీ వరకు 23 ఏళ్ల 137 రోజులు సీఎంగా కొనసాగారు. ఒడిశా సీఎంగా 2000 మార్చి 5న మొదటిసారిగా బాధ్యతలు చేపట్టిన నవీన్ పట్నాయక్ అయిదు పర్యాయాలు ఆ రాష్ట్రానికి సీఎంగా ఎన్నికై శనివారం నాటికి 23 సంవత్సరాల 138 రోజులు పూర్తి చేసుకున్నారు. దీంతో, చామ్లింగ్ తర్వాతి స్థానంలోకి చేరారు. పవన్ కుమార్ చామ్లింగ్, జ్యోతి బసు తర్వాత వరుసగా అయిదు పర్యాయాలు సీఎంగా ఎన్నికైన నేతగానూ నవీన్ పట్నాయక్ మూడో స్థానంలో నిలిచారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేడీ మళ్లీ విజయం సాధించి, సీఎంగా పగ్గాలు చేపట్టిన పక్షంలో నవీన్ పట్నాయక్ దేశంలోనే సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నేతగా నిలుస్తారు.

ఒక్క రోజూ స్కూలు మానకుండా... పదేళ్లకే 50 దేశాలు చుట్టింది!

లండన్: ఆ అమ్మాయి పేరు అదితీ త్రిపాఠి. వయసు పదేళ్లు. లండన్‌లో నివసిస్తున్న భారత సంతతికి చెందిన అదితి పదేళ్ల వయసుకే 50 దేశాలు చుట్టేసింది. అది కూడా ఒక్క రోజు కూడా స్కూలు మానలేదు. అదెలా సాధ్యం అనుకుంటున్నారా ? అదితి తల్లిదండ్రులైన దీపక్, అవిలాషకు దేశాలు తిరగడం, అక్కడ సంస్కృతిని తెలుసుకోవడం, కొత్త కొత్త ఆహారాన్ని రుచి చూడడం అంటే చాలా ఇష్టం. తమ కుమార్తెకు కూడా అన్ని దేశాలు చూపించాలని నిర్ణయించుకున్నారు. అందుకే ప్రతీ శుక్రవారం అదితిని స్కూలు నుంచి పికప్ చేసుకొని విమానాశ్రయానికి వెళ్లేవారు. ఆదివారం రాత్రి 11కల్లా తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకునేవారు. ఒకవేళ కుదరకపోతే సోమవారం ఉదయం ఆమెను నేరుగా పాఠశాలలో దింపేసేవారు. లాంగ్ వీకెండ్‌లు, సెలవుల్లో దూర దేశాలకు వెళ్లేవారు. అలా స్కూలు ఒక్క రోజు కూడా మానకుండా ఇప్పటివరకు 50 దేశాల్ని చూపించారు. ఈ ప్రయాణాల కోసం వారు ఏడాదికి 20 వేల పౌండ్లకు పైగా (రూ.21 లక్షలు) ఖర్చు పెడుతున్నట్టుగా చెప్పారు. ఇప్పటివరకు యూరప్ దేశాలతో పాటు థాయ్‌లాండ్, ఇండోనేసియా, సింగపూర్ దేశాలు పర్యటించారు. ఏడాదికి 12 దేశాలు తిరిగేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

రేప్ చేసి, రంపాలపై పడేసి...

ఇద్దరు యువతులపై అత్యాచారం, హత్య!

- మణిపూర్‌లో మరో దారుణం
- మహిళల్ని నగ్నంగా ఊరేగించిన మే 4వ తేదీనే ఈ ఘోరం
- 100 మందికి పైగా ఈ ఘాతుకానికి పాల్పడ్డారు
- ఫిర్యాదులో పేర్కొన్న ఓ బాధితురాలి తల్లి



తూర్పు ఇంఫాల్‌లో శనివారం నిరసన తెలుపుతున్న బాధిత ప్రజలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటన జరిగిన రోజే అక్కడికి 40కి.మీ. దూరంలో మరో దారుణం జరిగింది. కుకి–జోమి తెగకు చెందిన ఇద్దరు యువతుల్ని సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేసినట్టుగా పోలీసు స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ ద్వారా వెల్లడైంది. బాధిత యువతులు 21, 24 ఏళ్ల వయసున్న వారు. ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని కొనుంగ్ మమాంగ్ ప్రాంతంలో కార్లు వాష్ చేసేవారు. మే 4న వారు కార్లు కడుగుతూ ఉండగా అల్లరిమూక కొందరు అక్కడికి వచ్చి దౌర్జన్యంగా వారిని పక్కనే ఉన్న గదిలోకి లాక్కెళ్లారు. వాళ్లు అరవకుండా నోటికి గుడ్డలు కట్టేసి అత్యంత పాశవికంగా అత్యాచారం చేసినట్టుగా జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఆ తర్వాత ఆ ఇద్దరు యువతుల్ని దుండగులు పక్కనే ఉన్న రంపం మిల్లులోకి లాగి పడేశారు. రంపాల మీద పడేయడంతో వారు తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడిపోయారు. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. ఆ ఇద్దరు యువతుల్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్లడం తాము చూశామని వారి స్నేహితులు చెబుతున్నారు. మరణించిన ఇద్దరు యువతుల్లో ఒకరి తల్లి సాయికుల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపుగా 100–200 మంది దుండగులు రాక్షసంగా తమ కుమార్తె, ఆమె స్నేహితురాల్ని అత్యాచారం చేసి, హింసించి చంపేశారని ఆమె అందులో పేర్కొన్నారు.

వీడియో ఘటనలో మరో నిందితుడు అరెస్ట్

మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అమానవీయ ఘటనలో పోలీసులు అయిదో నిందితుడిని అరెస్ట్ చేశారు. 19 ఏళ్ల వయసున్న యువకుడిని అదుపులోనికి తీసుకున్నట్టుగా పోలీసులు వెల్లడించారు. ఆ వీడియోలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

మణిపూర్‌లో వెలుగులోకి మరో భయానక ఘటన

ఇటీవల మణిపూర్‌లో జరిగిన రెండు వర్గాల ఘర్షణల్లో ఓ స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను కొందరు దుండగులు సజీవదహనం చేశారు. ఆమెను లాక్కెళ్లి ఇంట్లో తాళం వేసి నిప్పంటించారు. దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. కక్చింగ్ జిల్లాలోని సిరోయూ గ్రామంలో మే 28న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పార్లమెంటు ఆవరణలో రేపు విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రతిష్టంభన నెలకొనడంతో సభ వెలుపల నిరసనల ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించాయి. సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగనున్నాయి. ఈ మేరకు ఇండియా కూటమికి చెందిన పార్టీల ఎంపీలు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నారు. ఆ సమావేశంలో సభలో అనుసరించే వ్యూహాలపై చర్చిస్తారు. సభ లోపలికి వెళ్లడానికి ముందు ప్రధాని ప్రకటనపై డిమాండ్ చేస్తూ మహాత్మగాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగనున్నారు. మరోవైపు పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే మణిపూర్ అంశంలో చర్చ లేవనెత్తాలని టీఎంసీ డిమాండ్ చేసింది. బీజేపీ సభ్యులే సభాకార్యక్రమాలను అడ్డుకుంటున్నారని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రియన్ మండిపడ్డారు.

ఆ రాష్ట్రాలపై పెదవి విప్పరెందుకు: బీజేపీ

ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా ఎవరూ నోరు ఎందుకు మెదపడం లేదని బీజేపీ ప్రశ్నించింది. రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై నేరాలు, ఘోరాలు జరుగుతూ ఉంటే, మణిపూర్ చుట్టూ ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు.

వియత్నాంకు కానుకగా మన యుద్ధనౌక



న్యూఢిల్లీ: వియత్నాంకు భారత్ అరుదైన కానుక అందించింది. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి నిదర్శనంగా ఐఎన్ఎస్ కృపాణ్ యుద్ధనౌకను బహుమతిగా ఇచ్చింది. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఆధిపత్యంపై ఇరు దేశాల్లో నెలకొన్న ఆందోళనల్ని దృష్టిలో ఉంచుకొని తీర ప్రాంతంలో గస్తీని బలోపేతం చేయడం దీని ఉద్దేశమంటున్నారు. పూర్తి సామర్థ్యంతో పని చేసే యుద్ధ నౌకను ఒక మిత్రదేశానికి భారత్ కానుకగా ఇవ్వడం ఇదే తొలిసారని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడించారు. వియత్నాం పర్యటనలో ఉన్న ఆయన శనివారం బే ఆఫ్ కామ్ రన్హ్ జలాల్లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ కృపాణ్‌ను ఆ దేశానికి అందజేశారు. పూర్తిస్థాయి ఆయుధాలతో కూడిన నౌకను ఆ దేశ నేవీకి అప్పగించినట్టు వివరించారు. భారత్ జీ20 సదస్సు ప్రధాన థీమ్ అయిన వసుధైక కుటుంబం (ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్)లో భాగంగానే ఈ కానుక ఇచ్చినట్టు తెలిపారు. ఐఎన్ఎస్ కృపాణ్ గస్తీతో దక్షిణ చైనా జలాల్లో అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా అన్ని దేశాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎన్ఎస్ కృపాణ్ జూన్ 28న విశాఖపట్నం నుంచి బయల్దేరి జూలై 8 నాటికి వియత్నాం చేరింది.

మహారాష్ట్రలో 9 ఏళ్ల బాలుడు నరబలి

నాసిక్: నిధులు దొరుకుతాయనే కొందరి మూఢ విశ్వాసం తొమ్మిదేళ్ల బాలుడిని బలి తీసుకుంది. ఈ ఘోరం మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్ తాలూకా పాహనె షివార్ గ్రామంలో ఈ నెల 16న చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆరు బయట ఆడుకుంటున్న ఒక బాలుడిని నిర్బంధించి తాంత్రిక పూజల్లో భాగంగా గొంతుకోసి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని గుంతలో సగం వరకు పూడ్చిపెట్టారు. ఈ నెల 18న ఈ దారుణం వెలుగులోకి రావడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిధి దొరుకుతుందనే మూఢ నమ్మకంతో ఈ దురాగతానికి పాల్పడినట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. 8 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్ వ్యాప్తంగా రష్యా సాగించిన దాడుల్లో 8 మంది పౌరులు మృతి చెందగా పలువురు గాయాలపాలయ్యారు. డొనెట్స్క్‌లోని నియు–యోర్క్‌పై రష్యా సైన్యం జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. కొస్టియాంటీనివ్కాపై జరిగిన రాకెట్ల దాడిలో 20 వరకు ఇళ్లు, కార్లు, గ్యాస్ పైప్‌లైన్ ధ్వంసం కాగా ఇద్దరు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు. చెర్నిహివ్‌పై రష్యా క్రూయిజ్ మిస్సైళ్లు పడటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. జపొరిజియా అణు ప్లాంట్ పొరుగునే ఉన్న పట్టణంపై రష్యా దాడిలో ముగ్గురు పౌరులు గాయపడ్డారు. ఇలా ఉండగా, నల్ల సముద్రం ధాన్యం రవాణా ఒప్పందాన్ని రద్దు చేసిన రష్యా ఉక్రెయిన్ నౌకా తీర ప్రాంతం ఒడెసాను లక్ష్యంగా చేసుకుంది. రష్యా మిలటరీ ప్రయోగించిన రెండు క్రూయిజ్ మిస్సైళ్లు గిడ్డంగులపై పడటంతో మంటలు చెలరేగి పరికరాలు ధ్వంసమయ్యాయని, 120 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు బూడిదయ్యాయని ఉక్రెయిన్ తెలిపింది. క్రిమియాపై దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులకు పాల్పడినట్లు రష్యా తెలిపింది. ఈ పరిణామంపై తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్లను పశ్చిమదేశాలు నెరవేర్చి, ధాన్యం రవాణా కారిడార్ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలని సూచించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్ చేసి మాట్లాడతానని, వచ్చే నెలలో తుర్కియేలో ఆయనతో భేటీ ఉంటుందని ఆశిస్తున్నానన్నారు. కాగా, రష్యా ఆక్రమిత క్రిమియాలో వారం వ్యవధిలో రెండోసారి డ్రోన్ పేలింది. క్రాస్నోవార్డిస్క్‌లోని ఆయిల్ డిపో, ఆయుధ గిడ్డంగిలను డ్రోన్ బాంబులతో పేల్చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. సోమవారం ఉక్రెయిన్ జరిపిన దాడిలో రష్యాను కలిపే కీలకమైన క్రిమియా వంతెన కొంతభాగం దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇలా ఉండగా, జపొరిజియా ప్రాంతంలో ఉక్రెయిన్ శతఘ్ని కాల్పుల్లో రియా వార్తా సంస్థకు చెందిన రష్యా జర్నలిస్టు ఒకరు మృతి చెందారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై... జర జాగ్రత్త: సీజేఐ



సాక్షి, చెన్నై: వేగంగా జనబాహుళ్యంలోకి చేరేందుకు అవకాశమున్న సామాజిక మాధ్యమాలు, అన్ని రంగాల్లోకి విస్తరించిన కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగాన్ని అరికట్టే సాంకేతికత అందరికీ అందుబాటులోకి రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఐఐటీ మద్రాస్ 60వ స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మానవీయ విలువలు, వ్యక్తిగత గోప్యతలకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని సీజేఐ తెలిపారు. ఆధునిక సాంకేతికతను సానుకూలంగా వాడుకునేందుకు వీలుగా రక్షణలు ఏర్పాటు చేసి నిరుపాయకరమైందిగా మార్చా లన్నారు. సాంకేతికతతో వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని ప్రజలు భయపడక ముందే నమ్మకమైన వినియోగాన్ని సులభతరం చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల రాకతో సరిహద్దులు, వయస్సు, జాతీయత వంటి అవరోధాలు తొలగినప్పటికీ ఆన్‌లైన్‌లో వేధింపులు, ట్రోలింగ్ వంటివి కొత్తగా పుట్టుకొచ్చా యని సీజేఐ పేర్కొన్నారు.

జాతి క్షేమాన్ని మించిన పదవీ కాంక్ష..

గత కాంగ్రెస్ ప్రభుత్వంపై మోదీ విసుర్లు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సారథ్యంలోని గత యూపీఏ ప్రభుత్వం అధికార వ్యామోహంతో జాతి ప్రయోజనాలను పక్కనబెట్టిందని, బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలను తిరిగి గాడినపెట్టిందని చెప్పారు. శనివారం ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళాను వర్చువల్‌గా ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో 70వేల మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. 'ఆ ఒక్క కుటుంబానికి సన్నిహితులైన కొందరు రాజకీయ నేతలు బ్యాంకుల నుంచి తమ వారికి వేల కోట్ల రూపాయలను ఇప్పించి, ఎప్పటికీ తిరిగి చెల్లించేవారు కాదు. అప్పట్లో జరిగిన ఫోన్ బ్యాంకింగ్ స్కాం అతిపెద్ద కుంభకోణం. అది దేశ బ్యాంకింగ్ వ్యవస్థ వెన్ను విరిచేసింది'అని ప్రధాని తెలిపారు. ఇప్పుడు అందరూ ఫోన్ బ్యాంకింగ్‌ను వాడుకుంటున్నారు. కానీ, అప్పట్లో జరిగింది వేరని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఉన్న దేశాల్లో భారత్ కూడా ఉందన్నారు. తమ ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల నిర్వహణను బలోపేతం చేయడం, బ్యాంకులను విలీనం చేయడం, ఈ రంగంలో వృత్తినైపుణ్యంను పెంచడం వంటి అనేక చర్యలతో ఇది సాధ్యమైందని వివరించారు. గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు వేలాది కోట్ల నిరర్థక ఆస్తులతో కునారిల్లుతూ ఉండేవి. కానీ, నేడవి రికార్డు స్థాయిలో లాభాలను ఆర్జిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించడంలో, ముద్ర వంటి వివిధ ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు శ్రమిస్తున్న తీరు, నిబద్ధతలను ఆయన కొనియాడారు.

వాతావరణ కార్యాచరణలో భారత్ ముందుంది

పణజి: వాతావరణ కార్యాచరణలో భారతదేశం ముందుండి నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హరితాభివృద్ధి, ఇంధన పరివర్తన వంటి వాతావరణ పరిరక్షణ హామీలను ఒక్కటొక్కటిగా నెరవేరుస్తోందని అన్నారు. శనివారం ప్రధాని గోవాలో జరుగుతున్న జీ20 కూటమి దేశాల ఇంధన మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు. స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంలో 50 శాతం మృత్తికేతర ఇంధన వనరుల నుంచి 2030నాటికి సాధించాలన్న లక్ష్యం కోసం భారత్ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. పవన, సౌర విద్యుదుత్పాదనలో సైతం అగ్రగామి దేశాల సరసన భారత్ నిలిచిందని తెలిపారు. వీటితోపాటు తక్కువ వడ్డీకే రుణాలివ్వడం ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చేయూతనివ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. 'సాంకేతికతలో అంతరాలను పూడ్చటం , ఇంధన భద్రత పెంపు, సరఫరా గొలుసుల్లో వైవిధ్యత వంటివాటి కోసం నూతన మార్గాలను అన్వేషించాల్సి ఉంది. భవిష్యత్తు ఇంధనాల కోసం సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఇంధన భద్రతను పెంచుకునేందుకు దేశాల మధ్య గ్రిడ్లు, అనుసంధానతలపై దృష్టి సారించాలి. పరస్పరం అనుసంధానించిన గ్రీన్‌గ్రిడ్లు గొప్ప మార్పును తీసుకువస్తాయి'అని ప్రధాని మోదీ అన్నారు. వీటివల్ల వాతావరణ లక్ష్యాలు, హరిత పెట్టుబడుల సాధన, కోట్లాదిమందికి హరిత ఉద్యోగావకాశాల కల్పనకు వీలవుతుందని తెలిపారు. 'ఇంధనం లేనిదే అభివృద్ధి, భవిష్యత్తు స్థిరత్వంపై చర్చ పూర్తికాదు. వ్యక్తుల నుంచి దేశాల వరకు అభివృద్ధిలో అన్ని స్థాయిల్లోనూ ఇంధన కీలకంగా మారిందని పేర్కొన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం। 23। జూలై। 2023

అంజనాద్రి దర్శనం



శనివారం హంపీ వద్ద అంజనాద్రి బెట్టపై భక్తుల రద్దీ. శ్రావణ శనివారం కావడంతో తరలివచ్చారు

డ్రైవర్ లేకుండా మెట్రో రైలు

వాహనం నడపాలంటే డ్రైవర్లు తప్పనిసరి. కానీ ఆధునిక సాంకేతికత డ్రైవర్ల అవసరం లేకుండా ప్రయాణికులను గమ్యస్థానం చేరుస్తోంది. పాశ్చాత్య దేశాలలో డ్రైవర్‌లెస్ కార్లు ఇప్పటికే ప్రాచుర్యం పొందాయి. అలాగే ఐటీ సిటీలో డ్రైవర్లతో నిమిత్తం లేకుండా మెట్రో రైళ్లు పరుగులు తీయబోతున్నాయి. కంట్రోల్ రూం నుంచి రైలు గమనాన్ని పర్యవేక్షిస్తారు. డ్రైవర్లకు అనారోగ్యం, సమ్మె వంటి సమస్యలతో ఇబ్బంది ఉండదు.

- ఏడాది ఆఖరి నుంచి అమలు
- మెట్రో సంస్థ సన్నాహాలు
- కొత్తగా సీబీటీసీ సాంకేతికత ఏర్పాటు



పర్పుల్ లైన్‌లో మొదట డ్రైవర్ రహిత మెట్రోలు పరుగులు తీస్తాయి

బనశంకరి: బెంగళూరులో డ్రైవర్‌లు లేకుండానే మెట్రో రైళ్లు దూసుకుపోనున్నాయి. ఈ ఏడాది చివరిలో ప్రారంభిస్తున్నట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. దీనికి కావలసిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 2020 డిసెంబరులో దేశ రాజధాని ఢిల్లీలో డ్రైవర్ రహిత మెట్రో రైలును ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. తరువాత దేశ ఆర్థిక రాజధాని ముంబై లో డ్రైవర్‌లెస్ మెట్రో రైళ్లు వచ్చాయి. ఆగస్టులో తమిళనాడు రాజధాని చెన్నైలో అమలులోకి రానుంది. ఇప్పుడు ఐటీ సిటీలో శ్రీకారం చుట్టబోతున్నారు.

ఆర్‌వీ రోడ్డు– బొమ్మసంద్ర మార్గంలో

19 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ గా ఉన్న గులాబీ లైన్‌లో (ఆర్‌వీ రోడ్డు– బొమ్మసంద్ర) ఈ ఏడాది చివరిలో ప్రారంభం కానుంది, నిజానికి గత ఏడాది పూర్తి కావలసి ఉంది. కానీ కోవిడ్ కారణంగా పనులు ఆలస్యం కావడంతో ఈ ఏడాది చివరిలో ప్రారంభించే కారిడార్‌లో డ్రైవర్ రహిత మెట్రో నడపడానికి బీఎంఆర్‌సీఎల్ సన్నాహాలు చేస్తోంది. సీబీటీసీ సిగ్నలింగ్ ఆధారంగా డ్రైవర్లు లేకుండా ఈ రైళ్లు పరుగులు తీస్తాయని మెట్రో వర్గాలు తెలిపాయి.

ఇంటర్‌చేంజ్‌గా సిల్క్‌బోర్డు స్టేషన్

నమ్మ మెట్రో గులాబీ మార్గం నిర్మాణదశలో ఉండగా దీని పొడవు 18.82 కిలోమీటర్లు. ఈ మార్గాన్ని ఆర్‌వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర కు అనుసంధానిస్తారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్ కాగా 16 స్టేషన్లు కలిగి ఉంది. ఆర్‌వీ రోడ్డు స్టేషన్ టెర్మినల్ స్టేషన్ కాగా గ్రీన్ లైన్‌తో ఇంటర్ చేంజ్ కల్పిస్తారు. సిల్క్‌బోర్డు స్టేషన్ గులాబీలైన్, నీలి లైన్ మధ్య మరో ఇంటర్ చేంజ్ స్టేషన్ కానుంది. గులాబీ లైన్‌ను మొదట్లో బొమ్మసంద్ర వరకు ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇప్పుడు బొమ్మసంద్ర నుంచి తమిళనాడులోని హోసూరు పట్టణం వరకు విస్తరించడానికి కర్ణాటక ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



ఢిల్లీ, ముంబైలో ఇప్పటికే డ్రైవర్లు లేకుండా మెట్రో రైళ్లు సంచరిస్తున్నాయి

ఎలా పనిచేస్తాయంటే

- డ్రైవర్ రహిత రైళ్లను నడపడానికి మెట్రో రైల్వేలో సాంకేతికంగా మార్పులు చేశారు. ఆధునిక సీబీటీసీ సిగ్నలింగ్ వ్యవస్థలను అమర్చారు. ఇది రైళ్లు స్వయంచాలితంగా సంచరించడానికి సహాయపడుతుంది.
- గులాబీ (పర్పుల్) లైన్‌కు సీబీటీసీ సాంకేతికతను అమర్చారు. ఎలక్ట్రానిక్ సిటీ, గొట్టిగెరె, నాగవార, సిల్క్‌బోర్డు, కెంపేగౌడ విమానాశ్రయం లాంటి కొత్త మార్గాల్లో సీబీటీసీ వ్యవస్థను అమర్చుతారు.
- డ్రైవర్ రహిత మెట్రోరైలులో డ్రైవర్ ఉండరు, ఒక అటెండర్ మాత్రం ఉంటారు, అత్యవసరం అనుకుంటే అటెండర్ డ్రైవింగ్‌ను తీసుకుంటారు. డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడేళ్ల సంచరిస్తే ఆ అటెండర్ అవసరం కూడా ఉండదని మెట్రో అధికారులు తెలిపారు.
- ప్రతి రైలును కంట్రోల్ రూమ్ కేంద్రాల ద్వారా పర్యవేక్షిస్తారు.

న్యూస్‌రీల్

దొంగ మేనేజర్

- రైతుల డబ్బు రూ.1.88 కోట్లు బదిలీ



మేనేజర్ గణేశ్

దొడ్డబళ్లాపురం: బ్యాంకును సక్రమంగా నిర్వహించాల్సిన మేనేజరే దొంగ అవతారమెత్తి దోచుకున్నాడు. దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణలో కర్ణాటక గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్ గణేశ్ రూ.1.88 కోట్లు కొట్టేసి దొరికిపోయాడు. వివరాలు.. చెన్నరాయపట్టణ చుట్టుపక్కల ఇటీవల కేఐఏడీబీ స్వాధీనం చేసుకున్న భూముల రైతులకు నష్టపరిహారాన్ని ఈ బ్యాంకులోనే జమ చేసింది. ఆరు మంది రైతులకు చెందిన పరిహారం రూ.1.88 కోట్లను మేనేజర్ గణేశ్ ఆర్‌టీజీఎస్ ద్వారా వేరే అకౌంట్‌లోకి జమ చేసుకున్నాడు. ఇందుకు బ్యాంకు ఉద్యోగి జితేంద్రకుమార్ కూడా మేనేజర్‌కు సహకరించాడు. జూన్ 3 నుంచి జూలై 13 వరకూ ఆర్టీజీఎస్ ద్వారా పలు దఫాలుగా మొత్తాన్ని బదిలీ చేసుకున్నారు. ఇది రైతుల ద్వారా ఉన్నతాధికారులకు తెలియడంతో ఇద్దరినీ సస్పెండ్ చేశారు. బాధిత రైతులకు మొత్తాన్ని తిరిగి ఇస్తామని కొత్త మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. చెన్నరాయపట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

టమాటా తోటకు సీసీ కెమెరాలు



మైసూరు: ప్రస్తుతం రాష్ట్రంలోనే కాదు దేశంలోను, విదేశాల్లోనూ టమాటకు భారీ ధర ఉంది. కేజీ వంద రూపాయల దాకా ఉండడంతో రైతులకు కనకవర్షం కురుస్తోంది. కానీ దొంగలు రాత్రిపూట పంటను ఎత్తుకెళ్లడం అక్కడక్కడ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భద్రత కోసం రైతులు రకరకాల ఉపాయాలను అనుసరిస్తున్నారు. మైసూరు జిల్లా హుణసూరు తాలూకాలోని కుప్పె గ్రామంలో నాగేష, కృష్ణ అనే ఇద్దరు రైతులు తమ టమాటా తోటలకు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. నాగేష 10, కృష్ణ 4 ఎకరాలలో టమాటా పంటను సాగు చేశారు. ధర ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే రెండుసార్లు తోటల్లో దొంగలు పడి ఎత్తుకుపోయినట్లు రైతులు వాపోయారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ దొంగలను అడ్డుకుంటామని రైతులు చెబుతున్నారు.

మేలుకోటెలో తిరువాడప్పోరం వేడుకలు



ఆదిశేషుని వాహనంపై కళ్యాణ నాయకి అమ్మవారు

మండ్య: మండ్య జిల్లా మేలుకోటెలో వెలిసిన శ్రీ చెలువనారాయణ స్వామి వారి ఆలయంలో శనివారం మహాలక్ష్మీ అమ్మవారి తిరువాడప్పోరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మహాలక్ష్మీ ఆండాళ్ రూపంలో భూమిపై అవతరించిన రోజుగా అమ్మవారికి శనివారం తిరువాడిప్పోరం నిర్వహించారు.

ఇన్నోవాను ఢీకొన్న టిప్పర్

- హాసన్ జిల్లాలో నలుగురు దుర్మరణం



నుజ్జయిన కారు

యశవంతపుర: హాసన్ జిల్లా ఆలూరు తాలూకా ఈశ్వరహళ్లి కొడిగె వద్ద శుక్రవారం సాయంత్రం టిప్పర్ లారీ– ఇన్నోవా కారును ఢీకొంది. ఇన్నోవాలోని నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. హాసన్ తాలూకా కుప్పళి గ్రామానికి చెందిన చేతన్ (24), గుట్టేనహళ్లికి చెందిన అశోక్ (35), తట్టెకెరెవాసి పురుషోత్తమ (28), చిగళూరువాసి దినేశ్ (30)లు మృతులు. సకలేశపుర నుంచి హాసన్‌కు ఇన్నోవా కారులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్‌లారీ వేగంగా ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు కాగా నలుగురూ తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు క్షతగాత్రులు హాసన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలాన్ని ఎస్పీ హరిరాం శంకర్ పరిశీలించారు. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

విమానాలకు ఆటంకం

బనశంకరి: ప్రతికూల వాతావరణం వల్ల శనివారం మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాల ల్యాండింగ్‌కు ఆటంకం ఏర్పడింది. బెంగళూరు నుంచి మంగళూరుకు వచ్చిన విమానం మేఘావృతం, పెనుగాలుల వల్ల దిగడానికి ఆస్కారం లేకపోవడంతో దగ్గరిలోని కణ్ణూరుకు మళ్లించారు. అక్కడ దిగిన విమానం మంగళూరులో వాతావరణం చక్కబడ్డాక తిరిగి వచ్చి ల్యాండయింది. ముంబై నుంచి మరో విమానానికి కూడా అదే పరిస్థితి ఎదురైంది.

ఎస్ఐ ఉద్యోగాల స్కాంపై న్యాయ విచారణ

- కాంగ్రెస్ సర్కారు ఆదేశం
- హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ వీరప్పకు బాధ్యతలు





శివాజీనగర: గత బీజేపీ సర్కారు హయాంలో దేశమంతటా సంచలనం సృష్టించిన 545 పోలీస్ సబ్‌ఇన్స్పెక్టర్‌ల (ఎస్ఐ) పోస్టుల రాతపరీక్షలో జరిగిన కుంభకోణంపై సిద్దరామయ్య ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ బీ.వీరప్ప నేతృత్వంలో న్యాయ కమిషన్‌ను ఇందు కోసం నియమించారు. జస్టిస్ వీరప్ప కొన్నినెలల కిందటే రిటైరయ్యారు. ఏసీబీని రద్దు చేసి, లోకాయుక్తను పునః ప్రారంభించాలని వేసిన వ్యాజ్యాలను ఆయనే విచారించారు. ఈ స్కాంలో ఏం జరిగిందో విచారణను పూర్తిచేసి మూడు నెలల్లో నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

ఏమిటీ కేసు..

అప్పటిప్రభుత్వం 545 ఎస్ఐ ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించింది. 2021 అక్టోబరులో పరీక్షలు జరగ్గా కొన్ని సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థులకు బ్లూటూత్ ఉపకరణాల ద్వారా సమాధానాలు చేరవేశారు. అలాగే సమాధానాపత్రాలనూ దిద్దించారు. ఇందులో ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 40 లక్షల వరకూ వసూలు చేసినట్లు అభియోగాలున్నాయి. కలబుర్గిలో ఒక ఆంగ్ల పాఠశాలలో పరీక్ష సెంటర్‌లో ఈ అక్రమాలు భారీగా సాగాయి, పాఠశాల యజమాని రుద్రేగౌడ పాటిల్ ఈ స్కాంను నడిపించాడు. కొన్నిరోజులకు అక్రమాలు గుప్పుమనడంతో బొమ్మై సర్కారు దర్యాప్తు చేసి రుద్రేగౌడతో పాటు మరికొందరు నిందితులు, 50 మందికి పైగా పరీక్షార్థులను సీఐడీ అరెస్టుచేసింది. అదనపు డీజీపీ అమృత్‌పాల్ సహా పెద్దసంఖ్యలో ఎస్ఐలు, డీఎస్పీల పాత్ర ఉన్నట్లు తెలిసి అరెస్టులు కూడా నిర్వహించారు. ఈడీ కూడా విచారణ సాగించింది.

వారి ఆలోచన ఏమిటో: బొమ్మై

కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించడంలో వారి ఆలోచన ఏమిటో తనకు తెలియదని బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై అన్నారు. అక్రమాల గురించి తెలిసిన ఆరోజే సీఐడీ విచారణకు తాము ఆదేశించడమైనది, ఇప్పటికే చార్జ్‌షీట్ సమర్పించడమైనది. మళ్లీ న్యాయ కమిషన్‌కు వెళుతున్నారు. అన్నీ కూడా కోర్టులో ఉన్నాయన్నారు.

కోర్టు ఆదేశాల తరువాతే ఎస్ఐ నియామకాలు: హోంమంత్రి

ఎస్ఐ ఉద్యోగాల కుంభకోణంలో విచారణ సాగుతోంది, మరోవైపు నియామక ప్రక్రియను కొనసాగించడానికి కోర్టు ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నట్లు హోం మంత్రి జీ పరమేశ్వర్ తెలిపారు. శనివారం బెంగళూరులో తన నివాసంలో మంత్రి ప్రియాంక్ ఖర్గేతో భేటీ జరిపిన తరువాత విలేకరులతో మాట్లాడారు. 545 ఎస్ఐ ఉద్యోగాల భర్తీని మళ్లీ మొదటి నుంచి నిర్వహించాలని గత సర్కారులో ఉత్తర్వులు వచ్చాయి. ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియను ప్రారంభించనుందని, లేదంటే సిబ్బంది కొరత తలెత్తుతుందని అన్నారు. సోషల్ మీడియాలో బోగస్ వార్తల ప్రసారాన్ని అరికట్టేందుకు చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం, మంత్రులపై వ్యక్తిగతంగా నకిలీ వార్తలతో సమస్యలు వస్తున్నాయి, దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టడమైనదన్నారు.

ఉగ్ర చెల్లింపులపై తనిఖీ

బనశంకరి: అనుమానిత ఉగ్రవాదుల బ్యాంకు అకౌంట్లను సీసీబీ పోలీసులు తనిఖీ చేయగా డిజిటల్ చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఖాతాల్లోకి ఎవరి నుంచి ఎంత నగదు జమఅయింది. ఎన్ని నెలల నుంచి డబ్బు వస్తోంది, వాటి నుంచి ఎవరెవరికి జమచేస్తున్నారు అనే సమాచారం సేకరిస్తున్నారు. విదేశాల్లో దాక్కున్న మాస్టర్ మైండ్ జునైద్ ఈ ఐదుమందికి నిధులు ఇస్తున్నట్లు తెలిసింది. నగదును ఎలా జమచేశారు అనేదానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కాగా, ఐటీ సిటీలో ఐదుమంది అనుమానిత ఉగ్రవాదుల అరెస్టుపై నగర పోలీసులు సమగ్ర నివేదికను కేంద్ర హోంశాఖ కు అందజేశారు.



ధార్వాడలో వర్షంలో బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం

బహిష్కరణ నోటీసులపై ఆక్రోశం



నోటీసులు వచ్చిన భజరంగదళ్ కార్యకర్తలు

యశవంతపుర: మంగళూరుకు చెందిన ముగ్గురు భజరంగ్‌దళ్ కార్యకర్తలకు బహిష్కరణ నోటీసులు ఇవ్వడంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక ధోరణలు అవలంభిస్తోందని మండిపడుతున్నారు. ఇటీవల మంగళూరు సుల్తాన్ జ్యువెలరీ కార్యక్రమంలో బాలచంద్ర అత్తావర, గణేశ్ అత్తావర, జయప్రకాశ్ శక్తినగరలు పదే పదే శాంతిభద్రతలకు విఘాతం కలిస్తున్నారు. దీంతో పోలీసులు మిమ్మలను ఎందుకు బహిష్కరించకూడదో చెప్పాలని నోటీసులు ఇచ్చారు. బహిష్కరణ విషయాన్ని మంగళూరు కమిషనర్ కులదీప్‌కుమార్ జైన్ సమర్థించుకున్నారు. నోటీసులు తీసుకున్న వ్యక్తులు ఎవరనేది తమకు ముఖ్యం కాదని, శాంతిభద్రతలే ముఖ్యమన్నారు. అయితే గోవధ నిషేధ చట్టాన్ని పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు హిందూపర సంఘాలు మండిపడ్డాయి.

హోరెత్తిన హారంగి



శనివారం కొడగు జిల్లాలోని హారంగి డ్యాం గేట్లను ఎత్తడంతో పరుగులు తీస్తున్న జలాలు. ఎగువన వర్షాలతో డ్యాంలోకి వరదనీరు చేరుతోంది.

ఆస్పత్రికెళ్లిన ఆర్టీసీ బస్సు

- గుండెపోటు బాధితునికి చికిత్స



బస్సుతో డ్రైవర్, కండక్టర్

తుమకూరు: బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో డ్రైవర్ బస్సును సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం సాయంత్రం హోసదుర్గ నుంచి బెంగళూరు మార్గంలో వస్తున్న కేఎస్ ఆర్‌టిసి బస్‌లో హోసదుర్గ తాలూకాలోని ఆలగట్ట వాసి కుమారస్వామి (65), భార్యతో కలిసి వస్తున్నాడు. ఆవళగెరె వద్ద కుమారస్వామికి గుండెల్లో నొప్పి, చెమటలు వచ్చి పడిపోయాడు. బస్సు డ్రైవర్ కంసారప్ప వెంటనే బస్సును చిక్కనాయకనహళ్ళి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి బాధితున్ని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

నా జీవితంలో ఇదే మొదటిసారి: సీఎం

బనశంకరి: తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో మొదటిసారిగా విపక్షపార్టీలు సభలో లేకుండా బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బీజేపీ నేతలు ఫ్రీడం పార్కులో ధర్నా చేయడంపై శనివారం విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ శాసనసభ సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చించడం వదిలిపెట్టి బయట పోరాటం చేస్తే ప్రయోజనం లేదన్నారు. విపక్ష నేతలు కూడా చర్చల్లో పాల్గొనాలని, మూడు వారాల పాటు సమావేశాలు నిర్వహించామని కానీ సభా సమయం వృథా చేశారని దుయ్యబట్టారు. స్పీకర్ చర్యలకు తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

కువెంపు వర్సిటీ స్నాతకోత్సవంలో రభస

- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ఎన్‌ఎస్‌యూఐ యత్నం
- పలువురు అరెస్ట్



నిరసనకారులను తరలిస్తున్న పోలీసులు



శివమొగ్గ: శివమొగ్గ జిల్లా శంకరఘట్ట కువెంపు విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవం గందరగోళం మారింది. గవర్నర్ గెహ్లాట్ మాట్లాడుతుండగా ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు ధర్నా చేయడంతో అధికారులు నివ్వెరపోయారు. వివరాలు... వర్సిటీలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వేడుకలను ప్రారంభించారు. ఆయన ప్రసంగించబోతుండగా ఒక్కసారిగా ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ లోనికి దూసుకువచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని అడ్డుకుని వారిని తరలించారు. దీంతో కొద్ది సేపు ఏమి అర్థం కాక గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ...వర్సిటీలో సిబ్బంది నియామకాల్లో చాలా అక్రమాలు జరిగాయని, దానికి కారణం వర్సిటీ వీసీ అని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ బీజేపీ ధర్నా

శివాజీనగర: బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష బీజేపీ బెంగళూరుతో పాటు శనివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా చేపట్టింది. స్వతంత్ర ఉద్యానవనంలో బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాన్ని ఖండిస్తూ ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 48 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారు. 12 హత్యలు జరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని బీజేపీ కార్యర్తలు నినాదాలు చేశారు. గ్యారెంటీ పథకాలను సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు.

క్లుప్తంగా

ఇద్దరు జింకల వేటగాళ్ల అరెస్టు



నిందితులతో అటవీ సిబ్బంది

మైసూరు: జింకలను వేటాడిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. జిల్లాలోని హుణసూరు తాలూకాలోని నెగత్తూరు గ్రామానికి చెందిన అబ్బూరి మధు, సిండెనహళ్లి గ్రామానికి చెందిన ప్రదీప్ పట్టుబడిన వారు. రాజు, ప్రసన్న అనేవారు పరారీలో ఉన్నారు. వీరు తాలూకాలోని అడవుల్లో తిరుగుతూ జింకలను వేటాడి వాటి మాంసాన్ని తరలించేవారు. అటవీ అధికారులకు సమాచారం అందడంతో దాడి చేయగా ఇద్దరు దొరికారు, మరో ఇద్దరు పారిపోయారు. నిందితుల నుంచి మూడు కత్తులు, కొంత జింక మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కన్నడను నేర్పించాలి

గౌరిబిదనూరు: రాష్ట్రంలో నివసించే అన్యభాషల వారికి కన్నడను నేర్పించే బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలని, లేకుంటే రాష్ట్రంలో కన్నడిగులు అల్ప సంఖ్యాకులయ్యే ప్రమాదముందని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ (కసాప) అధ్యక్షుడు నంజుండప్ప అన్నారు. వివి పురం కాలనీలో కళాకారుడు రామకృష్ణ గృహంలో కసాప ఆధ్వర్యంలో ఇంటి ముంగిట కన్నడ పరిమళం అనే కార్యక్రమంలో ప్రసంగించారు. కన్నడ సాహిత్యం గొప్పదనాన్ని నేటి తరం వారికి తెలియజేయడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, రామచంద్రయ్య కన్నడ గీతాలాపన అలరించింది. రవీంద్రనాథ్, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించండి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కేఆర్‌పీపీ నాయకులు

సాక్షి,బళ్లారి: గుగ్గరహట్టిలో తమ పార్టీ కార్యకర్త మహబూబ్ బాషాను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా కేఆర్‌పీపీ నాయకులు గోనాల్ రాజశేఖరగౌడ, ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పార్టీ కార్యకర్తను హత్య చేసిన ముగ్గురు నిందితులను శిక్షించేందుకు, ఇలాంటి హత్యలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీకి వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మల్లికార్జున ఆచార్, ప్రభుశేఖర్‌గౌడ, దివాకర్‌గౌడ, వాసు, రాము, సీనా, తిప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మంజూరు పత్రాల పంపిణీ



పత్రాలను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గంగావతి: నగరంలో శనివారం గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను మహిళలకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు షామిద్ మనియార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. మాట తప్పని తమ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి ప్రజల విశ్వాసం చూరగొంటుందన్నారు. పార్టీ నాయకులు హనుమంతప్ప అరసికేరి, మల్లేశప్ప దేవరమని, సోము పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గం ఎంపిక



మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగావతి: ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలుగా ప్రీతికుమారిని రెండో దఫాకు ఎన్నుకున్నారు. క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారాన్ని అక్షర పబ్లిక్ స్కూల్‌లో సరళంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రేణుక శివరామగౌడ పదాధికారులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ సంస్థ ఉత్తమ సేవలను అందిస్తోందని, మహిళలు సైతం తమ వంతు పాత్ర పోషించాలని ఆమె సూచించారు. సంస్థ కార్యదర్శిగా హిమారెడ్డి సత్తి, ఐఎస్‌బీగా అరుణ వస్త్రద్, ట్రెజరర్‌గా మంజుశా సింగనాళ్, ఎడిటర్‌గా రజిని ఆలంపల్లిలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుచేత సిరిగేరి, జెడ్పీ మాజీ సభ్యులు భాగ్యవతి ముకుందరావ్ భవాని మట్, అక్కి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర కర్ణాటకపై వరుణ ప్రతాపం

- పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు
- ఆల్మట్టి, తుంగభద్ర డ్యాంల్లోకి వరద



కురుస్తున్న భారీ వర్షంలోనే వెళుతున్న వాహనాలు

సాక్షి,బళ్లారి: ఉత్తర కర్ణాటకలోని పలు జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బెళగావి, కలబుర్గి, బీదర్, బాగల్‌కోట, గదగ్, హావేరి, కొప్పళ, విజయనగర జిల్లాలతో పాటు కరావళి, మలెనాడు, దక్షిణ కన్నడ జిల్లాల్లో జోరుగా కురుస్తున్న వర్షాలకు ఆయా ప్రాంతాల్లో వరద పోటెత్తుతోంది. బెళగావి జిల్లాలో ఘటప్రభ, మలప్రభ నదులు భారీ వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యాదగిరి జిల్లాలో కూడా భారీ వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బెళగావిలో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాధికారి పలు గ్రామాల్లో విద్యార్థులకు పాఠశాలలకు సెలవు కూడా ప్రకటించారు. చిక్కమగళూరు, కొడగు, శివమొగ్గ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి.

తుంగభద్రకు 41 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

తుంగభద్ర డ్యాంకు ఎగువన నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో డ్యాంలోకి వరద వస్తోంది. డ్యాంలోకి శనివారం 41572 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో డ్యాంలో నీటి నిల్వ 16.649 టీఎంసీలకు పెరిగింది. ఇదే ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశం ఉండటంతో పంటలు సాగు చేసే అవకాశం లభిస్తోందని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆల్మట్టి డ్యాంలోకి కూడా ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న విస్తారమైన వర్షాలకు భారీగా నీరు చేరుతోంది. ఆల్మట్టి డ్యాంలో నీటిమట్టం 512.56 మీటర్లు, ఇన్‌ఫ్లో 83945 క్యూసెక్కులు, నీటినిల్వ 44.49 టీఎంసీలకు చేరింది.

విపక్షాల గొంతునొక్కడం హేయం

- ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తున్న కాంగ్రెస్
- మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



బళ్లారి రాయల్ సర్కిల్‌లో బీజేపీ నాయకుల ధర్నా



రాయచూరులో బీజేపీ నేతల ఆందోళన

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థనే ఖూనీ చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మండిపడ్డారు. ఆయన శనివారం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ వ్యతిరేక విధానాలపై జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో రాయల్ సర్కిల్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురారిగౌడ, మాజీ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, కార్పొరేటర్లు మోత్కర్ శ్రీనివాస్, హనుమంతు, ప్రముఖులు అనిల్‌నాయుడు, గురులింగనగౌడ, హనుమంతప్ప, ఐనాథరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్వాధికార ధోరణి తగదు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్వాధికార ధోరణితో వ్యవహరించడం తగదని జిల్లా బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. శనివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమానంద యాదవ్, నేతలు పాటిల్, ఆంజనేయ, శశిరాజ్, రాజ్ కుమార్, వాణిశ్రీ, రాఘవేంద్ర, కొట్రేశప్పలున్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై ధర్నా

కోలారు: కాంగ్రెస్ పార్టీ పాలనా వైఫల్యాలు, దౌర్జన్యాలను ఖండిస్తూ బీజేపీ కార్యకర్తలు శనివారం నగరంలోని బస్టాండు సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను శాసనసభలో నిలదీసిన చేసిన బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అమానుషమన్నారు. సభాధ్యక్షుడు యూటీ ఖాదర్ కాంగ్రెస్ పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారారన్నారు. ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే వై సంపంగి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్ బి మునివెంకటప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కెయుడీఏ మాజీ అధ్యక్షుడు విజయకుమార్, అప్పి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యావత్ దేశం చూపు.. కర్ణాటక వైపు

- అర్హురాలైన ప్రతి మహిళకు గృహలక్ష్మి వర్తింపు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర ఉద్ఘాటన



గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి నాగేంద్ర తదితరులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఐదు గ్యారంటీలతో పేదలకు చేస్తున్న మేలుతో యావత్ దేశం కర్ణాటక వైపు చూస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర అన్నారు. ఆయన శనివారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.2 వేలను అందిస్తామన్నారు. జిల్లాలో అర్హులైన 3,45,125 మంది మహిళలు ఈ పథకంలో పేర్ల నమోదుకు ఎలాంటి గడువు లేదన్నారు. పేర్ల నమోదుకు ఆధార్, బ్యాంకు అకౌంట్ నంబర్, రేషన్‌కార్డు అందించాలన్నారు. ఆదాయపన్ను కట్టే వారు అనర్హులు అన్నారు. ఆగస్టు 15 తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లో గృహలక్ష్మి నగదు జమ అవుతుందన్నారు. జిల్లాధికారి నియామకంపై సీఎం ఏ నిర్ణయం తీసుకున్నా తనకు అభ్యంతరం లేదన్నారు. ఈ విషయంలో తనకు, ఎమ్మెల్యేల మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. గుగ్గరహట్టిలో మహబూబ్ బాషా హత్యకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. ఈ విషయంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ పూర్తయినందున నిధులు విడుదల చేయించి పనులను పూర్తి చేయిస్తామన్నారు.

లాళగొండ సముదాయాన్ని ఉప కులాల జాబితాలో చేరుస్తాం

బళ్లారిఅర్బన్: రాష్ట్రంలో లింగాయత్ లాళగొండ సముదాయాన్ని ఉప కులాల జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని బసవభవన్‌లో అఖిల కర్ణాటక లింగాయత లాళగొండ సమాజం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యతోనే ఉన్నత స్థానాలను అలంకరించవచ్చన్నారు. లింగాయత్ లాళగొండ సమాజం తనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో లాళగొండ సమాజ ప్రముఖులు అరివి బసవనగౌడ, రామనగౌడ, మల్లికార్జునగౌడ, తిమ్మనగౌడ, ఘన మల్లనగౌడ, సిరిగేరి పన్నారాజ్, మీనళ్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ కాదు.. కామాంధుడు



మళఖేడలోని మొరార్జీ దేశాయి పాఠశాల

రాయచూరు రూరల్: బీదర్ జిల్లాలో మొరార్జీ దేశాయి పాఠశాల విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. బీదర్ తాలూకా మళఖేడ మొరార్జీ దేశాయి పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగశెట్టి కులకర్ణిపై 20 మందికి పైగా విద్యార్థినులపై లైంగిక దాడికి యత్నించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై జిల్లాధికారి గోవిందరెడ్డి ఐదుగురు సభ్యులతో మహిళా నిజ నిర్ధారణ కమిటీని వేసి విచారణకు ఆదేశించారు. ఈ నెల 7న ఓ విద్యార్థిని తన పుట్టిన రోజున ప్రిన్సిపాల్ గదికి పిలిచి తనను బలవంతం చేశారని తెలిపింది. ఈనేపథ్యంలో బాలల సంరక్షణ మండలి ఫిర్యాదు మేరకు చిటగుప్ప పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.

క్రెడిట్ కార్డు అప్‌డేట్ సాకుతో వంచన

హుబ్లీ: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును అప్‌డేట్ చేయకపోతే బ్లాక్ అవుతుందని నమ్మించి కార్డు అప్‌డేట్ సాకుతో రూ.14,933 ఆన్‌లైన్ ద్వారా తమ ఖాతాలోకి బదలాయించుకొని వంచించిన ఘటన శుక్రవారం ధార్వాడలో జరిగింది. దేవానంద రత్నాకర అనే వ్యక్తిని కేటుగాళ్లు నమ్మించి లింక్ డౌన్‌లోడ్ చేయించి ఓటీపీ తీసుకొని డబ్బులు బదలాయించుకున్నారు. ఈ ఘటనపై హుబ్లీ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వింబుల్డన్‌లో విహాన్‌రెడ్డి సత్తా

- అండర్–14 చాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో చోటు
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానానికి చేరిక
- రాణించిన కళ్యాణ కర్ణాటక చిచ్చర పిడుగు



క్రీడాకారుడు విహాన్ రెడ్డి

రాయచూరు రూరల్: అండర్–14 టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ప్రపంచ ర్యాంకింగ్‌లో మొదటి స్థానం పొందిన విహాన్ రెడ్డి వింబుల్డన్ పోటీల సెమీఫైనల్‌కు చేరాడు. కళ్యాణ కర్ణాటక నుంచి రాణించిన ఈ చిచ్చర పిడుగు విహాన్ రెడ్డి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన యాదగిరి తాలూకా గ్రామీణ క్రీడాకారుడు. రెండు దశాబ్దాల క్రితం కార్లోస్ అల్కరాజ్ వింబుల్డన్ టెన్నిస్‌లో చాంపియన్‌గా నిలిచాడు. అదే కోవకు చెందిన అండర్–14 బాలుర విభాగంలో యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా ఏలేరుకు చెందిన 13 ఏళ్ల విహాన్‌రెడ్డి భారత విజయ పతాకం ఎగుర వేశారు. వారం రోజుల క్రితం అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన వింబుల్డన్ పోటీల్లో స్లోవేనియా క్రీడాకారుడు స్ట్రీట్ సుల్జిక్‌ను ఓడించి సెమీఫైనల్ చేరుకున్నాడు.

ఐదో ఏటనే టెన్నిస్‌లోకి అరంగేట్రం:

ఏలేరులో బసణ్ణ గౌడ రెడ్డి, రూపా పాటిల్ దంపతులకు జన్మించిన విహాన్ రెడ్డి తన ఐదో ఏటనే టెన్నిస్‌లోకి అరంగేట్రం చేశాడు. విహాన్ రెడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ టెన్నిస్‌లో రాణించాడు. బెంగళూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నర్సరీ చదువుతూ టెన్నిస్ ఆడాడు. 2014 నుంచి అమెరికాలో బసణ్ణగౌడ రెడ్డి, రూపా పాటిల్‌లు నివాసముంటున్నారు.

ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి స్నేహశీలి



మోహన్‌రెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

బళ్లారి రూరల్: దివంగత ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి స్నేహశీలి, మృదు స్వభావి అని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని సెంటినరీ హాలులో దివంగత ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌రెడ్డి శ్రద్ధాంజలి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎం.మోహన్‌రెడ్డి తనకు ఎంతో ఆత్మీయుడని, వృత్తిలో నిష్ణాతుడు, ప్రవృత్తిలో నాటకరంగంలో ఎన్నో పాత్రలు చేశాడని తెలిపారు. ప్రిన్సిపాల్‌గా విరమణ పొందాక తనతో కలిసి సమాజ సేవలో పాల్గొంటానని చెప్పేవాడని గుర్తు చేసుకొన్నారు. మరో అతిథి, మాజీ బుడా అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా ఫీజులు చెల్లించి వారి చదువునకు తోడ్పడేవాడన్నారు. తాను పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించిన విషయాన్ని ఎవరికీ చెప్పేవాడు కాదన్నారు. ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మోహన్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం మోహన్‌రెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మోహన్‌రెడ్డి తల్లి హనుమక్క, రెడ్డి జనసంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, చైతన్య కళాశాల అధినేత రాధాకృష్ణ, విశ్రాంత డీడీపీయూ నాగరాజప్ప, మాజీ వీవీ సంఘం ప్రముఖుడు చోరనూరు కొట్రప్ప, కసాప అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, వార్డ్‌లా కళాశాల ప్రిన్సిపాల్ విక్టర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలకుల వల్లే దేశంలోకి చొరబాట్లు

- కేంద్రమంత్రి శోభా కరంద్లాజె



హుబ్లీలో ఓ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె

హుబ్లీ: గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలకుల తప్పుల వల్ల భారీ సంఖ్యలో ఇతర దేశాల ఉగ్రవాదులు, ప్రజలు ఈశాన్య భారతంలోకి చొరబడ్డారని, ప్రస్తుతం ఆ చొరబాటుదారులను వెలివేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేస్తోందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె తెలిపారు. నగరంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈశాన్య భారతంలోని అన్ని రాష్ట్రాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈశాన్య భారతంలో ప్రస్తుతం ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను వారు అనుభవిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ఈశాన్య భారత రాష్ట్రాల్లో శాంతి నెలకొల్పేందుకు అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో చర్చించకుండా బయట రచ్చ చేసేందుకు, కేంద్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కాంగ్రెస్ తదితర పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. అయితే వారికి ఎటువంటి సమాధానం ఇచ్చేందుకైనా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తాజాగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాలో మహిళలను నగ్నంగా చేసి హింసించిన ఘటనపై వీడియో వెలుగులోకి వచ్చిందన్నారు. రాజకీయాలు అందరూ చేస్తారు. కానీ హత్యా రాజకీయాలు పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే జరుగుతున్నాయని ఆమె అన్నారు.

మణిపూర్‌లో హింసాకాండపై నిరసన



బళ్లారిలో ఏఐఎంఎస్ఎస్ నేతలు, విద్యార్థుల నిరసన

బళ్లారిటౌన్: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడి, హత్యాచారాన్ని ఖండిస్తూ ఏఐఎంఎస్ఎస్, ఏఐడీవైఓ ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిరసన చేపట్టారు. సీనియర్ ఉపన్యాసకుడు నరసన్న మాట్లాడుతూ ఇలాంటి ఘటన మన దేశానికే సిగ్గుచేటన్నారు. ఏఐఎంఎస్ఎస్ జిల్లాధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అక్కడ మహిళలకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని ఆగ్రహించారు. నేతలు శాంత, జగదీశ్, విజయలక్ష్మి, విద్యా, గిరిజా, రాధ, కరిబసమ్మ, శిఫా తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

హొసపేట: మణిపూర్‌లో మహిళలను అవమాన పరచి అత్యాచారాలకు పాల్పడిన ఘటనలపై శనివారం నగరంలో ఏఐడీవైఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ నిందితులను వెంటనే బంధించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

కంప్లి: మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసాచారం హేయమని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత జనవాది మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మారుతీ నగర్‌లో ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. మహిళలకు భద్రత కల్పనలో విఫలమైన ప్రధానమంత్రి నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం విజయనగర జిల్లా అధ్యక్షురాలు కే.నాగరత్నమ్మ, బళ్లారి జిల్లా అధ్యక్షురాలు బీ.ఉమాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సత్యబాబు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉమాదేవి, ఖాజాబుని, మంజుళ, రాణి ఈరమ్మ, మహంతమ్మ, ఓంకారి, సాయిరత్న, రేఖ, కేఎం స్వప్న, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

బళ్లారిఅర్బన్: హిందూ ముస్లింలు ఐకమత్యంగా జరుపుకొనే మొహర్రం వేడుకలు శనివారం రాత్రి ప్రారంభం అయ్యాయి. ఈ నెల 29న పండుగ సందర్భంగా పీర్లచావిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పీర్ల దేవుళ్ల పెట్టెని ఊరేగించి పీర్లచావిళ్ల ముందు అగ్నిగుండాన్ని తవ్వారు. నగరంలోని మిల్లర్‌పేట్, పింజార్ వీధి, బెంగళూరు రోడ్డు, హవంబావి, తాళూరు రోడ్డు మహానంది కొట్టం, కప్పగల్ రోడ్డు, కౌల్‌బజార్ ప్రాంతాల్లో పీర్లచావిళ్ల వద్ద పీర్లదేవుళ్లను ఏర్పాటు చేశారు.

సిద్ధలింగస్వామి జన్మదిన వేడుక



తుమకూరు: సిద్ధగంగా మఠాధ్యక్షుడు సిద్ధలింగ స్వామీజీ 61వ పుట్టిన రోజు వేడుకలు మఠంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శివసిద్ధేశ్వర స్వామి, ఇతర స్వాములు సిద్ధలింగ స్వామికి పాదపూజ, పుష్పార్చన గావించారు. పలువురు ప్రముఖులు స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కోలారు వార్తలు...

ఇంద్ర ధనుష్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న దశ్యం

కోలారు: కేంద్ర ప్రభుత్వ పథకం ఇంద్ర ధనుష్ అభియాన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హర్షవర్ధన్ తెలిపారు. శనివారం తాలూకా కార్యాలయంలో మిషన్ ఇంద్రధనుష్ 5.0 అభియాన్‌లో భాగంగా వివిధ రోగాలపై అవగాహన కలిగించే పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. రోగాలకు టీకా అభియాన్‌లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని, రెండేళ్ల లోపు వయస్సుగల పిల్లలు, గర్భిణులకు ఉచితంగా అందించే టీకాలను పొందాలని కోరారు. పథకంపై అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సీనియర్ ఆరోగ్య అధికారులు ఆర్.సత్యనారాయణగౌడ, ఐఎంఏ సభ్యుడు డాక్టర్ నారాయణస్వామి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ, జిల్లా ఆయుష్ అధికారి, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టమాటా పంట పరిశీలన



రైతుల పంటను పరిశీలిస్తున్న విజ్ఞానుల బృందం

శ్రీనివాసపురం: తాలూకాలో టమాటా రైతుల పంట పొలాలను శనివారం విజ్ఞానుల బృందం పరిశీలించి రైతులకు సలహా, సూచనలు అందించారు. ప్రస్తుతం టమాటాకు మంచి ధర ఉన్నా సరైన దిగుబడి లేక రైతులు నష్టాలను చవిచూస్తున్నారన్నారు. తాలూకాలో సుమారు 700 హెక్టార్లలో రైతులు పండించిన టమాటా పంట దాదాపుగా నుసిరోగానికి గురైన విషయాన్ని విజ్ఞానుల బృందం గ్రహించారు. రోగ నిర్మూలనకు రైతులు సరైన మందులను పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సంక్షేమ శాఖ న్యూఢిల్లీ సభ్య కార్యదర్శి డాక్టర్ డీజే బ్రహ్మ, సభ్యుడు డాక్టర్ కౌల్, బెంగళూరు కూరగాయల విభాగం జేడీ డాక్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మందుల పిచికారీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మహేష్

శ్రీనివాసపురం: గ్రామీణ రైతులు పంటలపై మందుల పిచికారీపై తగిన అవగాహన పెంచుకోవాలని ప్రైవేటు మందుల ఫ్యాక్టరీ మార్కెటింగ్ మేనేజర్ మహేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో రైతులకు ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. రైతులు కంపెనీ విజ్ఞానుల సలహాలు తీసుకుని మందులను పిచికారీ చేయాలన్నారు. కంపెనీ మార్కెట్ అభివృద్ధి అధికారి కాంతకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు టమాటా, క్యాప్సికం పంటల్లో కీటనాశకానిల వాడకం గురించి తెలిపారు. కంపెనీ అధికారులు అనిల్‌కుమార్, వి.కిరణ్ ఉన్నారు.

ఎంపీసీఎస్ అధ్యక్షుడిగా వీరభద్రయ్య



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

కోలారు: నాగలాపుర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం(ఎంపీసీఎస్) పాలక మండలికి శనివారం జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా వీరభద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి వీరభద్రయ్య ఒక్కరే నామినేషన్ వేయడంతో అతని ఎన్నిక ఏకగ్రీవమైంది. డైరెక్టర్లుగా కావ్య, ఇస్తూర్ చంద్రప్ప, చెన్నబసవ ఒడయార్, సిద్ధలింగయ్య, ముద్దురాజ్, మునిలక్ష్మమ్మ, చంద్రప్ప, కె.కళావతమ్మ, చిన్నప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు, పదాధికారులను పలువురు అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

కేజీఎఫ్: నగరంలోని బ్యాంకుల వద్ద పొంచి ఉండి డబ్బులు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శనివారం అండర్‌సన్ పేట పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా జక్రయ్య(43), రమేష్(50), నెల్లూరు జిల్లాకు చెందిన ఆకుల కుమార్(32) అరెస్టయిన నిందితులు. వీరు బ్యాంకుల వద్ద దొంగతనాలు చేయాలని పట్టణానికి వచ్చారని విచారణలో తేలింది. బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకుని తమ స్కూటర్‌లో పెట్టుకెళుతున్న సమయంలో వీరు స్కూటర్ డిక్కీ నుంచి డబ్బులు దొంగిలించుకెళ్లేవారు. నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు వీరిని అరెస్టు చేశారు. పోలీసుల కార్యాచరణను ఎస్పీ శాంతరాజ్ అభినందించారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



కలెక్టర్‌కు పరిస్థితులను వివరిస్తున్న తహసీల్దార్ శిరీన్‌తాజ్

శ్రీనివాసపురం: అధికారుల పని తీరుపై కలెక్టర్ అక్రం పాషా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి అవ్యవస్థను చూసి మండిపడ్డారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో ఉలిక్కిపడిన అధికారులు ఇక్కడ అంతా సరిగా ఉందని చూపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కాగా కార్యాలయంలో తమకు కలుగుతున్న ఇబ్బందుల గురించి ప్రజలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఎగుమతుల్లో నంబర్‌వన్ చేస్తాం

శివాజీనగర: రాష్ట్రంలో కొత్తగా పారిశ్రామిక విధానాన్ని రూపొందించేటపుడు పారిశ్రామికవేత్తలతో చర్చించి ఎగుమతులకు ఉత్తేజం కల్పించే అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం విధానసౌధలో జరిగిన రాష్ట్ర శ్రేష్ఠ ఎగుమతి అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం మాట్లాడారు. ఎగుమతుల్లో కర్ణాటక 3వ స్థానంలో ఉంది, మహారాష్ట్ర, తమిళనాడు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. మునుముందు రోజుల్లో కర్ణాటకను ఎగుమతిలో నంబర్ 1 స్థానానికి చేర్చే దిశలో కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రి ఎం.బీ.పాటిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్సిటీలో జాతీయ సమ్మేళనం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు నగరంలోని తుమకూరు విశ్వ విద్యాలయం స్నాతకోత్సవం, పత్రికోద్యమం, సామూహిక సంవహన విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ యుగంలో మాధ్యమ సాక్షరత గురించి జాతీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని ఢిల్లీకి చెందిన నవ మాధ్యమ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ అనుభూతి యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో చాన్సలర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు సతీశ్‌కుమార్, స్వప్న, ఓంకార్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లా టి నరసిపుర తాలూకా ముత్తత్తి గ్రామంలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. ఇక్కడి ముత్తత్తి గ్రామంతో పాటు చుట్టపక్కల గ్రామాల్లో జీవాలను బలి తీసుకుంటున్న చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు అటవీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో అటవీ సిబ్బంది ఇనాయత్ ఉల్లా అనే రైతుకు చెందిన పొలంలో బోను ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. ముత్తత్తిలో ఇప్పటి వరకు ఏడు చిరుతలు పట్టుబడ్డాయని అధికారులు తెలిపారు.

పేద విద్యార్థులకు దాతలు అండగా నిలవాలి



బొమ్మనహళ్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు దాతలు అండగా నిలవాలని కేపీసీసీ ప్రచార సమితి సంయోజకుడు కే.వాసుదేవ అన్నారు. శనివారం నగరంలోని బొమ్మనహళ్లి పరిధి మంగమ్మపాళ్య వార్డు బండెపాళ్య ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 350 మంది విద్యార్థులకు వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు, సమాజ సేవకుడు జయరామరెడ్డి ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, బ్యాగులు, జామెట్రీ బాక్స్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా జయరామరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, నిర్మాత ఉమాపతి శ్రీనివాస్‌గౌడ, హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.వాసుదేవరెడ్డి, కేపీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ శోభా జగదీష్‌గౌడ, ఎం.ఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపురలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో శనివారం అధికారులతో కలిసి మహాదేవపుర బీబీఎంపీ జాయింట్ కమిషనర్ దాక్షాయని పరిశీలించారు. సమస్య ఎక్కడ ఉందో అక్కడ బోర్లు వేయాలని అధికారులకు సూచించారు. మహాదేవపురలో హగదూరు వార్డు, హోడి వార్డులోని గ్రామాల్లోని అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హగదూరు వార్డు పరిధిలోని రామగొండనహళ్లి గాంధీపురలో రెండు బోర్లు వేయించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఇద్దరు స్నాచర్లు అరెస్ట్



చోరీ సొత్తు, నిందితులతో పోలీసులు

శివమొగ్గ: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని హొళె హొన్నూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను భద్రావతి పట్టణంలోని హొసమనె లేఔట్‌కు చెందిన సతీష్ (32), హాలప్ప సర్కిల్ సమీపంలో నివాసం ఉంటున్న జీవన్ (23)లుగా గుర్తించారు. వీరిద్దరు ఈనెల 5న అరదోటు గ్రామ సమీపంలోని బస్టాండ్ వద్ద పశువులు మేపుతున్న మహిళ మెడలో మాంగల్యం చైన్ లాక్కొని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా ఉంచి ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితులు తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి పరిధిలో బైక్‌లను అపహరించినట్లు కూడా అంగీకరించారు.

బనశంకరీ సన్నిధిలో నవచండికా హోమం



అమ్మవారికి విశేష అలంకరణ,



నృత్య శిక్షకులు దీపామంజునాథ్ జయంతి, కళాకారుల సన్మాన కార్యక్రమంలో బసవరాజ్ తదితరులు

బనశంకరి: బనశంకరీదేవి ఆలయ కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం మండల పూజ సమాప్తి కార్యక్రమం సందర్భంగా నవచండికా హోమం నిర్వహించారు. అధిక శ్రావణమాస శుద్ధ పంచమి శనివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ఉదయం 7 గంటలకు ఆలయ అర్చకుల బృందం ఆవరణలో నవచండికా హోమం నిర్వహించి 10 గంటలకు పూర్ణాహుతి చేపట్టి, 12.30 మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు. శుక్రవారం రాత్రి భరతనాట్య, కూచిపూడి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్య శిక్షకులు దీపామంజునాథ్, జయంతిని ఆలయ అధ్యక్షుడు బసవరాజ్ సన్మానించారు. దేవస్థాన అర్చకులు చంద్రమోహన్, సమితి సభ్యులు వెంకటేశ్, చంద్రు, ఏతఈ రేఖ తదితరులు పాల్గొన్నారు.

టమాటా దొంగలు అరెస్ట్



దంపతులు, స్వాధీనం చేసుకున్న కారు

యశవంతపుర: టమాటాలతో ఉన్న బొలెరో వాహనంతో పరారైన దంపతులను బెంగళూరు ఆర్ఎంసీ యార్డ్ పోలీసులు అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు...చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె నివాసి రైతు మల్లేశ్ ఈ నెల 8న 210 బాక్సుల టమాటాలను లోడ్ చేసుకుని బొలెరో వాహనంలో చెళ్లకెరె నుంచి కోలారు మార్కెట్‌కు బయలుదేరారు. రాత్రి 10:45 గంటల సమయంలో డ్రైవర్ శివణ్ణతో కలిసి మార్గంమధ్యలోని తుమకూరు రోడ్డు సీఎంటీఐ నుంచి హెబ్బాళ వైపు వెళ్తూ టీ తాగటానికి మల్లేశ్, శివణ్ణలు ఓ హోటల్ వద్ద వాహనం నిలిపారు. ఈ సమయంలో బొలెరో అపహరణకు గురైంది. ఇందుకు సంబంధించి ఆర్ఎంసీ యార్డ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు తమిళనాడుకు చెందిన దంపతులు భాస్కర్ (38), సింధు (36)లను అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇద్దరు సహకారంతో తమిళనాడుకు చెందిన దంపతులు చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. టమాటాలను అమ్మగా వచ్చిన రూ.1.5 లక్షలు నగదును ఐదుగురు సమానంగా పంచుకున్నారు. దంపతులను అరెస్ట్ చేయటంతో మిగిలిన ముగ్గురు పరారీ అయ్యారు. నిందితులు కారులో వెంబడించి బులెరో వాహనాన్ని ఢీకొట్టడానికి యత్నించి అది సాధ్యం కానీ పక్షంలో బొలెరోను అపహరించుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాసేవ రంగాలపై దృష్టి పెట్టాలి



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: పోటీ ప్రపంచంలో నేటి విద్యార్థులు కార్పొరేట్ రంగాలపై దృష్టి పెడుతున్నారని, ప్రజాసేవకు అవకాశం ఉన్న రంగాల వైపు విద్యార్థులు ముందుకు సాగాలని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌టీ నరేంద్ర ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ లా కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించి అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు దేశం కోసం, సమాజం కోసం ఉపయోగపడే రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధ్యక్షుడు సౌందర్య మంజప్ప తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఆశీర్వాదకరంగా ఉండాలి



రాబిన్ పాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

శివాజీనగర: సమాజంలో దేవుని సేవకు అంకితమైన పాస్టర్లు సమాజానికి ఆశీర్వాదకరంగా ఉండాలని, అలాంటి భారం కలిగిన ప్రార్థనతో సేవకులు తమ సేవలను కొనసాగించాలని పరిశోధకుడు, కింగ్‌డమ్ మినిస్ట్రీ సీఈఓ రెవరెండ్ రాబిన్ పాల్ అన్నారు. శనివారం రామచంద్రాపురం తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో ఆల్ ఇండియా క్రిస్టియన్స్, లీడర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో పాల్గొని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలోని గూడార్థాలను విశదీకరించారు. పశ్చాత్తాపం చెందటంతో పాటుగా మారు మనస్సు, రక్షింపబడేందుకు ప్రార్థించాలని తెలిపారు. చిన్న పిల్లల లాంటి మనస్తత్వం కలిగి ఉంటేనే పరలోక రాజ్యం చేరుకునేందుకు అవకాశముంటుందని బైబిల్ తెలియజేస్తున్నదన్నారు. సేవకులు దైవ సన్నిధి కోసం ప్రార్థించినపుడే ఆ శక్తి భక్తులకు ఆశీర్వాదకరంగా ఉంటుందని చెప్పారు. దేవుడు ఏసుక్రీస్తు ప్రభువులవారికి ఏదైతే అందిచ్చాడో దానినే సేవకులు ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. సేవకులు భారం కలిగి దేశం కోసం, పాలకుల కోసం, ప్రజల కోసం, వ్యాపార తదితర రంగాల కోసం కూడా ప్రార్థించి కార్యరూపం దాల్చేందుకు కృషి చేయాలని సూచించారు. సమాజంలో క్రైస్తవులు వెలుగుగా ఉండాలని, అంతేకాకుండా రుచినిచ్చే ఉప్పుగా ఉండాలని ఆల్ ఇండియా క్రిస్టియన్స్, లీడర్స్ ఫెలోషిప్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.అరుణ్‌కుమార్ తెలిపారు. రెవరెండ్ రాబిన్ పాల్‌ను మైసూరు పేట ధరించి సన్మానించారు. పీ.డీ.ఇమ్మానియేల్, ఎం.బీ.మోజస్, బిషప్ ఏ.సుశైనాథన్, ఎం.సుందర్‌రాజ్, వై.సామ్యూయేల్, తిమోథి, బాబు భాస్కర్, ప్రభాకర్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

• గాలులకు కూలిన చెట్టు, స్తంభాలు



మైసూరు: ఆకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలులకు ఓ భారీ వృక్షం కూలిపోయి కరెంటు స్తంభంపై పడింది. దీనివల్ల మొత్తం ఐదు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. ఈ ఘటన హుణసూరు తాలూకాలోని తెమకన కొప్పలులో జరిగింది. శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున ఈదురు గాలులు వీయడంతో ఒక చెట్టు కూలిపోయి పక్కనే ఉన్న కరెంటు స్తంభంపై పడింది. ఆ భారానికి స్తంభం కూడా ఒరిగిపోయింది. దీంతో తీగలు లాగడంతో మిగతా స్తంభాలు కూడా నేలవాలాయి. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సిబ్బంది వచ్చి మరమ్మతులు నిర్వహించారు.

భారత సేవాదళ్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి

గౌరిబిదనూరు: భారత సేవాదళ్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, జాతీయ భావాలను కలుగ జేయడంతో పాటు దేశం పట్ల ప్రేమను పెంపొందిస్తుందని తాలూకు విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం రామకృష్ణ శారదాదేవి విద్యామందిరంలో భారత సేవాదళ్ శాఖను ప్రారంభించి మాట్లాడారు. మహాత్మాగాంధీ ఆదేశాల మేరకు విద్యార్థులను దేశభక్తి వైపు ఆకర్షించడానికి భారత సేవాదళ్‌ను స్థాపించారన్నారు. తాలూకా సంయోజకులైన బాలప్ప మాట్లాడుతూ...సేవాదళంలో విద్యార్థులు జాతి, మత, ధర్మాల కతీతంగా క్రమశిక్షణను అలవరచుకొగలుగుతారన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ అధ్యక్షుడు వీడీ గణేశ్, జిల్లా సభ్యుడు సుదర్శన రెడ్డి, ప్రిన్సిపాల్ శివప్రకాశ్‌రెడ్డి, జయణ్ణ, కృష్ణకుమారి, కెఎం రమేశ్, శివకుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మైషుగర్‌ను పరిశీలించిన మంత్రి

మండ్య: షుగర్ పరిశ్రమను కొందరు పనికట్టుకుని నిలిపివేయాలని చూస్తున్నారని, అటువంటి పరిస్థితి రాదని మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. శనివారం ఆయన మైషుగర్ ఫ్యాక్టరీని పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. పరిశ్రమ ప్రారంభమై కేవలం రెండు వారాలు మాత్రమే అయిందని, దాదాపు 30 వేల టన్నుల చెరకు కట్ చేశారని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ సామర్థ్యంతో పనిచేయడానికి అవకాశం ఉందన్నారు.

సీఎంపై బీకే హరిప్రసాద్ అసంతృప్తి

శివాజీనగర: మంత్రి పదవి చేజారిపోయి తీవ్ర మనస్థాపంతో ఉన్న కాంగ్రెస్ మండలి సభ్యుడు బీ.కే హరిప్రసాద్, సీఎం సిద్ధరామయ్యపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడిన హరిప్రసాద్, సీఎంకు ఎక్కించటం తెలుసు, తీసేది తెలుసని అన్నారు.

ఆయన అలా ఎందుకు అన్నారో తెలియదు

మండ్య: కాంగ్రెస్ పార్టీ మండలి సభ్యుడు బీకే హరిప్రసాద్ వ్యాఖ్యలపై తాను ఏమి మాట్లాడనని మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. దీనిపై మంత్రి చెలువరాయ మాట్లాడుతూ...బీకే హరిప్రసాద్ ఏ ఉద్దేశ్యంతో మాట్లాడారో తనకు తెలియదని, పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదన్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, ముగ్గురి అరెస్ట్

బనశంకరి: మహాఘట బంధన్ సమావేశానికి సంబంధించి ముందస్తు అనుమతి లేకుండా ఫ్లెక్సీలను అమర్చిన ముగ్గురిని శనివారం హైగ్రౌండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శేషాద్రిపురం నివాసులు శ్రీరామ్, మోహన్, నందకుమార్ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు అమర్చారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు అమర్చడంపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి టెంపో స్వాధీనం చేసుకున్నారని కేంద్ర విభాగ డీసీపీ శ్రీనివాస్‌గౌడ తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక అలంకరణ



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామదేవత మారెమ్మ దేవికి శనివారం మహాలక్ష్మీ అమ్మవారి అలంకరణ చేశారు. శనివారం తెల్లవారు జాము నుంచే అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రామనగరలో జీవాల చోరీ

మాంసం, చర్మం కోసం తెగిస్తున్న దుండగులు

దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లా పరిధిలో ఇటీవల జీవాల చోరీలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. తెల్లవారితే కొట్టంలో జీవాలు ఉంటాయో ఉండవో అనే పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడింది. రాత్రికి రాత్రి టెంపోలు తీసుకువచ్చి దొంగలు దర్జాగా జీవాలను ఎత్తుకుపోతున్నారు. తాజాగా మాగడి తాలూకా బగీనగెరె గ్రామంలో కొట్టంలో కట్టేసిన నాలుగు ఆవులను దుండగులు అపహరించారు. గ్రామానికి చెందిన రైతు రామయ్య కుటుంబం నాలుగు ఆవులపై ఆధారపడి జీవిస్తోంది. శనివారం తెల్లవారి పాలు పితకడానికని రైతు రామయ్య పశువుల కొట్టంలోకి రాగా ఆవులు కనిపించలేదు. కాసేపటికి గ్రామం శివారులో మాంసం, చర్మం వేరుచేయబడి మిగతా కళేబరాలు కనిపించాయి. రామయ్య ఫిర్యాదు మేరకు కుదూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నలుగురు దొంగలు అరెస్ట్

తుమకూరు: వృద్ధురాలిని బంధించి ఆమె నగలు లూటీ చేసిన నలుగురిని కుణిగల్ తాలూకా హులియూరు దుర్గ పోలీసులు అరెస్ట్ చేశారు. శరత్, శివరాజు, వసంత్‌కుమార్, అలిశాబాబు నిందితులు. వీరు వారం క్రితం జిల్లాలోని కుణిగల్ తాలూకా సంతెమావతూరు గ్రామంలో ఒంటరిగా ఉంటున్న చిక్కమ్మ అనే వృద్ధురాలి ఇంటిలోకి ప్రవేశించి ఆమెను బంధించి ఆమె వద్ద ఉన్న 50 గ్రాముల బంగారు నగలు, రూ. 50 వేల నగదు తీసుకుని ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.

వన్ సెంటర్‌లో డిప్యూటీ సీఎం

దొడ్డబళ్లాపురం: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కనకపురలోని కర్ణాటక వన్ సెంటర్‌ను సందర్శించారు. శుక్రవారం సాయంత్రం కనకపురకు వచ్చిన ఆయన కర్ణాటక వన్ సెంటర్‌కు వెళ్లి గృహలక్ష్మి పథకానికి సంబంధించి పేర్ల నమోదును పరిశీలించారు. సిబ్బంది, మహిళలతో చాలాసేపు చర్చించారు. కార్యాలయం సిబ్బంది లంచం అడిగితే తనకు తెలియజేయాలని సూచించారు. అర్హులను గుర్తించి పేర్లు నమోదు చేసుకోవాలని, చెడ్డపేరు రాకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

హత్య కేసులో అరెస్ట్



శరత్ (ఫైల్)

యశవంతపుర: తల్లిదండ్రులను హత్య చేసి పరారీలో ఉన్న కొడుకును బెంగళూరు కొడిగేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు శరత్ (26) బ్యాటరాయనపురలోని తమ నివాసంలో రాడ్‌తో తల్లిదండ్రులను హత్య చేసి పరారయ్యాడు. తనను నిర్లక్ష్యంగా చూస్తున్నారే ఆక్రోశంతో భాస్కర్, శాంతమ్మలను గత మంగళవారం హత్య చేసిన శరత్ కొడగులో తలదాచుకున్నాడు. మూడు రోజుల నుంచి కారులోనే తిరుగుతున్నాడు. రాత్రి సమయంలోను కారులోనే నిద్రించేవాడు. విషయం తెలుసుకున్న కొడిగేహళ్లి పోలీసులు శరత్‌ను కొడగులో అదుపులోకి తీసుకొని బెంగళూరుకు తరలించి విచారణ చేస్తున్నారు. తనను నిర్లక్ష్యంగా చూస్తున్నందుకు హత్య చేసినట్లు శరత్ పోలీసుల వద్ద ఒప్పుకున్నట్లు సమాచారం.

మళ్లీ కుంగిన భూమి

బనశంకరి: భారీ వర్షాలతో శిరాఢీఘాట్ రోడ్డులో మళ్లీ భూమి కుంగిపోవడంతో వాహనదారులు భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాసన జిల్లా సకలేశపుర తాలూకా అనేమహల్ వద్ద గల జాతీయ రహదారి 75 శిరాఢీఘాట్‌రోడ్డులో భూమి కుంగిపోయింది. అశాస్త్రీయంగా రోడ్డు పనులు చేపట్టారని వాహనదారులు, స్థానికులు, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

హోసూరు వార్తలు..

వైకుంఠవాసికి శ్రావణ పూజలు



క్రిష్ణగిరి: శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. క్రిష్ణగిరి జిల్లాలోని సూళగిరి, హోసూరు, డెంకణీకోట, అంచెట్టి తాలూకాల్లో పెద్ద ఎత్తున భక్తులు శ్రావణ మాసాన్ని ఆచరిస్తారు. ఉదయమే భక్తులు భక్తి శ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. సూళగిరి తాలూకా గోపసంద్రం వద్ద వెలసిన దక్షిణ తిరుపతిగా ప్రసిద్ధి పొందిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠవాసునికి విశేష పూజలు చేశారు.

లింక్ పంపించి టోకరా

చిక్కబళ్లాపురం: ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా అమాయకులు జాగృతి కావడం లేదు. తాజాగా చిక్కబళ్లాపురం తాలూకా ముష్టూరు గ్రామంలో ఉంటున్న ప్రైవేటు స్కూలు ఉపాధ్యాయురాలు రాగిణికి తన ఇన్‌స్టాలో బ్లాక్‌చైన్ అనే కంపెనీ నుంచి లింక్ వచ్చింది. అందులో మీరు నగదు డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతుందని చెప్పడంతో అమాయకురాలు రాగిణి రూ. 3 లక్షలకు పైగా ఆ ఖాతాలో వేసింది. ఆ తరువాత వారి ఖాతాలో రూ. 10 లక్షలు వచ్చినట్లు సందేశం వచ్చింది. వారు డబ్బులు డ్రా చేయడానికి యత్నించారు. అయితే డ్రా కాలేదు. కంపెనీ నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్లు భావించిన బాధితురాలు చిక్కబళ్లాపురం సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అప్పుల బాధతో ఆత్మహత్య

కెలమంగలం: తీసుకొన్న అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకొన్న ఘటన రాయకోట వద్ద జరిగింది. వివరాల మేరకు రాయకోట సమీపంలోని నెల్లూరు గ్రామానికి చెందిన శివానందం (42) చుట్టుపక్కల కొంతమంది వద్ద అప్పులు తీసుకొన్నాడు. అప్పు ఇచ్చినవారు తీర్చాలని ఒత్తిడి చేయడంతో విరక్తి చెందిన శివానందం శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతన్ని చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాన్ ఢీకొని బైకిస్టు మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన బారూర్ వద్ద చోటుచేసుకొంది. క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని గొల్లపట్టి గ్రామానికి చెందిన కూలి కార్మికుడు శక్తి (41) శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో పుళియూరు వైపు వెళుతున్నాడు. అయితే వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో శక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

పీఎంకే కార్యకర్తల సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హోసూరు: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పీఎంకే పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని గెలిపించుకోవాలని, 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో అన్బుమణి రామదాస్‌ను ముఖ్యమంత్రిని చేయాలని శనివారం హోసూరు పట్టణంలోని తాయప్పగౌండర్ కళ్యాణ మంటపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోవిందరాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పళ తామరకణ్ణన్, మాజీ ఎమ్మెల్యే రాజ తదితరులు మాట్లాడారు. తళి నియోజవర్గంలోని కావేరి పరివాహక అటవీ ప్రాంతంలో మేకలు, గొర్రెలు, పశువులు మేపేందుకు అనుమతివ్వాలని, బెట్టముగిళాలం పంచాయతీలో బోరుబావి ఏర్పాటు చేసి తాగునీరందజేయాలని, అంచెట్టి ప్రాంతాల్లో వంతెనలు ఏర్పాటు చేయాలని, అంచెట్టి సమీపంలో ప్రవహిస్తున్న అక్కాచెల్లెలు నదిపై చెక్‌డ్యాం నిర్మించాలని, కెలమంగలం యూనియన్‌లో నిర్వహిస్తున్న కంకర క్వారీలు, మద్యం షాపులను మూసివేయాలని, టాటా ఎలక్ట్రానిక్ పరిశ్రమలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో శరవణన్, మునిరాజ్, అరుణ్‌రాజ్, మలర్‌వణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్‌ను బాగుచేయాలి



డబుల్ రోడ్ ప్రాంతంలో అపరిశుభ్రత

హోసూరు: విద్యుత్ శాఖ నరికివేసిన చెట్లను కార్పొరేషన్ అధికారులు తొలగించడం లేదని, ప్రజాసేవకు సహకరించకపోతే కార్పొరేషన్‌లో జరిగే అక్రమాలను బయటపెట్టవలసి వస్తుందని అన్నా డీఎంకే కార్పొరేటర్ కుబేరన్ అన్నారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 41వ వార్డులో డబుల్ రోడ్డు ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ లైన్ ఉండగా, కొన్నిరోజుల కిందట రోడ్డు మధ్యన ఉన్న చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది నరికివేశారు. ఆ చెట్లను తొలగించక అక్కడికక్కడే పడేయడంతో ఆ ప్రాంతంలో పరిశుభ్రత లోపించి విషపురుగులు తిరుగుతున్నాయని చెప్పారు. ఎన్నిసార్లు కోరినా అధికారులు వాటిని తరలించలేదని అన్నారు. ఈ సమావేశంలో అన్నాడీఎంకే కార్పొరేటర్లు అశోక్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై మేయర్ ఆరా



అందివాడి ప్రాంతంలో సమస్యలను తెలుసుకొంటున్న మేయర్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 36వ వార్డులో మేయర్ ఎస్ఏ సత్య శనివారం పర్యటించారు. ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వార్డు పరిధిలోని అందివాడి, కాలనీ, తిరునగర్ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన మేయర్ నేరుగా వెళ్లి వారితో మాట్లాడారు. మురికి కాల్వలు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వెంటనే సంబంధిత శాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నవీరప్ప, భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు నాగేష్, సురేష్, నాగరాజ్, మునికావేరి, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు సామాజిక సేవ చేయాలి

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో నిర్వహిస్తున్న పెద్ద తరహా పరిశ్రమలు సామాజిక సేవలకు సీఎస్ఆర్ ఫండ్‌ను అందజేయాలని క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో పరిశ్రమాధిపతుల సమావేశంలో కలెక్టర్ శరయు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రిష్ణగిరి జిల్లాలో వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి పరిశ్రమల సహాయం ఎంతో అవసరమని, పరిశ్రమలు అందజేసే సీఎస్ఆర్ నిధితో విద్య, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత కల్పిస్తుమని తెలిపారు. అంచెట్టి, డెంకణీకోట తాలూకాల్లోని గిరిజన గ్రామాల్లో పాఠశాలలో కొత్త భవనాల నిర్మాణాలకు, ఇళ్ల నిర్మాణాలు, అంగన్‌వాడి కేంద్రాల ఏర్పాటు తదితర సామాజిక సేవాకార్యక్రమాల్లో పరిశ్రమల యజమానులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వందనాకార్గ్, కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా...

న్యాయవాదులకు సమాజంలో ప్రత్యేక గౌరవం

- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి



నెల్లూరు (లీగల్): న్యాయవాదులు సమాజంలో గౌరవప్రదమైన ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నారని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. స్థానిక టౌన్‌హాలులో బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నెల్లూరు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన శనివారం న్యాయవాదులకు సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ మరో పదేళ్లలో న్యాయవాదులకు స్వర్ణయుగం రానుందని చెప్పారు. న్యాయవాదులు వృత్తిలో మరింత రాణించేందుకు ఉపయోగపడేలా సెమినార్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ అ ధ్యక్షుడు గంటా రామారావు, సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడారు. కాగా జస్టిస్ ఏవీ శేషసాయి దంపతులు సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని దర్శించుకున్నారు.

హైకోర్టులో లోక్ అదాలత్

సాక్షి అమరావతి: పెండింగ్ కేసుల పరిష్కారానికి రాష్ట్ర హైకోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న 86 కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు పరిహారం కింద రూ.71.02 లక్షలు చెల్లించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఏర్పాటైన బెంచ్‌కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు నేతృత్వం వహించారు. న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత ఈ లోక్ ఆదాలత్‌ను పర్యవేక్షించారు.

బాబు, పవన్, రామోజీలది రాక్షస మనస్తత్వం

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజం



సాక్షి, తిరుపతి: చంద్రబాబు, పవన్, రామోజీ, రాధాకృష్ణ, టీవీ 5 చౌదరి టెర్రరిస్టు మనస్త త్వం కలిగిన వారని ఉప ముఖ్యమంత్రి నారా యణస్వామి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తిరుపతిలో శనివారం మీడియాతో మాట్లాడారు. వెంకటగిరి సభలో సీఎం వైఎస్ జగన్ వారిపై చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. వారితో పాటు లోకేశ్, బాలకృష్ణలు కూడా రాక్షస మనస్తత్వం కలిగిన వారని చెప్పారు. మహిళలను, వలంటీర్లను ఎలా గౌరవించాలో వీరికి తెలియదన్నారు. పొ రపాటున చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లాంటి వారు సీఎం అయితే మహిళలను, రాష్ట్ర ప్రజల ను ఏం చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ

తెలంగాణ హైకోర్టు కొత్త సీజే ప్రమాణం నేడు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జస్టిస్ అలోక్ అరాధేతో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రమాణం చేయించనున్నారు.

ఆన్‌లైన్ సెర్చ్‌లతో జాగ్రత్త..!

- నకిలీ యుఆర్‌ఎల్ పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఏ సమాచారం కావాలన్న మనం ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయడం పరిపాటి. అయితే అన్ని సెర్చ్ ఇంజిన్‌లు సురక్షితం కాదంటున్నారు పోలీసులు. మనం సాధారణంగా గూగుల్, బింగ్, యాహూ వంటి సెర్చ్ ఇంజన్లను వాడుతూ కావాల్సిన సమాచారం పొందేందుకు ప్రయత్నిస్తుంటాం. అయితే మనం ఏదైనా సమాచారం సెర్చ్ చేయగానే..సెర్చ్ ఇంజన్ మనకు సంబంధిత అంశానికి చెందిన యూఆర్‌ఎల్ (యూనిఫాం రిసోర్స్ లొకేటర్)లు ఇస్తుంటాయి. అలా వచ్చే యూఆర్‌ఎల్ సరైందా కాదా అని సరిచూసుకున్న తర్వాతే ఆ యూఆర్‌ఎల్‌పై క్లిక్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని అనుమానాస్పద యూఆర్‌ఎల్‌లపై క్లిక్ చేస్తే మాల్‌వేర్ రావడంతోపాటు వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు వెళ్లే ప్రమాదం ఉన్నట్టు వారు హెచ్చరిస్తున్నారు. ఫేక్ యూఆర్‌ఎల్‌లలో ప్రధానంగా అక్షర దోషాలు ఉండటం లేదా కొద్దిపాటి అక్షరాల తేడాతో ఉంటాయని, వీటిని నిశితంగా గమనిస్తేనే తెలుస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు. ఒకవేళ నకిలీ యూఆర్‌ఎల్ లేదా నకిలీ కాంటాక్ట్ నంబర్లు ఆన్‌లైన్‌లో గుర్తిస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో సూచించాలని వారు పేర్కొన్నారు.

ఐదుగురిని బలిగొన్న 'ట్యాంకర్'

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సిమెంట్ ట్యాంకర్

- ఐదుగురి దుర్మరణం.. 14 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- అన్నమయ్య జిల్లా చిన్న ఓరంపాడు వద్ద ఘటన
- సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాకు ఆదేశం


ప్రమాద స్థలంలో మృతదేహాలు

ఓబులవారిపల్లె/రాయచోటి/అమరావతి: మద్యం మత్తు ఐదుగురు ప్రయాణికుల ప్రాణాలు తీసింది. అన్నమయ్య జిల్లా చిన్నఓరంపాడు వద్ద నాలుగో నంబర్ జాతీయ రహదారిపై దాబా హోటల్ సమీపంలో శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్సును సిమెంట్ ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కడప ఐసీఎల్ నుంచి చెన్నైకి సిమెంట్ పొడి లోడుతో వెళ్తున్న లారీ ట్యాంకర్ చిన్నఓరంపాడు దాబా వద్ద అదుపు తప్పి తిరుపతి నుంచి కడప వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని మితిమీరిన వేగంతో నడుపుతూ రోడ్డుకు అటూ ఇటూ తిప్పుతూ రావడాన్ని గమనించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టి బస్సును తప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించి కుడి వైపునకు పూర్తిగా పక్కకు తిప్పాడు. దీంతో ట్యాంకర్ లారీ ఆర్టీసీ బస్సు మధ్య భాగంలో కండక్టర్ సీటు వద్ద నుంచి బస్సు వెనుక భాగం వరకు బలంగా ఢీకొంది.

ఘటనా స్థలంలో ముగ్గురు.. ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరి మృతి

బస్సులోని మధ్య సీట్లలో కూర్చున్న వైఎస్సార్ జిల్లా కోగటం గ్రామానికి చెందిన బి.కమాల్ బాషా (65), అన్నమయ్య జిల్లా చిన్నఓరంపాడు జనంపల్లె దళితవాడకు చెందిన జి. శ్రీనివాసులు (60) అలియాస్ బుడ్డయ్య, రాజంపేట మండలం వెంకటరాజంపేట గ్రామానికి చెందిన కొమరావతి శేషాద్రి శేఖర్ (55)అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం దొగ్గలపాడు గ్రామానికి చెందిన చెవ్వు అమర్‌నాథ్‌రెడ్డి (25), నందలూరు మండలం ఆడపూరు గ్రామానికి చెందిన లక్ష్మయ్య (70)లను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న నికిత, వెన్నెల అనే బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి తరలించారు. వీరు కాకుండా మరో 12 మందికి గాయాలయ్యా యి. ప్రమాద సమయంలో బస్సులో 62 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం కారణంగా లారీ ట్యాంకర్, బస్సు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో పుల్లంపేట నుంచి మంగంపేట వరకు వాహనాలు నిలిచిపోయాయి. రాజంపేట డీఎస్పీ చైతన్య ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

ప్రమాద విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.50 వేల చొప్పున సహాయం అందించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టినట్టు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరిషా పీఎస్, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు వేర్వేరుగా తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. కాగా, ఘటనపై ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు ఆర్టీసీ తరఫున పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తామన్నారు.

'ఉపా' కింద దుడ్డు ప్రభాకర్ అరెస్ట్

- హైకోర్టుకు తెలిపిన ఎన్ఐఏ
- జగదల్‌పూర్ కోర్టు ముందు హాజరుపరిచినట్లు వెల్లడి
- మావో అగ్రనేత ఆర్కే భార్య శిరీష కూడా అరెస్టు

సాక్షి, అమరావతి: కుల నిర్మూలన పోరాట సమితి నేత దుడ్డు ప్రభాకర్‌ను చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద అరెస్ట్ చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) శనివారం హైకోర్టుకు వెల్లడించింది. అతన్ని ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని ఎన్ఐఏతో పాటు రాష్ట్ర పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులిచ్చింది. తన భర్త దుడ్డు ప్రభాకర్‌ను ఎన్ఐఏ అధికారులు అక్రమంగా నిర్బంధించారని, ఆయన్ని కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దుడ్డు కుసుమ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సోమయాజులు, జస్టిస్ వెంకటరమణలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున జై భీమారావు వాదనలు వినిపిస్తూ.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు 10 మంది వ్యక్తులు సాధారణ దుస్తుల్లో వచ్చి ప్రభాకర్‌ను బలవంతంగా కారులో తీసుకెళ్లారని చెప్పారు. అక్కడే ఉన్న పోలీసులను ప్రశ్నించగా.. తీసుకెళ్లిన వారు ఎన్ఐఏ అధికారులన్నారని పేర్కొన్నారు. చట్టప్రకారం తమ పరిధిలోకి రాని వ్యక్తిని అరెస్ట్ చేసే ముందు స్థానిక పోలీసులకు సమాచారమివ్వాల్సిన బాధ్యత ఎన్ఐఏ అధికారులపై ఉందన్నారు. కానీ అలా జరగలేదన్నారు. ఎన్ఐఏ తరఫు న్యాయవాదులు బైరెడ్డి వరుణ్, వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో ఉపా కింద నమోదైన కేసులో ప్రభాకర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ విషయాన్ని స్థానిక పోలీసులకు ఎన్ఐఏ అధికారులు తెలియజేశారని.. అతన్ని జగదల్‌పూర్ కోర్టు ముందు కూడా హాజరు పరిచినట్లు వెల్లడించారు. అనంతరం ధర్మాసనం ఎన్ఐఏ, రాష్ట్ర పోలీసులను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది.

ఆర్కే భార్య శిరీష అరెస్టు

దుడ్డు ప్రభాకర్‌తో పాటు దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్(ఆర్కే) భార్య కందుల శిరీష అలియాస్ పద్మక్కను కూడా అరెస్టు చేసినట్లు ఎన్ఐఏ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లో ఛత్తీస్‌గఢ్‌లోని ట్రియ గ్రామంలో భద్రతా దళాలపై మావోయిస్టులు జరిపిన దాడి కేసులో వారిద్దరినీ అరెస్టు చేసినట్టు వెల్లడించింది. దీనిని ఆర్కే డైరీ కేసుగా ఎన్ఐఏ పరిగణిస్తోంది. శిరీష, దుడ్డు ప్రభాకర్‌తో పాటు ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. శిరీషను ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఆమె నివాసంలో, ప్రభాకర్‌ను విజయవాడలో ఆయన నివాసంలో ఎన్ఐఏ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్టుల నుంచి నిధులు పొందుతూ.. ఆ పార్టీ భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు వీరిద్దరూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని ఎన్ఐఏ తెలిపింది. మావోయిస్టు పార్టీ అనుబంధ విభాగాల పటిష్టత కోసం పనిచేస్తున్నారని పేర్కొంది.

ఇది రైతుల స్వర్ణ యుగం

- ప్రకృతి వ్యవసాయం దిశగా వేగంగా అడుగులు
- ప్రతి ఆర్బీకే ఒక పరిశోధనశాల
- ఏపీ కార్ల్‌లో నాలుగేళ్ల ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు ప్రారంభంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలో రైతుల స్వర్ణ యుగం నడుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయ పరిశోధనలకు, వ్యవసాయ విజ్ఞానానికి మూల బిందువుగా మార్చాలని సంకల్పించిందన్నారు. శనివారం ఆయన వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఏపీ కార్ల్ (ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అన్ లైవ్‌స్టాక్) ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు శాస్త్రవేత్త కోర్సు అకడమిక్ మొదటి బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడులతో అధిక ఉత్పాదకతను పెంపొందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఆర్బీకే ఒక వ్యవసాయ పరిశోధనశాల కావాలన్న సీఎం జగన్ ఆకాంక్షను రైతు సాధికార సంస్థ కార్యరూపం ఇస్తోందని వివరించారు. సహజ సిద్ధమైన ఎరువులను వాడటం వల్ల పర్యావరణ సహిత ఆరోగ్యకరమైన దిగుబడులను ఉత్పత్తి చేయడమే రైతు శాస్త్రవేత్త కోర్సు ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఎకో విలేజ్‌గా మార్చాలన్నది సీఎం సంకల్పమన్నారు. జర్మనీ, భారత ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమి ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఏఆర్‌ఎల్) సంస్థ ఈ అంశంలో ప్రధాన భూమిక పోషిస్తోందని చెప్పారు. కాగా, జర్మన్ నుంచి పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు వర్చువల్ విధానం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగ్రో ఎకాలజీపై పట్టు

నాలుగేళ్ల వ్యవధి కలిగిన ఈ ప్రత్యేక కోర్సులో నాలుగు విధాల శిక్షణ ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కోసం తయారు చేసిన మాడ్యుల్స్‌ను తరగతి గదుల్లో బోధిస్తారు. రైతు శాస్త్రవేత్తలు ఆగ్రో ఎకాలజీకి సంబంధించిన విభిన్న విషయాలను పరిశోధించి నేర్చుకుంటారు. కోర్సు పూర్తయ్యే నాటికి రైతు శాస్త్రవేత్త తన వ్యవసాయ క్షేత్రాన్ని ఉన్నత శ్రేణిగా తీర్చిదిద్ది, ప్రతినెలా కనీసం ఎకరానికి రూ.25 వేల ఆదాయం పొందేలా తయారవుతారు. ఈ కోర్సులో చేరిన వారు ఇటు కొత్త విషయాలు తెలుసుకుంటూనే వారి వారి ఊళ్లలో సర్వీస్ అందిస్తారు. రైతు శాస్త్రవేత్త తీర్చిదిద్దిన ఆదర్శ నమూనా గ్రామంలోని మిగతా రైతులను ఆకర్షిస్తూ కనీసం 50 మందిని 'ఎ' గ్రేడ్ రైతులుగా తీర్చిదిద్దాలి. ప్రకృతి వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలి.

– విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

దళితుడినని పట్టించుకోవడం లేదు..

- టీడీపీ ఇన్‌చార్జ్‌పై ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఈరన్న ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర: 'నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుండుమల తిప్పేస్వామి నన్ను అడ్డుపెట్టుకుని 18 నుంచి 20 క్వారీలను ఏర్పాటు చేసుకున్నాడు. నన్ను పొగుడుతూ తను మాత్రం బాగా సంపాదించుకున్నాడు. ఆ రోజు మంచివాడినైన నేను.. ఈ రోజు ఆయనకు ఎలా చెడ్డవాడినయ్యానో తెలియడం లేదు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పార్థసారథిరెడ్డి కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. దళిత నాయకుడినైన నన్ను పట్టించుకోకపోవడం మంచి పద్ధతి కాదు' అని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఈరన్న మండిపడ్డారు. మడకశిరలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, పార్థసారథిరెడ్డిలపై ధ్వజమెత్తారు. గుండుమల గతంలో పార్టీ మారేందుకు ప్రయత్నించారని, అలాంటి వ్యక్తికి పార్టీలో పెద్దపీట వేయడం శోచనీయమన్నారు. ప్రతి పంచాయతీలో వర్గాలను పెంచి పోషిస్తున్నాడని, ఆయన వ్యవహార శైలి నచ్చక సీనియర్ నాయకులందరూ టీడీపీకి దూరమయ్యారని చెప్పారు.

జగనన్న ఇళ్లలో 'హరిత' వెలుగులు

'జీ20' వర్కింగ్ గ్రూప్ సదస్సులో 'ఈఈఎస్ఎల్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

- 6 లక్షల ఎల్ఈడీ బల్బులు, 3 లక్షల ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 3 లక్షల సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ
- తొలుత 1.5 లక్షల ఇళ్లకు రూ.100 కోట్లతో సరఫరా
- ప్రతి ఇంటికీ తగ్గనున్న కరెంటు బిల్లులు.. పెరగనున్న జీవన ప్రమాణాలు
- సుస్థిర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్
- వేదికపై ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ప్రశంసలు


ఒప్పంద పత్రాలతో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్

సాక్షి, అమరావతి: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ×జగనన్న ఇళ్లు× పథకంలో ప్రతి ఇంటిలో హరిత వెలుగులు ప్రసరించనున్నాయి. ఈ ఇళ్లకు విద్యుత్ ఆదా ఉపకరణాలను మార్కెట్ ధరకంటే తక్కువకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విద్యుత్తు శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో ఒప్పందం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ (ఏపీసీడ్కో)తో కలిసి ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్) ఈఈఎస్ఎల్‌తో ఈ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గోవాలో శనివారం జరిగిన జీ20 వర్కింగ్ గ్రూప్ సదస్సులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు కరెంటు బిల్లులను తగ్గించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.

ప్రతి ఇంటికీ కరెంటు బిల్లులో ఏటా రూ.2,259 మిగులు

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇళ్లకు ఈఈఎస్ఎల్ దశలవారీగా 6 లక్షల ఎల్ఈడీ బల్బులు, 3 లక్షల ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 3 లక్షల డీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లు సరఫరా చేస్తుంది. ప్రతి ఇంటికీ 4 ఎల్ఈడీ బల్బులు, 2 ట్యూబ్ లైట్లు, 2 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫ్యాన్లను రాయితీ ధరలకు ప్రభుత్వం అందించనుంది. ఈ ఉపకరణాల వల్ల ప్రతి ఇంటికీ ఏడాదికి 734 యూనిట్ల విద్యుత్ మిగులుతుంది. తద్వారా కరెంటు బిల్లులో ఏడాదికి రూ.2,259 ఆదా అవుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 లక్షల జగనన్న ఇళ్లు నిర్మాణంలో ఉండగా.. తొలి దశలో నిర్మిస్తున్న 1.56 లక్షల ఇళ్లలో ఈ ఉపకరణాలను వినియోగిస్తారు. దీనివల్ల ఏడాదికి 1,145 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ దాదాపు రూ.400 కోట్లు కాగా తొలి దశలో రూ.100 కోట్లతో ఈ ఉపకరణాలను అందించేందుకు శనివారం ఒప్పందం జరిగింది.

ఏపీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం: విశాల్ కపూర్

ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకం ఇళ్లను ప్రపంచంలోనే ఇంధన సామర్థ్య గృహాలుగా తీర్చిదిద్దడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ప్రశంసించారు. సుస్థిర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో చేపడుతున్న ఈ కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడారు. ఏపీతో ఒప్పందం సందర్భంగా జరిగిన జీ 20 సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హరిత ఇంధన లక్ష్యాల సాధనలో ఇదో కీలక ముందడుగని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ చెప్పారు. ఎనర్జీ ఎఫిషియన్సీ హౌసింగ్ ప్రోగ్రామ్ దేశంలోనే అతిపెద్దదని, ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వెల్లడించారు. ఈ సదస్సులో ఈఈఎస్ఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అనిమేశ్ మిశ్రా, జాతీయ సీనియర్ సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి, ఏపీసీడ్కో ఎండీ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతికి హైకోర్టులో చుక్కెదురు

టీటీడీ తరఫున వాదించేందుకు సుబ్రహ్మణ్యస్వామికి అనుమతినివ్వడంపై వేసిన పిటిషన్ కొట్టివేత

- వాదనలకు ఎవరిని నియమించుకోవాలనేది టీటీడీ ఇష్టమన్న న్యాయస్థానం
- తిరుమలలో అన్యమత ప్రచారమంటూ తప్పుడు కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి
- ఆ పత్రిక, యాజమాన్యంపై రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేసిన టీటీడీ



సాక్షి, అమరావతి: తిరుమల, తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతిష్టను దిగజార్చేలా, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీలో అన్యమత ప్రచారం జరుగుతోందంటూ 2019లో తప్పుడు కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతికి హైకోర్టులో చుక్కెదురు అయ్యింది. తమ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు ఆ పత్రిక యాజమాన్యంపై రూ.100 కోట్లకు టీటీడీ తిరుపతి కోర్టులో దావా వేసిన సంగతి తెలిసిందే. అలాగే టీటీడీ తరఫున వాదనలు వినిపించేందుకు మాజీ ఎంపీ సుబ్రహ్మణస్వామికి అనుమతినివ్వాలని కోరుతూ ఒక అనుబంధ పిటిషన్‌ను కూడా దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో టీటీడీ తరఫున వాదనలు వినిపించేందుకు సుబ్రహ్మణ్యస్వామికి అనుమతినిస్తూ తిరుపతి కోర్టు 2021 మే 1న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు, ఎడిటర్ కె.శ్రీనివాస్, ఎండీ వేమూరి రాధాకృష్ణ తదితరులు వేసిన హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ (సీఆర్‌పీ) దాఖలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి తిరుపతి కోర్టు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరారు. అయితే ఆంధ్రజ్యోతి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి తప్పు లేదని న్యాయమూర్తి తేల్చిచెప్పారు. తమ తరఫున వాదనలు వినిపించేందుకు ఎవరిని నియమించుకోవాలన్నది టీటీడీ ఇష్టమని, ఈ విషయంలో జోక్యం చేసుకునే హక్కు ప్రతివాదులకు లేదన్న టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు.

ఎవరిని నియమించుకోవాలో మా ఇష్టం...

నిబంధనలకు అనుగుణంగా తమ తరఫున వాదనలు వినిపించేందుకు కింది కోర్టులో సుబ్రహ్మణ్యస్వామికి అనుమతినిచ్చామని సత్యనారాయణ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఈ విషయంలో టీటీడీకున్న హక్కును ఎవరూ కాలరాయలేరన్నారు. ఆయన విషయంలో అభ్యంతరం లేవనెత్తే హక్కు ఆంధ్రజ్యోతికి లేదన్నారు. సుబ్రహ్మణ్యస్వామి ఎన్నో కేసుల్లో సుప్రీంకోర్టు ముందు వాదనలు వినిపించారని హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఆయన గొప్ప స్కాలర్ అని, ఆయన వాదనాపటిమపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. పరువు నష్టం దావాలో జరుగుతున్న విచారణను జాప్యం చేసేందుకే దురుద్దేశాలతో ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఈ రివిజన్ పిటిషన్ దాఖలు చేసిందని సత్యనారాయణ ప్రసాద్ కోర్టుకు నివేదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ఈ నెల 10న తీర్పు రిజర్వ్ చేశారు. శుక్రవారం తీర్పు వెలువరిస్తూ ఆంధ్రజ్యోతి యాజమా న్యం దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టేశారు.

కోతల్లేకుండా విద్యుత్ సరఫరా

- విశాఖలో ముగిసిన రెండ్రోజుల దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగ సంస్థల సమావేశం
- కమిటీ చైర్మన్ హోదాలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ హాజరు



సాక్షి, అమరావతి/దొండపర్తి (విశాఖ దక్షిణ) : నైరుతి రుతుపవనాల ఆలస్యం కారణంగా దక్షిణాదిన ఈ ఏడాది మే, జూన్ నెలల్లో మునుపెన్నడూ లేనంతగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేసి దక్షిణ ప్రాంతీయ గ్రిడ్ సామర్థ్యాన్ని నిరూపించామని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె. విజయానంద్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో విద్యుత్ రంగ అభివృద్ధి నిమిత్తం శుక్రవారం విశాఖపట్నంలో మొదలైన సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) 47వ సమావేశం శనివారం ముగిసింది. ప్రాంతీయ కమిటీకి చైర్మన్‌గా ఉన్న విజయానంద్ అధ్యక్షతన కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీసీతో పాటు 45వ టెక్నికల్ కో–ఆర్డినేషన్ కమిటీ (టీసీసీ) సమావేశం కూడా జరిగింది. రెండ్రోజుల పాటు జరిగిన ఈ సదస్సులకు రాష్ట్ర విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, డిస్కంలు ఆతిథ్యం ఇచ్చాయి. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోందని.. దీనికి ఖర్చుచేసే మొత్తాన్ని రైతుల ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలకు బదిలీ చేయడానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పథకాన్ని అమలుచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే, రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం అమలుచేస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ. పృథ్వీతేజ్ ప్రతినిధులకు వివరించారు.


కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు లేఖ..

ఇక దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగ సంస్థలు, వాటి నిర్వహణ, వాణిజ్య కార్యకలాపాలు, సమస్యలు, వాటి పరిష్కారం కోసం పరస్పరం సహకరించుకోవడం, అందుకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం.. దక్షిణ గ్రిడ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌పీసీ, ఎస్ఆర్‌ఎల్‌డీసీ సంస్థల నుంచి అవసరమైన సలహాలు పొందడం వంటి అంశాలపై ఈ సదస్సులో ప్రతినిధులు చర్చించారు. అలాగే, అంతర్రాష్ట్ర విద్యుత్ రవాణా చేసే ఇంట్రా స్టేట్ లైన్‌లకు సెంట్రల్ పూల్ నుంచి ట్రాన్స్‌మిషన్ చార్జీలను పొందేందుకు గతేడాది డిసెంబర్ 6న ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని విద్యుత్ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని కమిటీ తీర్మానించింది.

రూ.2వేల నోట్ల మార్పిడి ముసుగులో టోకరా

వ్యాపారి నుంచి రూ.2.50కోట్ల నగదుతో పరారైన నకిలీ పోలీసులు

బొమ్మలసత్రం (నంద్యాల): రూ.2వేల నోట్ల మార్పిడి ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఓ ముఠా రూ.2.50 కోట్లు టోకరా వేసిన ఘటన నంద్యాల పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మొబైల్ ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. మా వద్ద రూ.3 కోట్ల రూ.2 వేల నోట్లున్నాయని వాట్సాప్‌లో వీడియో పంపారు. వాటిని తీసుకుని రూ.2.50 కోట్లు రూ.500 నోట్లు ఇస్తే చాలని నమ్మించారు. రూ.50 లక్షలు తనకు మిగులుతుందని ఆశ పడిన వ్యాపారి శుక్రవారం మధ్యాహ్నం నగదు రెడీ చేసుకుని ముఠాకు కాల్ చేశాడు. ఆ సభ్యులు నగదు తీసుకుని రైతునగరం సమీపంలోని జాతీయరహదారి వద్దకు ఒక్కడినే రావాలని చెప్పడంతో వ్యాపారి బైక్‌పై నగదు తీసుకెళ్లాడు. ముఠా సభ్యులు వ్యాపారితో మాట్లాడుతుండగా పోలీస్ వాహనం సైరన్ చేసుకుంటూ వారి వద్దకు చేరుకుంది. వెంటనే దొంగల ముఠా సభ్యులు అక్కడి నుంచి మరో వాహనంలో పరారయ్యారు. కారులో వచ్చిన నకిలీ పోలీసులు వ్యాపారి వద్ద ఉన్న నగదు తీసుకుని స్టేషన్‌కు రమ్మని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వ్యాపారి తీరా తాలుకా పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులను కలిసి జరిగిన విషయం చెప్పాడు. అయితే పోలీస్ వాహనంలో వచ్చింది దొంగల ముఠా అని తెలిసి నివ్వెరపోయాడు. ఇక పోలీసులకు ఫిర్యాదు చేస్తే తన పరువు పోతుందని భావించి ఇంటికి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకుని పోలీస్ ఉన్నతాధికారులు దొంగల ముఠాను గుర్తించే పనిలోపడ్డారు. ఈవిషయంపై ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని వివరణ కోరగా ఓ వ్యాపారి నుంచి కొందరు వ్యక్తులు కొంత నగదు మోసం చేసి తీసుకెళ్లినట్లు తెలిసిందని, విచారించి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



దేవదా... నా నటన నచ్చిందా?

సినిమాలలోని పాపులర్ సీన్‌లను రీక్రియేట్ చేసి ఆనందించడం మనకు కొత్త కాదు.

సంజయ్‌లీలా బన్సాలీ 'దేవదాస్' సినిమాలో 'పారు' పాత్రలోని ఐశ్వర్యారాయ్‌ని అనుకరిస్తూ కైరా ఖన్నా అనే బాలిక చేసిన వీడియో తాజాగా వైరల్ అయింది.

ఐకానిక్ సినిమాలలోని పాపులర్ సీన్‌లను అనుకరిస్తూ కైరా చేసే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

'జిస్ వక్త్ తుమ్హారే సాథ్ హోతి హమ్ ఉస్ వక్త్ బద్నామి కా బీ డర్ నహీ లగ్తా'

'దస్ సాల్ పహ్లే తుమ్హారే నామ్ కా దియా జలాయ థా మైనే. ఉసే ఆజ్ తక్ బుజ్నే నహీ దియా'... ఇలా 'దేవదాస్' సినిమాలోని 'పారు' పాపులర్ డైలాగ్‌లతో 'వావ్' అనిపించింది కైరా ఖన్నా.

'డైలాగుల నుంచి ఎక్స్‌ప్రెషన్ వరకు అద్భుతం'

'అద్భుతమైన యాక్టింగ్ స్కిల్స్ ఉన్న కైరాకు బాలీవుడ్‌లో బ్రైట్ ఫ్యూచర్ ఉంది'... అంటూ నెటిజనులు కైరా ఖన్నాపై ప్రశంసల వర్షం కురిపించారు.

కట్టప్పా కమాన్... ఇదిగో బాహుబలి థాలీ

చెన్నైలోని పొన్నుస్వామి హోటల్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన 'బాహుబలి థాలీ' సోషల్ మీడియా స్టార్స్‌గా మారింది. 'మీలో బాహుబలి థాలీని టచ్ చేసే వీరుడు ఎవరు?' అని ఒక నెటిజనుడు కామెంట్ పెట్టాడు.

ట్విట్టర్ యూజర్ అనంత్ రూపన్‌గూడి 'బాహుబలి థాలి' వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో ఇద్దరు వ్యక్తులు థాలీ భారీ ప్లేట్‌ను కస్టమర్‌ల దగ్గరకు తీసుకు వస్తున్న దృశ్యం కనిపిస్తుంది.

ఈ వీడియోను చూసి.... 'నోరూరుతోంది సుమీ!' అని లొట్టలు వేస్తున్న వారితో పాటు-

'ఇది గుడ్ ఐడియా కాదు. రెండు ముక్కల్లో చెప్పాలంటే ఫుడ్ వేస్టేజ్' అని విమర్శించిన వారు ఉన్నారు.

ఇంతకీ బాహుబలి థాలి ధర ఎంతనుకుంటున్నారు?

కేవలం రూ.1399 ప్లస్ జీఎస్‌టీ మాత్రమే!



వైరల్

టమాటా చిత్ర కథ

'చికెన్ తినాలంటే చికెన్ మాత్రమే తిననక్కర్లేదు. గాల్లో వేలాడుతున్న కోడిని చూస్తూ, ఊహించుకుంటూ బ్రహ్మాండంగా తినవచ్చు' అనే గొప్ప సత్యాన్ని 'అహ నా పెళ్లంట' సినిమాలో లక్ష్మీపతి (కోట శ్రీనివాసరావు) జనులకు చెప్పకనే చెప్పారు. 'ఇప్పుడు ఆ సినిమాని రీమేక్ చేస్తే గాలిలో వేలాడుతున్న కోడికి బదులు టమాటాలు ఉంటాయి' అని నెటిజనులు ఒకటే జోకులు!





1 ఒక మహిళ దుబాయ్‌కి వెళ్లింది. ఇండియాకు తిరిగి వచ్చే ముందు...'నీ కోసం ఏం తీసుకురమ్మంటావు?' అని తల్లిని అడిగింది. 'బంగారు నగలో, లగ్జరీ గిఫ్టో అడిగి ఉంటుంది' అని అనుకుంటారు చాలామంది.

కానీ ఆ తల్లి బంగారం కంటే విలువైన టమాటాలను అడిగింది. ఒకటి కాదు రెండు కాదు...'పది కిలోల టమాటాలు తీసుకురామ్మా' అని కూతురిని అడిగింది. పదికిలోల టమాటాలను పెరల్‌పెట్ స్టోరేజ్ జార్‌లలో ప్యాక్ చేసి ఇండియాకు తీసుకువచ్చింది కూతురు. ఈవిడ సోదరి ట్విట్టర్‌లో షేర్ చేసిన దుబాయ్ టమాటాల స్టోరీ వైరల్ అయింది.

•••

2 బంగారు నగలు అంటే ఎవరికి మాత్రం మక్కువ ఉండదు? అయితే టమాటాలేమో బంగారం కంటే విలువైపోయాయి. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బాలీవుడ్ నటి ఉర్ఫీ జావెద్

'యురేకా... టమాటాలతో ఆభరణాలు' అని అరిచింది. టమాటాలను చెవిరింగులుగా ధరిస్తూ 'న్యూ గోల్డ్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటో షేర్ చేసింది.

•••

3 శిల్పాశెట్టి షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ 11 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. ఇక వీడియో విషయానికి వస్తే... టమాటాల కోసం సూపర్‌మార్కెట్‌కు వెళుతుంది శెట్టి. టమాటాలన్నీ కూడబలుక్కొని 'టచ్‌మీ నాట్' అన్నట్లుగా చూస్తుంటాయి. టమాటాలను చేతిలో తీసుకున్న ప్రతిసారీ ఆమె నటించిన 'దడ్కన్' సినిమాలోని 'ఖబడ్దార్. హౌ డేర్ యూ' అనే డైలాగ్ ప్లే అవుతుంటుంది!



బసంతీ... వాట్ ఈజ్ యువర్ నేమ్?

'హాలీవుడ్ షోలే' పేరుతో విడుదలైన ఏఐ జెనరేటెడ్ వీడియో ఇమేజ్‌లు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. 'షోలే'లోని ప్రధాన క్యారెక్టర్‌లకు హాలీవుడ్ ప్రముఖ నటుల ముఖాలను సూపర్ ఇంపోజ్ చేశారు.

ఈ వీడియో క్లిప్‌లలో రాబర్ట్ డి నిరో 'జై', అల్ పసినో 'వీరు', జూలియా రాబర్ట్స్ 'బసంతి', కెవిన్ స్పేసీ 'ఠాకూర్', జాక్ నికల్సన్ 'గబ్బర్‌సింగ్'లుగా కనిపిస్తారు. 'అంతా బాగానే ఉందిగానీ ఠాకూర్ పాత్రకు కెవిన్‌ను ఎంపిక చేసుకోవడం బాగోలేదు. ఎందుకంటే ఠాకూర్ నిజాయితీపరుడు. ముక్కుసూటి మనిషి. కెవిన్ సైకో పాత్రలకు పెట్టింది పేరు'

'షోలే అనేది ఎన్నో హాలీవుడ్ సినిమాల కాపీ. మెయిన్ ప్లాట్ 7 సమురాయ్, కొన్ని పవర్‌ఫుల్ సీన్‌లను వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ వెస్ట్ సినిమాలలో నుంచి తీసుకున్నారు'... ఇలా రకరకాలుగా నెటిజనులు స్పందించారు.

చీరదరహాసం

స్పోర్ట్స్, ఎడ్వెంచర్ యాక్టివిటీలకు చీర 'అన్‌ఫిట్' అనే భావన ఉంది. అయితే క్రమంగా ఈ భావనలో మార్పు వస్తోంది. 'శారీతో కూడా ఓకే' అనిపిస్తున్నారు కొందరు మహిళలు. తాజాగా స్కూబా డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కాత్య సైనీ చీర ధరించి కైట్ సర్ఫింగ్ చేసింది.



ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో గంటల వ్యవధిలోనే లక్షలాది వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'నౌ దిస్ ఈజ్ క్రాస్ కల్చర్. ఐ లవ్ దిస్' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా...

'చీర ధరించి అడ్వెంచరస్ స్పోర్ట్స్‌లో పాల్గొనడం ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే' అని కొందరు హెచ్చరించారు. గత ఫిబ్రవరిలో షైను అనే యూజర్ పోస్ట్ చేసిన ఇలాంటి వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో ఒక నడి వయసు స్త్రీ చీర ధరించి రోప్ సైకిలింగ్ చేస్తున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది.

హెల్త్



మద్యం అలవాటు లేనివారిలోనూ


నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్!

మనలో కొంతమందికి ఫ్యాటీలివర్‌పై ఎంతో కొంత అవగాహన ఉండే ఉంటుంది. మద్యం తాగే అలవాటు ఉన్నవారి కాలేయంలో క్రమక్రమంగా కొవ్వు పెరుగుతూ ఒక దశ తర్వాత కణాలన్నీ పూర్తిగా నశించి, కొవ్వుమయం అయిపోతే... అది సిర్రోసిస్ అనే కండిషన్‌కు దారితీస్తుందనీ, అప్పుడు కాలేయ మార్పిడి తప్పదనే అవగాహన కొంత మందిలో ఉంటుంది. అయితే మద్యం తాగే వారికే ఫ్యాటీ లివర్ వస్తుందన్నది పాక్షిక సత్యమే. ఆ అలవాటు లేనివారిలోనూ వచ్చే అవకాశాలున్నాయి. ఈ కండిషన్‌నే 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) అంటారు. శరీరతత్త్వాన్ని బట్టి మద్యం, మాంసాహార అలవాట్లు లేకపోయినా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ రావచ్చనే అవగాహన కల్పించేదే ఈ కథనం.

మానవుల పొట్టలో కుడివైపున కాలేయం ఉంటుంది. తీసుకున్న ఆహారంలోని చక్కెరలు శక్తిగా మారాక... మిగతావి కొవ్వు రూపంలోకి మారి కాలేయంలో నిల్వ ఉంటాయి. మళ్లీ అవసరమైనప్పుడు ఉపయోగపడతాయి. ఈ నిరంతర ప్రక్రియలో కొవ్వు మోతాదులు పెరుగుతున్న కొద్దీ కాలేయ కణాలు తమ స్వగుణాన్ని కోల్పోయి కొవ్వు పేరుకున్నట్లుగా అయిపోతాయి. ఈ కండిషన్‌ను ఫ్యాటీలివర్ అంటారు. మద్యం అలవాటు ఉన్నా, పొట్ట ఎక్కువగా ముందుకొచ్చి ఉన్నా... వారిలో కాలేయం దశలవారీగా, ఎంతోకొంత ఫ్యాటీలివర్‌గా మారిపోయి ఉంటుంది.

కారణాలు: జీవనశైలి / మెటబాలిక్ డిసీజెస్‌గా పేర్కొనే డయాబెటిస్ ఉన్న వారిలోనూ, అలాగే పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోవడం (సెంట్రల్ ఒబేసిటీ), స్థూలకాయం (ఒబేసిటీ) వంటి అంశాలు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌కు కారణం కావచ్చు. ● ఆహారంలో పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం.

లక్షణాలు: ఆల్కహాలిక్ లివర్ డిసీజ్‌లోనైనా కొద్దిమేరకు లక్షణాలు కనిపించేమోగానీ... నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌లో చాలావరకు లక్షణాలు కనిపించవు. అయితే మనకు చాలా సాధారణం అనిపించే కొన్ని లక్షణాలు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌ను పట్టిస్తుంటాయి. ఉదా: పొట్ట పెరిగి, బానపొట్టలా ముందుకు రావడం. ● కొందరిలో కుడివైపు పొట్ట పైభాగంలో పొడుస్తున్నట్లుగా నొప్పి రావడం. లివర్ క్రమంగా పెరుగుతుండటంతో ఈ లక్షణం బయటపడుతుంది.



డాక్టర్ శ్రీనివాస్ నిష్టల
సీనియర్ ఇంటర్వెన్షనల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్

నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్... దశలు...

నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్‌లో నాలుగు దశలు ఉంటాయి. అవి మొదటి సింపుల్ స్టియటోసిస్ దశ, రెండోది స్టియటో-హెపటైటిస్ దశ. మూడోది ఫైబ్రోసిస్ దశ, నాలుగోదీ, చివరదీ... ఇక వెనక్కు తిప్పడానికి వీలుకాని సిర్రోసిస్ దశ.



మొదటి దశ: ఇది సాధారణమైన ఫ్యాటీ లివర్ వ్యాధి తొలి దశ. ఇందులో కాలేయ కణాల మధ్య కొద్దిగా అంటే 5 శాతం నుంచి 10 శాతం మేరకు కొవ్వు పేరుకుంటుంది.



రెండో దశ (నాశ్): ఈ దశను నాన్ ఆల్కహాలిక్ స్టియటో-హెపటైటిస్ (ఎన్ఏఎస్‌హెచ్-నాశ్) అంటారు. ఇందులో కాలేయం కొద్దిగా గాయపడటంతో పాటు కాలేయ కణాలు కొన్ని నశిస్తాయి.



మూడో దశ (ఫైబ్రోసిస్): ఈ దశలో కాలేయం పీచుగా మారినట్లుగా కనిపిస్తుంది. దీన్నే ఫైబ్రోసిస్‌గా పేర్కొంటారు.



నాలుగో దశ (సిర్రోసిస్): ఫైబ్రోసిస్ నుంచి కాలేయం కొవ్వుకణాలతో నిండిపోయి, పూర్తిగా తన స్వరూపాన్ని కోల్పోయి, కాలేయ మార్పిడి తప్ప ప్రత్యామ్నాయం లేని దశ వస్తుంది. ఇది వెనక్కుమరల్చలేని (ఇర్రివర్సిబుల్) దశ.

నిర్ధారణ: ● బాధితుని స్థూలకాయం, పొట్ట (సెంట్రల్ ఒబేసిటీ) చూసి డాక్టర్లు పరిస్థితిని కొంతమేర అంచనా వేయగలరు. ● కొన్ని రక్త పరీక్షలు, అలాగే డయాబెటిస్, కొలెస్ట్రాల్ మోతాదులు, ట్రైగ్లిజరైడ్ స్థాయులు పెరిగాయా అన్నదీ చూడాలి. ● అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో ఫ్యాటీలివర్ తప్పక బయటపడుతుంది. ● కొందరిలో లివర్ బయాప్సీ అవసరం. లివర్ బయాప్సీతో ఎన్ఏఎఫ్ఎల్‌డీలో అది నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీలివరా (ఎన్ఏఎఫ్ఎల్), లేక నాన్ ఆల్కహాలిక్ స్టియటో-హెపాటిక్ (నాశ్) కండిషనా అని నిర్ధారణ చేయవచ్చు. ● ఇప్పుడు 'ఫైబ్రోస్కాన్' అనే వైద్యపరీక్షతో లివర్‌లో ఏ మేరకు కొవ్వు పేరుకుంది, ఫైబ్రోసిస్ ఎంత ఉందన్న విషయంతో పాటు, మూడు నెలల తర్వాత మళ్లీ సమీక్షించి, కొవ్వు మోతాదులు పెరిగాయా, తగ్గాయా కూడా తెలుసుకోవచ్చు.

ముందస్తు నివారణకు ఈ జాగ్రత్తలు...

- **బరువు తగ్గడం :** ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా బరువు ఉన్నవారు ఆహారంలో పిండి పదార్థాలను తగ్గించాలి. ప్రతి వారం అర కిలో నుంచి కిలో బరువు తగ్గించుకునేలా శ్రమించాలి.
- **ఆరోగ్యకరమైన ఆహారం :** ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పనిసరి. పొట్టుతో ఉండే తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. పాలిష్ చేసిన వాటికి బదులుగా పొట్టు తీయని బియ్యం, గోధుమలు వాడాలి. రిఫైన్డ్ షుగర్స్, మైదా, స్వీట్లు తగ్గించాలి. మాంసాహారం తీసుకునేవారు చేపలు తినడం మంచిది.
- **వ్యాయామం :** చురుగ్గా ఉంటూ రోజూ ఒంటికి పనిచెప్పేలా శ్రమించాలి. రోజూ కనీసం 30 నిమిషాలకు తక్కువ కాకుండా వ్యాయామం చేయాలి.
- డయాబెటిస్‌ను తప్పకుండా అదుపులో ఉంచుకోవాలి. కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గించుకోండి. ఇందుకు వ్యాయామంతో పాటు ఒకవేళ అవసరమైతే మందులు కూడా వాడాలి.

చికిత్స : ● ఆల్కహాల్ అలవాటు లేనివారిలో దీని చికిత్సకు నిర్దిష్టంగా ఒక ప్రొటోకాల్ లేదు గానీ... దీని చికిత్స సమయంలో ఫ్యాటీలివర్ డిసీజ్‌కు దోహదపడిన అంశాలను బట్టి డాక్టర్లు చికిత్స చేస్తారు. ముఖ్యంగా బాధితుల జీవనశైలిలోనూ, ఆహారంలో మార్పులతో పాటు వ్యాయామం వంటివి సూచిస్తారు. బాధితులు ఏవైనా మందులు వాడుతుంటే, వాటి కారణంగా ఫ్యాటీలివర్ వచ్చిందని భావిస్తే, వాటిని మారుస్తారు. ● చాలా కొద్ది మందిలో మందులూ, శస్త్రచికిత్సా అవసరం కావచ్చు.

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా ముప్పు..!



ప్రస్తుత వర్షాలు ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజల జీవితాలను మరింత అల్లకల్లోలం చేసే జ్వరమైన మలేరియాను మరింత పెంచవచ్చు. మిగతా తెలుగు రాష్ట్రాల్లో అంతగా కనిపించకపోయినా... అడవుల్లో, కొండకోనల్లో ఎప్పుడూ ఎండెమిక్‌గా ఉండే మలేరియా... ఇప్పటి వర్షాలతో మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉంది. అక్కడి ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమూ ఉంది. ఈ నేపథ్యంలో మలేరియాపై అవగాహన కోసం ఈ కథనం.

మలేరియా వ్యాధి ప్లాస్మోడియమ్ అనే ఏకకణ పరాన్న జీవి వల్ల వస్తుంది. దీన్ని అనాఫిలిస్ ఆడ దోమ వ్యాప్తి చేస్తుంది. ఈ పరాన్న జీవి నాలుగు ప్రధాన ప్రజాతులుగా... అంటే... ప్లాస్మోడియం ఫ్యాల్సిపేరమ్, ప్లాస్మోడియం ఒవ్యులా, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరీ. ప్లాస్మోడియం నోవిసై అనే మరో ప్రజాతి ఉంది గానీ ఇది కొద్ది దేశాలకే పరిమితం.

లక్షణాలు: దోమ కుట్టిన తర్వాత 7 నుంచి 14 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. చలి, తలనొప్పి, ఒళ్లునొప్పులతో పాటు జ్వరం రావడం మలేరియా ప్రధాన లక్షణం. వ్యాధిని కలిగించే పరాన్న జీవిని బట్టి లక్షణాలూ కొద్దిగా మారతాయి. భారత్‌లో ప్రధానంగా రెండు రకాలు ఎక్కువ. వాటిల్లో ప్లాస్మోడియమ్ వైవాక్స్ కంటే ప్లాస్మోడియమ్ ఫ్యాల్సిపేరమ్ తీవ్రత ఎక్కువ. ఎందుకంటే ఫ్యాల్సిపేరమ్ రకానికి చెందిన పరాన్న జీవులు ఎర్రరక్తకణాల్లో తమ అభివృద్ధిని చాలా వేగంగా సాగిస్తాయి. దాంతో బాధితులు కోమాలోకి వెళ్లడానికి అవకాశాలు ఎక్కువ. ఫ్యాల్సిపేరమ్ రకం మలేరియా వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కామెర్లు, కిడ్నీలు విఫలం కావడంతో పాటు ఒక్కోసారి మృత్యువుకూ దారి తీయవచ్చు.

నిర్ధారణ:
- డిప్-స్టిక్ పద్ధతితో 15 నిమిషాల్లోనే ఫలితాలు చాలా కచ్చితంగా తెలుస్తాయి.
- **రక్త పరీక్ష :** థిక్ అండ్ థిన్ స్మియర్, జిమ్సా స్టెయిన్ పరీక్ష చేసి, ఒకసారి పరీక్షల్లో మలేరియా పరాన్నజీవి బయటపడకపోతే... రెండు, మూడు రోజుల పాటు వరసగా రక్తపరీక్ష చేయాల్సి ఉంటుంది.
- **ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ :** మలేరియా యాంటిజెన్‌ను త్వరగా గుర్తించగలిగే పరీక్షలు, పారసైట్-ఎఫ్, ఆప్టిమల్ టెస్ట్స్... ఇవన్నీ ర్యాపిడ్ డయాగ్నస్టిక్ తరహాకు చెందినవి. పీసీఆర్ టెస్ట్, మలేరియా యాంటీబాడీస్ టెస్ట్ అనే పరీక్షలు కూడా ఉన్నాయి గాని వీటిని పెద్దగా వాడటం లేదు.

చికిత్స: గతంలో మలేరియాకు క్వినైన్, క్లోరోక్విన్ వంటి మందులతో చికిత్స చేసేవారు. అయితే పరాన్నజీవి ఆ మందులకు నిరోధక శక్తి పెంచుకోవడంతో వాటిపై నియంత్రణ విధించారు. లక్షణాల తీవ్రతను బట్టీ, అలాగే... తీవ్రత తక్కువగా ఉండే వైవాక్సా లేదా తీవ్రత ఎక్కువగా ఉండే పాల్సిఫేరమా అనే దాన్ని బట్టి వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స అందించాల్సి ఉంటుంది. వ్యాధి తీవ్రత వల్ల ఇతర పరిణామాలు... అంటే...కిడ్నీల పనితీరు దెబ్బతింటే డయాలిసిస్, శ్వాస అందకపోతే వెంటిలేషన్ వంటివి అవసరమవుతాయి. మందులతో పాటు మంచి ఆహారం, విశ్రాంతితో ఈ తరహా మలేరియా త్వరగానే అదుపులోకి వస్తుంది.

నివారణ: ● దోమల నివారణే మలేరియా నివారణకు మంచి మార్గం. ● మన ఇంట్లోకి దోమలు రాకుండా రిపెల్లెంట్లు, దోమతెరలు వాడవచ్చు. ● దోమలు కుట్టకుండా శరీరంపైన పూత మందులు వాడవచ్చు. ● హాఫ్ స్లీవ్స్ వంటి దుస్తులు వద్దు. ఒళ్లంతా కప్పి ఉంచే దుస్తులను వాడాలి. ● ఇళ్ల పరిసరాల్లో మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. ● పాత టైర్లు, ఖాళీ కొబ్బరి చిప్పల వంటివి దోమల పెరుగుదలకు ఉపకరిస్తాయి కాబట్టి వాటిని ఇంటి పరిసరాల్లో ఉంచకూడదు. ● కొంతమంది వాటర్ కూలర్స్‌లో కొన్ని నీళ్లు ఉంచేస్తారు. సాధారణంగా వర్షాలుపడగానే వాటిని ఉపయోగించడం ఆపేసి, వాటిని మూలన పడేస్తారు. దాంతో అవి దోమలకు మంచి బ్రీడింగ్ స్థలాలుగా మారిపోతాయి.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్



పిల్లల ముక్కు నుంచి రక్తస్రావం...?

మెడిటిప్

ఈ సీజన్‌లో పిల్లలు వానల్లో తడిసి, జలుబు చేసి ముక్కు చీదినప్పుడు రక్తం రావచ్చు. చిన్నారుల ముక్కు నుంచి రక్తస్రావం జరగడాన్ని ఎపిస్టాక్సిస్ అంటారు. చాలావరకు ఇది ఏమాత్రం ఆందోళనకరం కాదు. పిల్లల ముక్కు నుంచి రక్తస్రావం అవుతుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ▸ పిల్లలు కాస్త ముందుకు ఒంగి కూర్చునేలా చూడాలి ▸ నోటితో గాలి పీల్చుకొమ్మని చెప్పాలి. ▸ రక్తస్రావం అవుతున్న ముక్కు రంధ్రం వైపు భాగాన్ని బొటనవేలు, చూపుడువేలుతో కాసేపు అలాగే నొక్కి పట్టి ఉంచాలి. ▸ ముక్కుపైన ఐస్‌ప్యాక్ లేదా కోల్డ్ ప్యాక్ ఉంచాలి. ▸ వాళ్లు గట్టిగా ముక్కు చీదకుండా చూడాలి. ▸ రక్తస్రావం తగ్గాక మళ్లీ అలా జరగకుండా ఉండేందుకు పిల్లల వేళ్ల గోళ్లు కత్తిరిస్తూ, వాళ్లు ముక్కులో వేళ్లు పెట్టుకుని గిల్లుకోకుండా చూడాలి. ఈ కొద్దిపాటి జాగ్రత్తలతో రక్తస్రావం తప్పక ఆగిపోతుంది. ఒకవేళ ఆగకపోతే తక్షణం డాక్టర్ / ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌ను కలవాలి.



నేడు 'ఎమర్జింగ్' ఫైనల్లో పాక్‌తో భారత్ పోరు

ఆసియా 'ఎమర్జింగ్' కప్ టోర్నీ తుది పోరుకు రంగం సిద్ధమైంది. కొలంబోలో నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్ 'ఎ'తో భారత్ 'ఎ' తలపడుతుంది. బలాబలాలను బట్టి చూస్తే యశ్ ధుల్ నాయకత్వంలోని భారత జట్టే ఫేవరెట్‌గా ఉంది. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో భారత్ 8 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. టోర్నీలో చెరో సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన ధుల్, సాయి సుదర్శన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో కూడా నిశాంత్ సింధు 10 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ టీమ్‌ను చూస్తే పలువురు ఆటగాళ్లు మొహమ్మద్ వసీమ్, కెప్టెన్ మొహమ్మద్ హారిస్, ఫర్హాన్, అర్షద్ ఇక్బాల్‌లకు ఇప్పటికే సీనియర్ టీమ్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది.

వెస్టిండీస్ నిలకడ

తొలి ఇన్నింగ్స్‌లో 174/3 ● బ్రాత్‌వైట్ అర్ధసెంచరీ



బ్రాత్‌వైట్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ కుప్పకూలిపోకుండా జాగ్రత్తగా ఆడుతోంది. మ్యాచ్ మూడో రోజు శనివారం టీ విరామ సమయానికి విండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (235 బంతుల్లో 75; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా...బ్లాక్‌వుడ్ (16 నాటౌట్), అలిక్ అతనజ్ (13 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. వర్షం కారణంగా మూడో రోజు ఆటకు అంతరాయం కలిగింది. తొలి సెషన్‌లో 10.4 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా, విండీస్ 31 పరుగులు చేసి కిర్క్ మెకన్జీ (57 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్) వికెట్ కోల్పోయింది. తొలి టెస్టు ఆడుతున్న మెకన్జీని భారత్ తరఫున అరంగేట్రం చేసిన ముకేశ్ కుమార్ తన తొలి వికెట్‌గా పెవిలియన్ పంపించడం విశేషం. ముకేశ్ వేసిన బంతిని ఆడలేక మెకన్జీ కీపర్ ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు మెకన్జీ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. ఉనాద్కట్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అతను అశ్విన్ బౌలింగ్‌లో మిడాఫ్ మీదుగా సిక్స్ బాదాడు. లంచ్ విరామ సమయానికి బ్రాత్‌వైట్ 49 పరుగుల వద్ద ఉన్నాడు. రెండో సెషన్ ప్రారంభం కాగానే బ్రాత్‌వైట్ 170 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఇదే సెషన్‌లో అతని వికెట్ తీయడంలో భారత్ సఫలమైంది. అశ్విన్ వేసిన చక్కటి బంతి బ్రాత్‌వైట్ మిడిల్ స్టంప్‌ను తాకింది. ఆ తర్వాత బ్లాక్‌వుడ్, అతనజ్ కలిసి జట్టును నడిపించారు. మరో 13.2 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన టీమిండియా ఈ జోడీని విడదీయడంలో విఫలమైంది. రెండు రివ్యూలు కూడా భారత్‌కు ప్రతికూలంగా వచ్చాయి.



ముకేశ్‌కు సహచరుల అభినందన

తొలి టెస్టుతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటింగ్ ఎంతో మెరుగ్గా కనిపించింది. రెండో రోజు వెస్టిండీస్ ఓపెనర్లు పట్టుదలగా ఆడి శుభారంభం అందించారు. బ్రాత్‌వైట్, తేజ్ నారాయణ్ చందర్‌పాల్ (95 బంతుల్లో 33; 4 ఫోర్లు) కలిసి 34.2 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచి 71 పరుగులు జోడించారు. జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. షాట్ ఆడబోయిన చందర్‌పాల్ పాయింట్‌లో అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే బ్రాత్‌వైట్, మెకన్జీ కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ 41 ఓవర్లలో వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (37 నాటౌట్), మెకన్జీ (14 నాటౌట్) అజేయంగా నిలిచారు.

పోరాడుతున్న ఆస్ట్రేలియా

లబుషేన్ సెంచరీ



మాంచెస్టర్: 'యాషెస్' సిరీస్ నాలుగో టెస్టులో ఓటమినుంచి తప్పించుకునేందుకు పోరాడుతున్న ఆస్ట్రేలియాకు శనివారం వర్షం రూపంలో అదృష్టం కూడా కలిసొచ్చింది. ఇక ఆ జట్టు మ్యాచ్ చివరి రోజు ఆదివారం కూడా వాన కురవడంపై కూడా ఆశలు పెట్టుకోవాలి! 162 పరుగులు వెనుకబడి ఓవర్‌నైట్ స్కోరు 113/4తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. పట్టుదలగా ఆడిన మార్నస్ లబుషేన్ (173 బంతుల్లో 111; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో 11వ సెంచరీ పూర్తి చేసుకోగా, మిచెల్ మార్ష్ (31 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. వాన కారణంగా శనివారం మొత్తం 27 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా, ఆస్ట్రేలియా మరో 101 పరుగులు జత చేసింది. అయితే ఆసీస్ ఇంకా 61 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు మిగిలిన ఐదు వికెట్లతో మరికొన్ని పరుగులు సాధించడంతో పాటు వర్షం కూడా అంతరాయం కలిగిస్తే 'డ్రా'కు అవకాశం ఉంటుంది. అదే జరిగితే ఆస్ట్రేలియా 'యాషెస్'ను నిలబెట్టుకుంటుంది.

టైటిల్‌కు అడుగు దూరంలో...

- ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ
- కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్



యోసు (కొరియా): గత నెల ఇండోనేసియా ఓపెన్ టైటిల్ గెలుచుకున్న భారత డబుల్స్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి వరుసగా రెండో టైటిల్‌కు చేరువయ్యారు. కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి భారత జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకు జంట సాత్విక్–చిరాగ్ 21–15, 24–22తో రెండో సీడ్ లియాంగ్ వే కెంగ్– వాంగ్ చాంగ్ (చైనా) ద్వయంపై గెలుపొందింది. ప్రపంచ రెండో ర్యాంకులో ఉన్న చైనీస్ ప్రత్యర్థులపై భారత షట్లర్లకు ఇదే తొలి విజయం! గతంలో తలపడిన రెండు సార్లూ సాత్విక్–చిరాగ్‌లకు నిరాశే ఎదురైంది. తాజా సెమీస్‌లో భారత ద్వయం జోరుకు చైనీస్ జంటకు ఓటమి తప్పలేదు. వరుస గేముల్లో గెలిచినప్పటికీ మ్యాచ్ మాత్రం హోరాహోరీగా సాగింది. 3–3 నుంచి 5–5 ఇలా స్కోరు పోటాపోటీగా కదిలింది. సాత్విక్–చిరాగ్ 7–5 స్కోరు వద్ద ఆధిక్యంలోకి వచ్చినప్పటికీ చైనా స్టార్లు స్మాష్‌లతో మళ్లీ సమం చేశారు. అయితే నెట్ వద్ద లియాంగ్ అనవసర తప్పులు చేయడంతో భారత్ 14–8తో పూర్తిస్థాయి ఆధిపత్యాన్ని సంపాదించి తొలి గేమ్‌ను చేజిక్కించుకుంది. ఇక రెండో గేమ్‌లో పోటీ మరింత పెరిగింది. ఆరంభం నుంచి 2–2, 8–8 వద్ద వరుస విరామాల్లో స్కోర్లు సమం కావడంతో ఇరు జోడీలు పైచేయి సాధించేందుకు శ్రమించారు. సాత్విక్ స్మాష్‌లతో రెచ్చిపోయాడు. వరుస పాయింట్లతో 11–8తో ఆధిక్యంలోకి వచ్చిన భారత జోడీ దీన్ని 14–9తో పెంచుకుంది. కానీ లియాంగ్, వాంగ్ క్రాస్‌కోర్టు షాట్లకు పదునుపెట్టడంతో పోటాపోటీ మళ్లీ మొదటికొచ్చింది. ఇక్కడినుంచి ఆఖరి దశ దాకా హోరాహోరీ కొనసాగడంతో 20–20, 22–22 వద్ద స్కోర్లు సమమయ్యాయి. తర్వాత నాలుగోసారి దక్కిన మ్యాచ్ పాయింట్‌ను ఈ సారి ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా సాత్విక్ తెలివిగా స్మాష్‌లతో ముగించాడు. నేడు జరిగే తుదిపోరులో భారత జోడీ టాప్ సీడ్ ఫజర్ అల్ఫియాన్–ముహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) జంటతో తలపడుతుంది.

ఎంపికపై జోక్యం చేసుకోలేం: ఢిల్లీ హైకోర్టు

బజరంగ్, వినేశ్ ఆసియా క్రీడల వివాదం



అంతిమ్

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు సెలక్షన్స్‌నుంచి మినహాయింపునిస్తూ నేరుగా ఆసియా క్రీడలకు ఎంపిక చేయడంపై నమోదైన రిట్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ సుబ్రహ్మణ్యం ప్రసాద్ తీర్పునిచ్చారు. బజరంగ్, వినేశ్‌లను రెజ్లింగ్ సమాఖ్య అడ్‌హాక్ కమిటీ ట్రయల్స్ లేకుండానే ఆసియా క్రీడలకు ఎంపిక చేసింది. దీనిని సవాల్ చేస్తూ యువ రెజ్లర్లు అంతిమ్ పంఘాల్, సుజీత్ కల్కాల్ ఈ నెల 19న కోర్టును ఆశ్రయించారు.

సుప్రీం కోర్టుకు వెళతాం...

ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటలకే సెలక్షన్ ట్రయల్స్‌లో అంతిమ్ గెలిచింది. శనివారం నిర్వహించిన 53 కేజీల సెలక్షన్ ట్రయల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. అయితే ఇదే కేటగిరీలో వినేశ్‌ను ఇప్పటికే ఎంపిక చేయడంతో అంతిమ్ స్టాండ్‌బైగా మాత్రమే ఉండే అవకాశం ఉంది. కానీ తాను స్టాండ్‌బైగా కూర్చునేందుకు సిద్ధంగా లేనని ఆమె ప్రకటించింది. హైకోర్టులో ప్రతికూలంగా వచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో పోరాడతానని 19 ఏళ్ల పంఘాల్ తెలిపింది. 'కష్టపడి ట్రయల్స్ నెగ్గిన నేను ఎందుకు స్టాండ్‌బైగా ఉండాలి. దర్జాగా మినహాయింపు పొందినవారే కూర్చోవాలి' అని వినేశ్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించింది.

హామిల్టన్‌కు పోల్



బుడాపెస్ట్: హంగేరియన్ గ్రాండ్‌ప్రిలో లూయిస్ హామిల్టన్ పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో మెర్సిడెజ్ డ్రైవర్ హామిల్టన్ ల్యాప్‌ని అందరికంటే వేగంగా 1 ని.16.609 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో వరుసగా ఆరు రేసుల్లో పోల్ పొజిషన్ సాధిస్తూ వచ్చిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఇక్కడి సర్క్యూట్‌పై 0.003 సెకన్ల తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నేడు జరిగే ప్రధాన రేసులో హామిల్టన్ ఒకటో స్థానం నుంచి పోటీ మొదలుపెడతాడు. 2021లోనూ అతను ఇక్కడ పోల్ పొజిషన్‌లో నిలిచాడు.

భారత మహిళలకు చేజారిన విజయం

- బంగ్లాదేశ్‌తో మూడో వన్డే 'టై'
- 1–1తో సిరీస్ సమం



మిర్పూర్: బంగ్లాదేశ్ మహిళలతో చివరి వన్డేలో భారత మహిళల జట్టు విజయలక్ష్యం 226 పరుగులు...41.1 ఓవర్లలో స్కోరు 191/4...చేతిలో 6 వికెట్లతో మరో 53 బంతుల్లో 35 పరుగులే కావాలి. కానీ ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్లీన్ డియోల్ (108 బంతుల్లో 77; 9 ఫోర్లు), దీప్తి శర్మ (1) ఒకే ఓవర్లో రనౌటయ్యారు. 34 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లను కోల్పోయిన భారత్ స్కోరును సమం మాత్రమే చేయగలిగింది. చివర్లో 19 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన స్థితిలో కూడా లక్ష్యాన్ని అందుకోలేక మూడు బంతులు మిగిలి ఉండగానే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (45 బంతుల్లో 33 నాటౌట్) మరో ఎండ్‌లో ఉండగా...చివరి ఓవర్ మూడో బంతికి మేఘనా సింగ్‌ను మారుఫా అవుట్ చేసింది. దాంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. భారత్ 49.3 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ కాగా... అంతకు ముందు బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులే చేసింది. అప్పటికే నిర్ణీత సమయం దాటిపోవడంతో నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్ నిర్వహించలేదు. తొలి రెండు వన్డేల్లో ఇరు జట్లు ఒక్కోటి గెలవడంతో సిరీస్ 1–1తో 'డ్రా' అయింది.

భారత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (85 బంతుల్లో 59; 5 ఫోర్లు) రాణించింది. స్మృతి, హర్లీన్ మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (14; 2 ఫోర్లు) నిరాశపర్చడంతో పాటు స్వల్ప విరామంలో ఓవర్‌కు రెండు చొప్పున నాలుగు వికెట్లు కోల్పోవడం భారత్ గెలుపురాతను మార్చింది. అంతకు ముందు ఫర్జానా హక్ (160 బంతుల్లో 107; 7 ఫోర్లు), షమీమా సుల్తానా (78 బంతుల్లో 52; 5 ఫోర్లు) బంగ్లా స్కోరులో కీలక పాత్ర పోషించారు. బంగ్లాదేశ్ తరఫున మహిళల వన్డేల్లో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా ఫర్జానా నిలిచింది.

చివరి వన్డేలో అంపైరింగ్ ప్రమాణాలపై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇన్నింగ్స్ 34వ ఓవర్లో నాహిదా బౌలింగ్‌లో అవుటయ్యాక హర్మన్ తన బ్యాట్‌తో స్టంప్స్‌ను బలంగా కొట్టి అంపైర్‌తో వాగ్వాదానికి దిగింది. 'ఈ మ్యాచ్‌తో మేం చాలా నేర్చుకున్నాం. అంపైరింగ్ ప్రమాణాలను కూడా చూశాం. చాలా ఘోరంగా ఉంది. మేం మళ్లీ బంగ్లాదేశ్‌కు వచ్చినప్పుడు దాని కోసం కూడా సిద్ధమై రావాలేమో' అని హర్మన్ వ్యాఖ్యానించింది.

సినిమా

బాక్సాఫీస్ కలెక్షన్లు దండుకోవడానికి థియేటర్స్ స్టేషన్‌లో కొందరు స్టార్స్ పోలీసాఫీసర్స్‌గా చార్జ్ తీసుకోనున్నారు. కొందరు పోలీస్ యూనిఫామ్ వేసుకుని, సెట్స్‌లో లాఠీ తిప్పుతున్నారు. మరికొందరు కథలు విన్నారు.. యూనిఫామ్‌తో సెట్స్‌కి వెళ్లడానికి రెడీ అవుతున్నారు. ఇక ఆఫీసర్స్ ఆన్ డ్యూటీ వివరాలు తెలుసుకుందాం.



● రజనీకాంత్ ● ప్రభాస్ ● నాని



● గోపీచంద్

ఆఫీసర్స్ ఆన్ డ్యూటీ

మళ్లీ డ్యూటీ

'మూండ్రు ముగమ్' (1982), 'పాండియన్' (1992), హిందీలో 'హమ్' (1991), 'దర్బార్' (2020)... ఇలా ఇప్పటివరకూ రజనీకాంత్ ఏడెనిమిది చిత్రాల్లో పోలీసాఫీసర్‌గా నటించారు. మళ్లీ రజనీ పోలీస్‌గా చార్జ్ తీసుకోనున్నారట. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో ముస్లిమ్ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారని టాక్. సుభాస్కరన్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఇక ఆగస్టు 10న విడుదల కానున్న 'జైలర్' చిత్రంలో రజనీ జైలర్ పాత్రలో నటించిన విషయం తెలిసిందే.

పోలీస్ స్పిరిట్

పోలీసాఫీసర్‌గా ప్రభాస్ కటౌట్ స్క్రీన్‌పై సూపర్‌గా ఉంటుందని, సిల్వర్ స్క్రీన్‌పై ఖాకీ డ్రెస్ వేసిన ఫుల్ లెంగ్త్ పోలీసాఫీసర్ పాత్రలో ప్రభాస్‌ను చూడాలని ఆయన ఫ్యాన్స్ ఎప్పట్నుంచో ఆశపడుతున్నారు. వీరి ఆశ 'స్పిరిట్'తో తీరనుందనే టాక్ వినిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని తెలిసింది. భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా, క్రిషణ్ కుమార్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందట.

పుష్కర కాలం తర్వాత...

'శౌర్యం (2008)', 'గోలీమార్ (2010)' వంటి చిత్రాల్లో గోపీచంద్ పోలీస్‌గా సిల్వర్ స్క్రీన్‌పై డ్యూటీ చేశారు. పుష్కర కాలం తర్వాత గోపీచంద్ మళ్లీ పోలీస్‌గా లాఠీ పట్టారు. హర్ష తెరకెక్కిస్తున్న 'భీమా' చిత్రం కోసమే పోలీస్‌గా డ్యూటీ చేస్తున్నారు గోపీచంద్. కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.



● నితిన్ ● ఆది ● శ్రీకాంత్ ● జేడీ

ఆఫీసర్ అర్జున్

పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు నాని. 'హిట్' ఫ్రాంచైజీలో 'హిట్ 3' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'హిట్ 1'లో విశ్వక్‌సేన్, 'హిట్ 2'లో అడివి శేష్ పోలీసాఫీసర్స్‌గా నటించారు. 'హిట్ 3'లో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభమవుతుందట.

కొన్ని సన్నివేశాల్లో...

హీరో నితిన్ పోలీసాఫీసర్‌గా చార్జ్ తీసుకున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా' (ప్రచారంలో ఉన్న టైటిల్). శ్రీలీల హీరోయిన్. ఇందులో హీరోగా నటిస్తున్న నితిన్ కొన్ని సీన్స్‌లో పోలీస్‌గా కనిపిస్తారట.



● వరుణ్ సందేశ్



● జానీ

అమరన్.. ఇన్ ది సిటీ

'బ్లాక్', 'సీఎస్ఐ: సనాతన్' వంటి చిత్రాల్లో ఆది సాయికుమార్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా సిల్వర్ స్క్రీన్ క్రైమ్స్‌ను ఛేదించారు. తాజాగా 'అమరన్: ఇన్ ది సిటీ చాప్టర్ 1' చిత్రంలో ఆది సాయికుమార్ పోలీసాఫీసర్‌గా ఓ కేసును పరిశోధిస్తున్నారు. ఎస్. బాలేశ్వర్ దర్శకత్వంలో ఎస్‌వీఆర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ది కానిస్టేబుల్

'హ్యాపీ డేస్', 'కొత్త బంగారు లోకం', 'కుర్రాడు' వంటి సినిమాల్లో హీరోగా నటించిన వరుణ్ సందేశ్ తాజాగా పోలీస్ డ్రెస్ వేసుకున్నారు. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ కానిస్టేబుల్ పాత్ర చేస్తున్నారు. 'బలగం' జగదీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ ఏడాదే ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఎవరు?

హంతకులు ఎవరు? అనేది కనిపెట్టేందుకు జేడీ చక్రవర్తి ఓ స్కెచ్ వేశారు. పోలీసాఫీసర్‌గా జేడీ చక్రవర్తి వేసిన ఈ స్కెచ్ డీటైల్స్ 'హూ' సినిమాలో తెలుస్తాయి. జేడీ చక్రవర్తి నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రెడ్డమ్మ కె. బాలాజీ నిర్మించారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారు.

పోలీసులే ప్రధాన నిందితులైతే...

దోషులను పట్టుకునే పోలీసులే నిందులైతే ఏం జరుగుతుంది? అనే కథాంశంతో దర్శకుడు తేజా మార్ని ఓ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంలో శ్రీకాంత్, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలు పోషించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ చిత్రంలోని ముఖ్య తారలంతా పోలీసులుగా నటిస్తున్నారని తెలిసింది. 'ఖడ్గం' (2002), 'ఆపరేషన్ దుర్యోధన' (2007), 'టెర్రర్' (2016) వంటి సినిమాల్లో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించిన శ్రీకాంత్ ఈ చిత్రంలో ఓ డిఫరెంట్ పోలీస్‌గా కనిపిస్తారు. 'బన్నీ' వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

పోలీస్ రన్నర్

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'రన్నర్'. విజయ్ చౌదరిని దర్శకుడిగా పరిచయం చేస్తూ విజయ్ భాస్కర్, ఫణీంద్ర, ఎం. శ్రీహరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పోలీస్ నేపథ్యంలో తండ్రీ కొడుకుల అనుబంధంతో సాగే ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్రలో జానీ మాస్టర్ నటిస్తున్నారని తెలిసింది.

వీరే కాదు... మరికొందరు కూడా పోలీసాఫీసర్లుగా కనిపించడానికి రెడీ అవుతున్నారు.

డబ్బింగ్ డన్



● తమన్నా

'భోళా శంకర్'కు సొంత డబ్బింగ్ చెప్పారు తమన్నా. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. కాగా ఈ సినిమాలో తమన్నా డబ్బింగ్ వర్క్ పూర్తయింది. తన పాత్రకు తానే సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నారామె. అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

రీల్స్

నమ్మాను... ఆఫర్లు వచ్చాయి



● విజయ్

ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన చిత్రం 'బేబీ'. ఈ సినిమా రూ. 50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ మాట్లాడుతూ– ''బింబిసార' దర్శకుడు వశిష్ఠ ద్వారా సాయిరాజేష్ పరిచయం అయ్యారు. అలా 'బేబీ'కి సంగీతం ఇచ్చాను. 'బేబీ' విజయం సాధిస్తుందని నేను బలంగా నమ్మాను. అందుకే రెండున్నరేళ్లుగా ఏ ప్రాజెక్ట్ ఒప్పుకోలేదు. ఈ సినిమా పాటలు రిలీజ్ కాగానే చాలా ఆఫర్స్ వచ్చాయి'' అన్నారు.

అనుకున్నవన్నీ జరిగాయి - అశ్విన్



● నందిత, అశ్విన్

అశ్విన్‌బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన చిత్రం 'హిడింబ'. ఈ సినిమా ఈ నెల 20న విడుదలైంది. శనివారం థ్యాంక్స్ మీట్‌లో అశ్విన్ మాట్లాడుతూ– ''హిడింబ' విషయంలో మేం అనుకున్నవన్నీ జరిగాయి. డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీగా ఉన్నారు'' అన్నారు. ''రెండు రోజులకే రూ. 3 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసిందీ చిత్రం'' అన్నారు అనిల్ కన్నెగంటి. ''వర్షాలు కురుస్తున్నప్పటికీ ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు శ్రీధర్.

నమ్మకం నిజమైంది



● రాజేష్

శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. తాజాగా ఈ సినిమా రూ. 50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా రాజేష్ దండా మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నప్పుడే చాలా నవ్వుకున్నాం. ఈ కథలో యూనిక్ పాయింట్ ఉంది. అందుకే ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'గీత గోవిందం' వంటి సినిమాల తరహా స్క్రిప్ట్ 'సామజ వరగమన' అని మేం నమ్మాం. మా నమ్మకం నిజమైంది. ఈ సినిమాను సొంతంగా రిలీజ్ చేయడం లాభించింది. ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో రీమేక్ చేసే ఆలోచన ఉంది'' అన్నారు.

రాయలసీమ కథ



● రవితేజ, విషిక

హీరో నవదీప్ సమర్పణలో రవితేజ మహాదాస్యం, విషిక కోట జంటగా నటించిన చిత్రం 'నగిలేటి కథ'. రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వంలో నవదీప్ సమర్పణలో అశోక్ మిట్టపల్లి, దేవి ప్రసాద్ బలివాడ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ''రాయలసీమ ప్రాంతం నేపథ్యంలో ఒక గ్రామంలో జరిగే ఘటనలతో సాగే చిత్రం ఇది. రాయలసీమ నేటివిటీ, సంస్కృతీ సంప్రదాయాలతో వచ్చే సన్నివేశాలు సహజంగా ఉంటాయి. ఇందులో చికెన్ కూడా ఒక పాత్ర. ఈ నెల 31న ట్రైలర్ రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ప్రకాశం బ్యారేజ్ నుంచి కడలిలోకి..

మున్నేరు పరవళ్లతో కృష్ణాలోకి వరద నీరు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

సాక్షి, అమరావతి: ఖమ్మం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కృష్ణా ఉపనది మున్నేరు పరవళ్లు తొక్కుతోంది. మున్నేరు నుంచి కృష్ణా నదిలోకి వస్తున్న వరద ప్రవాహంలో శనివారం ప్రకాశం బ్యారేజ్‌లోకి 17,377 క్యూసెక్కులు చేరుతుండగా.. డెల్టాకు 7,087 క్యూసెక్కులను విడుదల చేశారు. మిగులుగా ఉన్న 10,290 క్యూసెక్కులను 14 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి కడలిలోకి వదిలేస్తున్నారు. ఇక పశ్చిమ కనుమల్లో వర్షాల ఉధృతి పెరగడంతో కృష్ణా నది ఎగువన వరద ప్రవాహం పెరుగుతోంది. ఆల్మట్టి డ్యామ్ లో నీటి నిల్వ 45.50 టీఎంసీలకు చేరుకుంది. ఇంకా 84 టీఎంసీలు వస్తే డ్యామ్ నిండుతుంది. తుంగభద్రలో వరద ఉధృతి కొంత పెరిగింది.

మూడు రోజులు విస్తారంగా వానలు



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం ఒడిశా-ఉత్తరాంధ్రకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రానున్న 3 రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. అదే సమయంలో గంటకు 30–40 కి.మీల వేగంతో బలమైన గాలులు కూడా వీస్తాయని తెలిపింది. అల్పపీడనం 2 రోజుల్లో వాయుగుండంగా బలపడనుందని ఐఎండీ తెలిపింది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మీదుగా అది పయనిస్తుందని అంచనా వేసింది.

సూక్ష్మ సేద్యం.. విస్తరణే లక్ష్యం

- 2022–23లో 2.26 లక్షల ఎకరాల్లో రూ.639 కోట్ల విలువైన పరికరాలు
- 2023–24లో రూ.902 కోట్లతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరణకు ఏర్పాట్లు
- పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టిన వ్యవసాయ శాఖ



పులివెందుల వద్ద పంపిణీకి సిద్ధం చేసిన బిందు, తుంపర పరికరాలతో కూడిన లారీలు

సాక్షి, అమరావతి: సూక్ష్మసేద్యాన్ని విస్తరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2022–23లో లక్ష్యానికి మించి తుంపర, బిందు సేద్య పరికరాలు అందించగా.. 2023–24లో రూ.902 కోట్లను వెచ్చించి కనీసం 2.5 లక్షల ఎకరాల్లో విస్తరణకు శ్రీకారం చుట్టింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా పరికరాల పంపిణీ ప్రారంభించింది.

లక్ష్యానికి మించి పంపిణీ

సూక్ష్మ సేద్యంలో దేశంలోనే మన రాష్ట్రం నాలుగో స్థానంలో ఉండగా.. టాప్–20 జిల్లాల్లో ఐదు జిల్లాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. ఇటీవలే నూరు శాతం బోర్ల కింద బిందు, తుంపర పరికరాలు అమర్చిన గ్రామంగా వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం ఈ.కొత్తపల్లి గ్రామానికి జాతీయ పురస్కారం దక్కించుకుంది. రాష్ట్రంలో 12.62 లక్షల మంది రైతులు 35.50 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం చేస్తుండగా, ఏటా 2.50 లక్షల ఎకరాల చొప్పున మరో 18.65 లక్షల ఎకరాల్లో విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.936 కోట్ల బకాయిలు చెల్లించడంతో రాష్ట్రంలో సూక్ష్మసేద్యం విస్తరణ వేగం పుంజుకుంది రాష్ట్రంలో 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 5–10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం, ప్రకాశం మినహా కోస్తా జిల్లాల్లో 5–12.5ఎకరాల్లోపు రైతులకు 50 శాతం రాయితీగా ప్రభుత్వం భరిస్తోంది. 2022–23లో 1.87 లక్షల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యం కాగా.. రికార్డు స్థాయిలో 82,289 మంది రైతులకు చెందిన 2.26 లక్షల ఎకరాల్లో విస్తరించారు. వీటికోసం రైతులు తమ వాటాగా రూ.174 కోట్లు చెల్లించగా, ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.465 కోట్లు భరించింది.

2023-24లో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరణ

2023–24లో రూ.902 కోట్ల అంచనా వ్యయంతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అంచనా మొత్తంలో రైతుల వాటా రూ.145 కోట్లు కాగా, సబ్సిడీ రూపంలో రూ.757 కోట్లు ప్రభుత్వం భరించనుంది. ఏప్రిల్ నుంచి ఆర్బీకేల ద్వారా రైతుల రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టి ఇప్పటివరకు 5.07లక్షల ఎకరాల్లో బిందు, తుంపర పరికరాల అమరిక కోసం 1.72 లక్షల మంది రైతులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. అవసరం ఉన్న వారికి అర్హత ఉంటే చాలు ఎలాంటి సిఫార్సులు లేకుండా క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హుల ఎంపిక చేపట్టారు. ప్రాథమిక పరిశీలనలో ఇప్పటివరకు 1.55 లక్షల ఎకరాల్లో సర్వే చేయగా.. 1.45 లక్షల ఎకరాల్లో ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు.

పండగ వాతావరణంలో పరికరాల పంపిణీ

45,255 ఎకరాల్లో ఏర్పాటు కోసం 16,630 మంది రైతులు తమ వాటా సొమ్మును చెల్లించారు. 10,556 మంది రైతులకు చెందిన 29,070 ఎకరాల్లో అమర్చేందుకు అవసరమైన బిందు, తుంపర పరికరాల పంపిణీకి శనివారం శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బిందు, తుంపర పరికరాల వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా రాయలసీమలోని పలు జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పరికరాల పంపిణీ పండుగ వాతావరణంలో ప్రారంభమైంది.

కొనసాగుతున్న గోదావరి వరద

- దిగువున తగ్గినా.. ఎగువున పెరిగిన ప్రవాహం
- భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన నీటిమట్టం



ధవళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/చింతూరు/ సాక్షిప్రతినిధి,ఏలూరు: గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం ఎగువన తెలంగాణలో వరద కొనసాగగా, దిగువన ఏపీలో తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 6 గంటలకు 6,33,474 క్యూసెక్కులు చేరుతుండగా.. 48 గేట్ల ద్వారా అంతే స్థాయిలో అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. నీటి మట్టం ప్రాజెక్టు స్పిల్ వేకు ఎగువన 32, దిగువన 23.5, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 32.7, దిగువ కాఫర్ డ్యామ్ వద్ద 23.07 మీటర్లుగా నమోదైంది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 8,68,285 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,100 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 8,56,185 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఎగువన తెలంగాణలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 1,57,496 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 56.94 టీఎంసీలకు చేరుకుంది. మరో 34 టీఎంసీలు చేరితే ప్రాజెక్టు నిండిపోతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 1,92,529 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో 20 గేట్లు ఎత్తేసి 2,55,320 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజ్ నుంచి 6,10,250 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజ్ నుంచి 8,79,450 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు భద్రాచలం, పోలవరం మీదుగా ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి కడలిలో కలవనున్నాయి. కాగా, శనివారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.80 అడుగులకు తగ్గింది. ఇక్కడ ఆదివారం వరద స్వల్పంగా పెరుగుతుంది.

భద్రాచలం వద్ద తగ్గుతూ.. పెరుగుతూ..

భద్రాచలం వద్ద శుక్రవారం నాటికి 44.30 అడుగులకు చేరిన నీటిమట్టం, శనివారం ఉదయానికి 39.4 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో మళ్లీ పెరగడం ప్రారంభమై శనివారం సాయంత్రానికి 40 అడుగులకు చేరుకుంది. విలీన మండలాలైన కూనవరం, వీఆర్‌పురంలో ప్రస్తుతం వరద ప్రభావం తగ్గుతున్నా తిరిగి పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ముంపు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి వరదనీరు రెండు అడుగుల మేర తగ్గింది. పశ్చిమగోదావరిలోని యలమంచిలి మండలం కనకాయలంకలో వరద పరిస్థితిని కలెక్టర్ పి.ప్రశాంతి పడవలో వెళ్లి పరిశీలించారు. అలాగే ఏలూరు జిల్లాలోని ముంపు మండలాల్లో వరద పరిస్థితిని నూజివీడు అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు.

రాజకీయ కోణంలో ప్రభుత్వ వార్తలు రాయడం తగదు

'వార్తాలాప్' మీడియా అవగాహన సదస్సులో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

నరసరావుపేట:ప్రభుత్వ కార్యకలాపాలను ఈర్ష్య, అసూయ, రాజకీయ కోణంలో చూసి వార్తలు రాయడం సరికాదని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో నరసరావుపేటలో నిర్వహించిన 'వార్తాలాప్' మీడియా అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. పరిశోధన, పరిశీలన చేసిన వార్తలను జర్నలిస్టులు పాఠకులకు అందిస్తున్నారా లేదా అనేది చూసుకోవాలన్నారు. ఒక వర్గం మీడియా ప్రభుత్వంపై కక్షతో, ద్వేషంతో వార్తలు రాయటం దారుణమన్నారు. వాస్తవిక దృక్పథంతో కూడిన వార్తలు రాయడం అవసరమన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలనాత్మకంగా రాయడం ద్వారా సరైన విధంగా అవి పేదలకు అందేందుకు సహకరించాలని సూచించారు. ఏఎన్‌యూ జర్నలిజం విభాగాధిపతి జి.అనిత



మాట్లాడుతూ.. లెక్కకు మించిన ప్రచార సాధనాలు, సోషల్ మీడియా చేరవేస్తున్న సమాచారాన్ని ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. తమకు అందిన సమాచారం సరైనదా కాదా అని సరిచూసుకుని వార్తలు రాయాలని కోరారు. వార్తలు రాసేవారు చెక్, క్రాస్ చెక్, కౌంటర్ చెక్ చేసుకోవాలని సూచించారు. సదస్సుకు పీఐబీ జాయింట్ డైరెక్టర్ జి.డిహల్లికేరి అధ్యక్షత వహించగా.. పీఐబీ జేడీ పి.రత్నాకర్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.హెప్సీరాణి పాల్గొన్నారు.

'ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు'

కొమ్మాది/బీచ్ రోడ్డు (విశాఖ): వరద ముంపు ప్రాంతాల్లో ఇబ్బందుల్లేకుండా సీఎం ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ భవన్‌లో శనివారం ఐటీడీఏ పీవోలతో ఆయన సమీక్షించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

అలరించిన గిరిజన ఉత్సవాలు

రాష్ట్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విశాఖ వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన గిరిజనోత్సవం అలరించింది.



ఉత్సవాన్ని రాజన్న దొర ప్రారంభించారు. వివిధ రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్న గిరిజన పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గిరిజనులు తయారు చేసిన వివిధ కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా...

ముగిసిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్

- 24, 25వ తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి రెండో విడత కౌన్సెలింగ్



వేంపల్లె: ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ శనివారం ముగిసిందని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. మొత్తం 1,086 మందికి గాను 904 మంది విద్యార్థులు మొదటి విడతలో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. మిగిలిన 182 సీట్లు రెండవ విడతలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఈ నెల 24, 25వ తేదీల్లో ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు.

పరిశ్రమల శాఖ కార్యదర్శిగా యువరాజ్

- పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇంతకాలం కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌లో ఉన్న ఎస్.యువరాజ్‌ను పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శితో పాటు ఇన్‌ఫ్రా–పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ మారిటైమ్ బోర్డు సీఎండీ, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ, ఏపీ ఇన్వెస్ట్ సీఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను యువరాజ్‌కు అప్పగించారు. ఇప్పటి వరకు ఈ అదనపు బాధ్యతలు కరికాల వలవన్ చూసేవారు. ప్రస్తుతం పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న కరికాల వలవన్‌ను రెవెన్యూ శాఖలోని దేవదాయధర్మాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవో, ప్రణాళికా శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శిగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ రాజీనామాను తక్షణం ఆమోదిస్తూ జవహర్ రెడ్డి మరో ఉత్తర్వులను జారీ చేశారు. ఆ శాఖల పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ ఎం.గిరిజా శంకర్‌కు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తండ్రి పేరు లేకున్నా బడిలో చేర్చుకోవాలి

- ప్రభుత్వానికి విముక్తి సంస్థ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్లకు చెందిన పిల్లలకు తండ్రి పేరుతో ప్రమేయం లేకుండా తల్లి పేరుతో అయినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వాలని విముక్తి సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విముక్తి సంస్థ అధ్యక్షురాలు పుష్పవతి, ప్రధాన కార్యదర్శి మౌనిక శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మానవ అక్రమ రవాణా బారి నుంచి బయటపడిన వారు, సెక్స్ వర్కర్ల పిల్లలకు పాఠశాలలో చేర్పించే విషయంలో అధికారులు పెడుతున్న షరతులు పిల్లల విద్యకు అడ్డంకి కాకూడదని పేర్కొన్నారు.

అమెరికాలో బియ్యం కొనేందుకు జనం ఎగబడుతున్నారు. సూపర్ మార్కెట్ల ఎదుట భారతీయులు బియ్యం కోసం బారులు తీరుతున్నారు. కొందరైతే కొన్ని నెలలకు సరిపడా బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. దీంతో సూపర్ మార్కెట్లు బియ్యం ధరలను అమాంతం పెంచేశాయి. ఇంతకీ అమెరికాలో ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే.. బాస్మతి రకం తప్ప మిగిలిన అన్నిరకాల బియ్యం ఎగుమతులపై గురువారం అర్ధరాత్రి నుంచి భారత ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది. దీంతో అమెరికాలో నివశించే భారతీయుల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది. రానున్న రోజుల్లో బియ్యం దొరకవేమో అనే భయంతో అక్కడి భారతీయులంతా సూపర్ మార్కెట్ల వైపు పరుగులు తీస్తున్నారు. ఎక్కడ బియ్యం దొరికితే అక్కడ ధర ఎంతైనా వెనుకాడకుండా ఎగరేసుకుపోతున్నారు. ఈ పరిస్థితి ఒక్క అమెరికాకే పరిమితం కాలేదు. మన బియ్యం దిగుమతులపై ఆధారపడిన సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్, కువైట్, సింగపూర్ తదితర దేశాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. - సాక్షి, అమరావతి



అమెరికాలోని సూపర్ మార్కెట్‌లో మనిషికి ఒకటే బ్యాగ్ అని పెట్టిన బోర్డు

యూఎస్.. నో రైస్!

- సూపర్ మార్కెట్ల ఎదుట బారులు తీరుతున్న భారతీయులు
- సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్, కువైట్, సింగపూర్ దేశాల్లోనూ ఇదే పరిస్థితి
- ఫర్నిచర్ కొంటే బియ్యం ఫ్రీ అంటూ ఆఫర్లు
- అమాంతం పెరిగిన ధరలు
- బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడమే కారణం

నిషేధం ఎందుకంటే..

రానున్న పండుగ సీజన్లను దృష్టిలో పెట్టుకుని భారతీయ మార్కెట్‌లో బియ్యం నిల్వలు తగినంతగా అందుబాటులో ఉంచడం, దేశీయ మార్కెట్‌లో ధరల పెరుగుదలను నియంత్రించడం కోసం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. 2022 సెప్టెంబర్ 8న బియ్యం ఎగుమతులపై భారత ప్రభుత్వం 20 శాతం పన్ను విధించింది. అయినప్పటికీ బియ్యం ఎగుమతులు ఆగకపోగా.. మరింత పెరిగాయి. భారత్‌లో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం వంటి కారణాల వల్ల గోధుమలు, బియ్యం దిగుబడి తగ్గింది. దీనివల్ల భవిష్యత్‌లో ఆహార సంక్షోభానికి దారితీసే అవకాశాలు ఉన్నాయన్న అంచనాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. అయితే, బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం) ఎగుమతులకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. నిషేధం జూలై 20వ తేదీ అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. అయితే, లోడింగ్‌లో ఉన్న నౌకలను ఎగుమతులకు అనుమతిస్తారు. భారత ప్రభుత్వం అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయంతో అమెరికా, గల్ఫ్, యూరప్ దేశాల్లో బియ్యానికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అమెరికాలో 10 కేజీల బ్యాగ్ ధర 15–20 డాలర్ల వరకు ఉండగా.. ప్రస్తుతం 40–50 డాలర్ల వరకు పలుకుతోందని చెబుతున్నారు. అంతర్జాతీయంగా చూస్తే బియ్యం ధరలు 11 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

బియ్యం ఎగుమతుల్లో 40 శాతం భారత్ నుంచే..

అమెరికాలో ప్రవాస భారతీయులు 44.60 లక్షల మంది, గల్ఫ్ దేశాల్లో 85.33 లక్షల మంది, యూరోపియన్ దేశాల్లో 20 లక్షల మంది ఉన్నారు. వీరంతా మన దేశంలో పండే సన్న బియ్యాన్ని ఇష్టంగా తింటారు. ప్రపంచంలో బియ్యం ఎగుమతుల్లో భారత్ వాటా 40 శాతానికి పైమాటే. వాటిలో 25 శాతం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులే. 2021–22లో రూ.45,652 కోట్ల విలువైన 1.73 కోట్ల టన్నులు బాస్మతీయేతర బియ్యం రకాలు ఎగుమతి కాగా.. 2022–23లో ఏకంగా రూ.51,089 కోట్ల విలువైన 1.78 కోట్ల టన్నులు ఎగుమతి అయ్యాయి. మొత్తం బియ్యం ఎగుమతుల్లో 74 లక్షల టన్నులు రా రైస్, 30 లక్షల టన్నులు బ్రోకెన్ రైస్, మరో 74 లక్షల టన్నులు బాయిల్డ్ రైస్ ఉంటాయి. ఏటా మన దేశం నుంచి 150 దేశాలు రా రైస్, బ్రోకెన్ రైస్‌ను, 20 దేశాలు బాయిల్డ్ రైస్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. బాయిల్డ్ రైస్‌ను బంగ్లాదేశ్, ఆఫ్రికన్ దేశాలు ఎక్కువగా దిగుమతి చేసుకుంటుండగా.. బీపీటీ రకాలైన సన్న బియ్యాన్ని ఎక్కువగా అమెరికా, గల్ఫ్ దేశాలు దిగుమతి చేసుకుంటాయి.

ఫర్నిచర్ కొంటే బియ్యం ఫ్రీ

బియ్యం కొరతను ఆసరా చేసుకుని అమెరికాలోని వ్యాపారులు రకరకాల ఆఫర్లు పెడుతున్నారు. డీఆర్ హోర్టన్ అనే అతిపెద్ద గృహ నిర్మాణ సంస్థ అమెరికాలోని 29 రాష్ట్రాల్లోని 90 మార్కెట్లలో అప్పటికప్పుడు స్పెషల్ ఆఫర్ ప్రకటించింది. 'మీకు సోనా మసూరి దొరకడం లేదా. మేం మీకు సహాయం చేస్తాం. మావద్ద హోమ్ ఫర్నీచర్ కొంటే.. 15 లీబ్రా (ఎల్‌బీ–0.45 కేజీలు)ల సోనా మసూరి బియ్యం ఉచితం' అంటూ ఆఫర్ మొదలెట్టేసింది.

ఎక్కడకు వెళ్లినా.. నో స్టాక్



భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అమెరికాలో నివసిస్తున్న భారతీయుల్లో ఒకింత ఆందోళన నెలకొంది. కనీసం 4–5 నెలల పాటు ఈ నిషేధం కొనసాగుతుందని చెబుతుండటంతో ముందుజాగ్రత్త చర్యగా బియ్యం కోసం ఇక్కడి భారతీయులు రైస్ స్టోర్స్‌కు క్యూ కడుతున్నారు. ఎక్కడకు వెళ్లినా నో స్టాక్ బోర్డులే కనిపిస్తున్నాయి. బ్యాగ్‌పై కనీసం 10 నుంచి 20 డాలర్లు అదనంగా వసూలు చేస్తున్నారు.
– మాగంటి ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ, కనెక్టికట్ రాష్ట్రం, యూఎస్ఏ

ప్రత్యేక కోడ్‌తో అనుమతించాలి



ఎగుమతులపై నిషేధం విధించడం వల్ల అమెరికాలోని వ్యాపారులు థాయ్‌లాండ్, వియత్నాం వైపు మళ్లే అవకాశం ఉంది. మన బాయిల్డ్ రైస్(5శాతం) టన్ను 421–428 డాలర్లకు లభిస్తుంటే.. వియత్నాం నుంచి 515–525 డాలర్లకు లభిస్తుంది. ఫలితంగా విదేశాల్లో బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక హెచ్ఎస్ఎన్ కోడ్ కింద సోనా మసూరి రకాలను మాత్రమే ఎగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతించాలి.
– బీవీ కృష్ణారావు, అధ్యక్షుడు, జాతీయ బియ్యం ఎగుమతిదారుల సంఘం

రైతులకు ఇబ్బంది ఉండదు



బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై కేంద్రం విధించిన నిషేధం రైతులపై ఎలాంటి ప్రభావం చూపదు. రబీ ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయిపోయాయి. ప్రస్తుతం రైతుల వద్ద ఎలాంటి ధాన్యం నిల్వలు లేవు. ఖరీఫ్ పంట చేతికి రావడానికి మరో 4 నెలలు పడుతుంది.
– ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు, రైస్ మిల్లర్ల సంఘం

ఆగస్టులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలు

- 9–15 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- 29, 30 తేదీల్లో ఢిల్లీ కర్తవ్య పథ్ వద్ద గ్రాండ్ ఫినాలే
- కేంద్ర కేబినెట్ కార్యదర్శి ఆదేశాలు

సాక్షి, అమరావతి : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకల్లో భాగంగా ఆగస్టు 9–15 తేదీల మధ్య 'మేరీ మిట్టి మేరా దేశ్' నినాదంతో దేశవ్యాప్తంగా 2.50 లక్షల గ్రామ పంచాయతీలు, 7,500 బ్లాకులు, 90 వేల మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. అదే నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ముగింపు వేడుకల గ్రాండ్ ఫినాలే నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. వీటి నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం ఆయన రాష్ట్రాల సీఎస్‌లతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఏపీ తరపున జవహర్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కీలక అంశాలపై కార్యక్రమాలు..

- ఆయా గ్రామాలు, పట్టణాల నుంచి దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ దళాల విశ్రాంత సిబ్బంది, కేంద్ర ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, రాష్ట్ర పోలీసు దళాలకు చెందిన వారికి సంఘీభావాన్ని తెలియజేయాలి.
- వివిధ తాగునీటి వనరుల వద్ద శిలాఫలకాలను ఏర్పాటుచేయాలి. జాతీయ జెండా ఆవిష్కరణ, జాతీయ గీతాలాపన చేయాలి.
- ప్రతి పంచాయతీలో వసుధ వందన్ కింద కనీసం 75 మొక్కలను నాటాలి.
- అలాగే, వీరన్ కా వందన్ కింద స్వాతంత్ర్య సమరయోధులు, అమర వీర సైనిక కుటుంబాలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలి.

యువత సంకల్పం అత్యంత బలమైంది

- ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



వెటర్నరీ వర్సిటీ ప్రతినిధులు, పాలక మండలి సభ్యులతో గవర్నర్

తిరుపతి ఎడ్యుకేషన్: నేటి యువతే రేపటి దేశం. యువతకు మించిన గొప్ప శక్తి లేదు. యువత సంకల్పం అన్నింటి కన్నా బలమైనదని గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం(ఎస్వీ వెటర్నిటీ వర్సిటీ) 12వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. చాన్సలర్ హోదాలో గవర్నర్ హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఆ యువత సరైన దిశలో గమ్యం వైపు పయనిస్తే బలమైన భారత్‌గా ఎదుగుతుందన్నారు. పశుపోషణ, పాడి పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో పాల ఉత్పత్తిని పెంచడంలో, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. అమూల్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుని గ్రామీణ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శ్రీవారి నైవేద్యాలకు, భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీతో పాటు అన్ని అవసరాలకు సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయడం శుభసూచకమన్నారు. రైతులు సహజసిద్ధమైన ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించేలా వారిని ప్రోత్సహించేందుకు ఎద్దులు, ఆవులను విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే దేశీయ గోజాతులను రక్షించేందుకు టీటీడీ తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. గురువుల మార్గనిర్దేశంలో క్రమశిక్షణతో విద్యనభ్యసించిన వెటర్నరీ విద్యార్థులు పశువైద్య నీతి సూత్రాలకు అనుగుణంగా ముందుకు సాగుతూ దేశం గర్వించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ దినదినాభివృద్ధి చెందుతూ ఈ ఏడాదికి ప్రకటించిన ర్యాంకింగ్‌లో తన స్థానాన్ని మెరుగుపరచుకుని 31వ స్థానంలో నిలవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 35 బంగారు పతకాలు, రెండు రజతం, ఒకరికి నగదు బహుమతిని అందించారు. కేరళ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎంఆర్ శశీంద్రనాథ్, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ వి.పద్మనాభరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి పాల్గొన్నారు.

ఐదేళ్లలో పేదలే ధనవంతులు



కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు, ఎమ్మెల్సీలు

- అది చూసి చంద్రబాబు కుళ్లికుళ్లి బాధపడడం ఖాయం
- రాజధానిలో పేదలు ఉండకూడదన్నదే బాబు కోరిక
- రైతుల ముసుగులో టీడీపీ నేతలతో కోర్టులో కేసులు వేయించారు
- అయినా పేదల ఇళ్లు నిర్మించాలని సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారు
- 6 నెలల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించడంతో రానున్న ఐదేళ్లలో పేదలు ధనవంతులు కావడం ఖాయమని, దీంతో టీవీ–5, ఏబీఎన్, ఈనాడు అధినేతలు ఏడవడం, చంద్రబాబు కుళ్లి కుళ్లి చావడం ఖాయమని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన శనివారం గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజధానిలో పేదలు ఉండకూడదని, సంపన్న వర్గాలు మాత్రమే ఉండాలని చంద్రబాబు కోరుకున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని చెప్పారు. రాజధాని ప్రాంతం జీవం లేకుండా ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని చూసినా చంద్రబాబు రైతుల ముసుగులో కోర్టులను ఆశ్రయించి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అయినా రాజధానిలో అన్ని వర్గాలు ఉండాలని సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని, 50 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఆరు నెలల్లో ఇక్కడ 25 ఊర్లు, 50 వేలకు పైగా నివాసాలు, రెండు లక్షలకు పైగా జనాభా వస్తుందని తెలిపారు. రాజధానిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని, ఇది వారి స్వర్గమని, వారి సామాజిక వర్గం మాత్రమే ఉండాలని చంద్రబాబు, ఒక వర్గం మీడియా సుప్రీంకోర్టు దాకా వెళ్లారని, కోట్ల రూపాయలు న్యాయవాదులకు ఫీజులు కట్టారని, వారి నగ్న స్వరూపాన్ని ఇది బట్టబయలు చేసిందని తెలిపారు. సీఎం జగన్ ఎప్పుడూ పేదల పక్షాన పోరాటం చేసి అన్ని సౌకర్యాలతో అమరావతిలో ఇళ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. రాజధానిలో రైతులు లేరని, చంద్రబాబు, ఆయన అనుచరులు భూములు కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈనెల 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇక్కడ పేదల ఇళ్లకు శంకుస్థాపన జరుగుతుందని, అప్పుడు రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటుంటే రామోజీరావు పడుకోవడం, చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ–5 గుక్కపట్టి ఏడవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవర ప్రసాద్, కల్పలతారెడ్డి, జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అవి సాధారణ మరణాలే

- నెల్లూరు పెద్దాస్పత్రిలో ఆరుగురి మృతిపై అధికారుల నిర్ధారణ
- ఆక్సిజన్ సరఫరా లోపం వల్లేనని ఓ వర్గం మీడియా హడావుడి
- విచారించిన డీఎంహెచ్‌వో, జిల్లా కలెక్టర్
- ఆస్పత్రి సేవల్లో ఎలాంటి లోపం లేదని వెల్లడి



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందిని విచారించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ హరినారాయణన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న వారిలో పరిస్థితి విషమించడం వల్లే శుక్రవారం ఆరుగురు మృతి చెందారని సూపరింటెండెంట్ సిద్ధానాయక్, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ రామచంద్రరావు స్పష్టం చేశారు. అయితే ఆక్సిజన్ అందకపోవడం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందారంటూ ఓ వర్గం మీడియా ప్రచారం చేయడం సరికాదన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా నిరంతరంగా ఉంటుందని తెలిపారు. గూడూరుకు చెందిన కె.సాంబయ్య (55), నెల్లూరుకు చెందిన ఎస్.లలిత ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో, విపరీతంగా మద్యం అలవాటున్న నరుకూరుకు చెందిన పి.రమేష్ (42), నెల్లూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్.చలపతి (52) క్లోమ గ్రంధి పాడవ్వడంతో మృతి చెందారని తెలిపారు. నెల్లూరులోని వేదాయపాలెంకు చెందిన సుందరం (70), నెల్లూరులోని పొర్లుకట్టకు చెందిన కె.చెంచమ్మ (70) గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ కోలుకోలేక చనిపోయారన్నారు. ఐదారు రోజులుగా చికిత్స పొందుతున్న వీరంతా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేర్వేరు సమయాల్లో మృతి చెందారనే విషయాన్ని గమనించాలన్నారు. ఆరుగురు కూడా దీర్ఘకాలిక రోగులని, ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఘటనపై జిల్లా వైద్యాధికారి పెంచలయ్య విచారణ చేపట్టారు. శనివారం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి వైద్య సేవలు బాగున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ కూడా ఎంఐసీయూ వార్డును పరిశీలించారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. ఆక్సిజన్ ట్యాంకును, పైపులను టెక్నీషియన్ ద్వారా పరిశీలించారు. ఆస్పత్రి సేవల్లో ఎక్కడా లోపం లేదని చెప్పారు.

అరుణాచలం టు త్రివేండ్రమ్

- భారత్ గౌరవ్ రైలు మూడో సర్క్యూట్ ప్రకటన
- 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర' పేరుతో ఐఆర్‌సీటీసీ సిద్ధం
- 7 ప్రాంతాలు.. 9 రోజులు
- ఆగస్టు 9, 23, సెప్టెంబర్ 5వ తేదీల్లో టూర్లకు బుకింగ్స్ ప్రారంభం

ఛార్జీలు ఇలా..

ఎకానమీ (నాన్ ఏసీ): పెద్దలకు రూ. 14,300, 5–11 ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు రూ.13,300
స్టాండర్డ్ క్లాస్ (ఏసీ): పెద్దలకు రూ. 21,900, పిల్లలకు రూ.20,800
కంఫర్ట్ క్లాస్ (సెకండ్ ఏసీ): పెద్దలకు రూ.28,500, పిల్లలకు రూ.27,100

- ఎకానమీ టికెట్ ఉన్న వారికి బస కోసం హోటళ్లలో నాన్ ఏసీ గది కేటాయిస్తారు. స్టాండర్డ్ టికెట్ వారికి ఏసీ షేరింగ్ రూమ్ ఇస్తారు. కంఫర్ట్ క్లాస్ వారికి ఏసీ వ్యక్తిగత గది కేటాయిస్తారు.
- తెలంగాణ, ఏపీలలో పది హాల్టులుంటాయి. సికింద్రాబాద్‌లో బయలుదేరే రైలు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతుంది. ఆయా స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కి..దిగొచ్చు.

సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రైల్వే శాఖ ప్రారంభించిన భారత్ గౌరవ్ పర్యాటక రైలు మరో కొత్త సర్క్యూట్‌తో ముందుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వేకు ఇటీవలే ఇలాంటి రైలును కేటాయించి రెండు సర్క్యూట్ యాత్రలు ప్రారంభించిన ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తాజాగా 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర' సదరన్ సర్క్యూట్‌ను శనివారం ప్రకటించింది. ఇది తమిళనాడు, కేరళల్లోని ప్రధాన పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం కల్పించనుంది. ఈ కొత్త సర్క్యూట్‌లో మొత్తం ఏడు పర్యాటక ప్రాంతాలను చేర్చారు. అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచిరాపల్లి (తిరుచ్చి), త్రివేండ్రమ్ ప్రాంతాలను ఈ టూర్‌లో చుట్టేయచ్చు. ఆయా ప్రాంతాల్లోని నిర్ధారిత పర్యాటక ప్రాంతాలను చూపుతారు. ఈ అన్ని ప్రాంతాలను చుట్టి వచ్చేందుకు తొమ్మిది (ఎనిమిది రాత్రులు) రోజుల సమయం పట్టనుంది. రైలు మార్గం ఉన్న ప్రాంతాలకు రైలు ద్వారా, మిగతా ప్రాంతాలకు రోడ్డు మార్గం ద్వారా పర్యాటకులను తీసుకెళ్తారు. ఇందుకు అవసరమయ్యే బస, టీ, అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం వసతి పూర్తిగా ఐఆర్‌సీటీసీనే కల్పిస్తుంది. ఖర్చులన్నీ ప్యాకేజీ ఛార్జిలోనే సర్దుబాటు చేస్తారు. ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పిస్తామని, రైలులో నిరంతర పర్యవేక్షణకు సీసీటీవీలను ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని, ప్రయాణ బీమా ఉంటుందని పేర్కొన్నారు.

తొలిరోజే 300 టికెట్ల అమ్మకం..

ఈ యాత్రకు సంబంధించి మూడు ట్రిప్పుల తేదీలను ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. ఆగస్టు 9, 23, సెప్టెంబర్ 5 తేదీలకు సంబంధించి బుకింగ్స్ ప్రారంభించింది. తొలిరోజే 300 టికెట్లు అమ్ముడైనట్టు తెలిసింది.

సర్క్యూట్‌లు మూడు.. రైలు ఒకటే..

దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి ఇప్పటికే భారత్ గౌరవ్ రైలు రెండు సర్క్యూట్‌లను చుట్టేస్తోంది. వైష్ణోదేవి మందిరం ఒక సర్క్యూట్‌గా, పూరి–కాశీ–అయోధ్య రెండో సర్క్యూట్‌గా పర్యటనలు జరుపుతున్న విషయం తెలిసిందే. వీటికి మంచి ఆదరణ లభించింది. ఇందులో పూరి–కాశీ–అయోధ్య సర్క్యూట్‌కు ప్రయాణికుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఇప్పటికే 8 ట్రిప్పులు నిర్వహించారు. తొమ్మిదో ట్రిప్పునకు కూడా డిమాండ్ రావటంతో జూలై 26వ తేదీని ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. ఆ రోజు ఆ యాత్ర ప్రారంభం అవుతుంది. ఇప్పటికి మూడు సర్క్యూట్ యాత్రలు ప్రకటించగా.. అన్నింటికి ఒకే రైలు తిరుగుతుండటం విశేషం. దక్షిణ మధ్య రైల్వేకు ఒక రైలు కేటాయించగా, అదే రైలు ఈ మూడు సర్క్యూట్‌లకు అందుబాటులో ఉండటం విశేషం. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ఉన్న ఈ రైలులో వసతులు మెరుగ్గా ఉన్నాయని పర్యాటకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భారీ డిమాండ్..

రైలు, రోడ్డు మార్గ ప్రయాణ ఏర్పాట్లు, బస, భోజన వసతి పూర్తిగా ఐఆర్‌సీటీసీనే ఏర్పాటు చేస్తుండటంతో ఈ ప్యాకేజీలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు అన్ని ట్రిప్పుల్లో పూర్తి ఆక్యుపెన్సీ ఉండగా, కొత్త సర్క్యూట్ ప్రకటించిన మొదటి రోజు నుంచే మంచి డిమాండ్‌తో టికెట్లు అమ్ముడవుతుండటం విశేషం.

పెన్‌గంగలో చిక్కుకుని... గంటసేపు బిక్కుబిక్కు..

- పడవ నడిపే వ్యక్తిని కాపాడిన స్థానికులు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

తాంసి: పెన్‌గంగ నదిలో నాటుపడవ ద్వారా రోజూ ప్రయాణికులను ఇరువైపులా ఒడ్డుకు సురక్షితంగా చేరుస్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా పెరిగిన నది ఉధృతిలో చిక్కుకున్నాడు. గంటకుపైగా బిక్కుబిక్కుమంటూ ప్రవాహంలోనే గడిపాడు. స్థానిక యువకులు సాహసించి నదిలోకి దిగి అతడిని రక్షించారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. తాంసి మండలం వడూర్ గ్రామానికి చెందిన రావుల దాద్దీప పెన్‌గంగలో నాటుపడవ నడిపిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ప్రయాణికులను వడూర్–మహారాష్ట్ర వైపు ఉన్న నదీతీరాలకు చేరుస్తుంటాడు. అయితే శనివారం కురిసిన భారీవర్షానికి పెన్‌గంగ ప్రవాహం పెరిగింది. నదిలో ఉన్న పడవను బయటకు తీయడానికి దాద్దీప, స్నేహితులు అగు కుశల్, రేండ్ల శ్రీను ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది. పడవలోనే ఉండిపోయిన ఈ ముగ్గురు ఒడ్డుకు చేరే మార్గం కానరాక భయాందోళన చెందారు. హాహాకారాలు చేయడంతో స్థానిక యువకులు గమనించి వెంటనే నదిలోకి దిగి ఈదుకుంటూ వెళ్లి కుశల్, శ్రీనును బయటకు తీసుకువచ్చారు. అయితే దాద్దీప పడవలోనే కొంతదూరం కొట్టుకుపోయి ఓ చోట చెట్ల కొమ్మలను పట్టుకున్నాడు. గంటకుపైగా బిక్కుబిక్కుమంటూ నదినీటిలోనే గడిపాడు. సమాచారం అందుకున్న భీంపూర్ ఎస్సై రాధిక అక్కడికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. గంగపుత్రులు, స్థానిక యువకులు టైర్లు, తాళ్ల సాయంతో అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 23 : జూలై : 2023



శనివారం హంపీ వద్ద అంజనాద్రి బెట్టపై భక్తుల రద్దీ. శ్రావణ శనివారం కావడంతో తరలివచ్చారు

డ్రైవర్ లేకుండా మెట్రో రైలు

వాహనం నడపాలంటే డ్రైవర్లు తప్పనిసరి. కానీ ఆధునిక సాంకేతికత డ్రైవర్ల అవసరం లేకుండా ప్రయాణికులను గమ్యస్థానం చేరుస్తోంది. పాశ్చాత్య దేశాలలో డ్రైవర్‌లెస్ కార్లు ఇప్పటికే ప్రాచుర్యం పొందాయి. అలాగే ఐటీ సిటీలో డ్రైవర్లతో నిమిత్తం లేకుండా మెట్రో రైళ్లు పరుగులు తీయబోతున్నాయి. కంట్రోల్ రూం నుంచి రైలు గమనాన్ని పర్యవేక్షిస్తారు. డ్రైవర్లకు అనారోగ్యం, సమ్మె వంటి సమస్యలతో ఇబ్బంది ఉండదు.

- ఏడాది ఆఖరి నుంచి అమలు
- మెట్రో సంస్థ సన్నాహాలు
- కొత్తగా సీబీటీసీ సాంకేతికత ఏర్పాటు


పర్పుల్ లైన్‌లో మొదట డ్రైవర్ రహిత మెట్రోలు పరుగులు తీస్తాయి

బనశంకరి: బెంగళూరులో డ్రైవర్‌లు లేకుండానే మెట్రో రైళ్లు దూసుకుపోనున్నాయి. ఈ ఏడాది చివరిలో ప్రారంభిస్తున్నట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. దీనికి కావలసిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 2020 డిసెంబరులో దేశ రాజధాని ఢిల్లీలో డ్రైవర్ రహిత మెట్రో రైలును ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. తరువాత దేశ ఆర్థిక రాజధాని ముంబై లో డ్రైవర్‌లెస్ మెట్రో రైళ్లు వచ్చాయి. ఆగస్టులో తమిళనాడు రాజధాని చెన్నైలో అమలులోకి రానుంది. ఇప్పుడు ఐటీ సిటీలో శ్రీకారం చుట్టబోతున్నారు.

ఆర్‌వీ రోడ్డు- బొమ్మసంద్ర మార్గంలో

19 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ గా ఉన్న గులాబీ లైన్‌లో (ఆర్‌వీ రోడ్డు- బొమ్మసంద్ర) ఈ ఏడాది చివరిలో ప్రారంభం కానుంది. నిజానికి గత ఏడాది పూర్తి కావలసి ఉంది. కానీ కోవిడ్ కారణంగా పనులు ఆలస్యం కావడంతో ఈ ఏడాది చివరిలో ప్రారంభించే కారిడార్‌లో డ్రైవర్ రహిత మెట్రో నడపడానికి బీఎంఆర్‌సీఎల్ సన్నాహాలు చేస్తోంది. సీబీటీసీ సిగ్నలింగ్ ఆధారంగా డ్రైవర్లు లేకుండా ఈ రైళ్లు పరుగులు తీస్తాయని మెట్రో వర్గాలు తెలిపాయి.

ఇంటర్‌చేంజ్‌గా సిల్క్‌బోర్డు స్టేషన్

నమ్మ మెట్రో గులాబీ మార్గం నిర్మాణదశలో ఉండగా దీని పొడవు 18.82 కిలోమీటర్లు. ఈ మార్గాన్ని ఆర్‌వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర కు అనుసంధానిస్తారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్ కాగా 16 స్టేషన్లు కలిగి ఉంది. ఆర్‌వీ రోడ్డు స్టేషన్ టెర్మినల్ స్టేషన్ కాగా గ్రీన్ లైన్‌తో ఇంటర్ చేంజ్ కల్పిస్తారు. సిల్క్‌బోర్డు స్టేషన్ గులాబీలైన్, నీలి లైన్ మధ్య మరో ఇంటర్ చేంజ్ స్టేషన్ కానుంది. గులాబీ లైన్‌ను మొదట్లో బొమ్మసంద్ర వరకు ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇప్పుడు బొమ్మసంద్ర నుంచి తమిళనాడులోని హోసూరు పట్టణం వరకు విస్తరించడానికి కర్ణాటక ప్రభుత్వం ఆమోదం తెలిపింది.


ఢిల్లీ, ముంబైలో ఇప్పటికే డ్రైవర్లు లేకుండా మెట్రో రైళ్లు సంచరిస్తున్నాయి

ఎలా పనిచేస్తాయంటే

- డ్రైవర్ రహిత రైళ్లను నడపడానికి మెట్రో రైల్వేలో సాంకేతికంగా మార్పులు చేశారు. ఆధునిక సీబీటీసీ సిగ్నలింగ్ వ్యవస్థలను అమర్చారు. ఇది రైళ్లు స్వయంచాలితంగా సంచరించడానికి సహాయపడుతుంది.
- గులాబీ (పర్పుల్) లైన్‌కు సీబీటీసీ సాంకేతికతను అమర్చారు. ఎలక్ట్రానిక్ సిటీ, గొట్టిగెరె, నాగవార, సిల్క్‌బోర్డు, కెంపేగౌడ విమానాశ్రయం లాంటి కొత్త మార్గాల్లో సీబీటీసీ వ్యవస్థను అమర్చుతారు.
- డ్రైవర్ రహిత మెట్రోరైలులో డ్రైవర్ ఉండరు, ఒక అటెండర్ మాత్రం ఉంటారు, అత్యవసరం అనుకుంటే అటెండర్ డ్రైవింగ్‌ను తీసుకుంటారు. డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడేళ్లు సంచరిస్తే ఆ అటెండర్ అవసరం కూడా ఉండదని మెట్రో అధికారులు తెలిపారు.
- ప్రతి రైలును కంట్రోల్ రూమ్ కేంద్రాల ద్వారా పర్యవేక్షిస్తారు.

న్యూస్‌రీల్

దొంగ మేనేజర్

- రైతుల డబ్బు రూ.1.88 కోట్లు బదిలీ


మేనేజర్ గణేశ్

దొడ్డబళ్లాపురం: బ్యాంకును సక్రమంగా నిర్వహించాల్సిన మేనేజరే దొంగ అవతారమెత్తి దోచుకున్నాడు. దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణలో కర్ణాటక గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్ గణేశ్ రూ.1.88 కోట్లు కొట్టేసి దొరికిపోయాడు. వివరాలు.. చెన్నరాయపట్టణ చుట్టుపక్కల ఇటీవల కేఐఏడీబీ స్వాధీనం చేసుకున్న భూముల రైతులకు నష్టపరిహారాన్ని ఈ బ్యాంకులోనే జమ చేసింది. ఆరు మంది రైతులకు చెందిన పరిహారం రూ.1.88 కోట్లను మేనేజర్ గణేశ్ ఆర్‌టీజీఎస్ ద్వారా వేరే అకౌంట్‌లోకి జమ చేసుకున్నాడు. ఇందుకు బ్యాంకు ఉద్యోగి జితేంద్రకుమార్ కూడా మేనేజర్‌కు సహకరించాడు. జూన్ 3 నుంచి జూలై 13 వరకూ ఆర్టీజీఎస్ ద్వారా పలు దఫాలుగా మొత్తాన్ని బదిలీ చేసుకున్నారు. ఇది రైతుల ద్వారా ఉన్నతాధికారులకు తెలియడంతో ఇద్దరినీ సస్పెండ్ చేశారు. బాధిత రైతులకు మొత్తాన్ని తిరిగి ఇస్తామని కొత్త మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. చెన్నరాయపట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

టమాటా తోటకు సీసీ కెమెరాలు



మైసూరు: ప్రస్తుతం రాష్ట్రంలోనే కాదు దేశంలోను, విదేశాల్లోనూ టమాటకు భారీ ధర ఉంది. కేజీ వంద రూపాయల దాకా ఉండడంతో రైతులకు కనకవర్షం కురుస్తోంది. కానీ దొంగలు రాత్రిపూట పంటను ఎత్తుకెళ్లడం అక్కడక్కడ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భద్రత కోసం రైతులు రకరకాల ఉపాయాలను అనుసరిస్తున్నారు. మైసూరు జిల్లా హుణసూరు తాలూకాలోని కుప్పె గ్రామంలో నాగేష్, కృష్ణ అనే ఇద్దరు రైతులు తమ టమాటా తోటలకు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. నాగేష 10, కృష్ణ 4 ఎకరాలలో టమాటా పంటను సాగు చేశారు. ధర ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే రెండుసార్లు తోటల్లో దొంగలు పడి ఎత్తుకుపోయినట్లు రైతులు వాపోయారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ దొంగలను అడ్డుకుంటామని రైతులు చెబుతున్నారు.

మేలుకోటెలో తిరువాడప్పోరం వేడుకలు


ఆదిశేషుని వాహనంపై కళ్యాణ నాయకి అమ్మవారు

మండ్య: మండ్య జిల్లా మేలుకోటెలో వెలిసిన శ్రీ చెలువనారాయణ స్వామి వారి ఆలయంలో శనివారం మహాలక్ష్మీ అమ్మవారి తిరువాడప్పోరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే వేలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మహాలక్ష్మీ ఆండాళ్ రూపంలో భూమిపై అవతరించిన రోజుగా అమ్మవారికి శనివారం తిరువాడిప్పోరం నిర్వహించారు.

ఇన్నోవాను ఢీకొన్న టిప్పర్

- హాసన్ జిల్లాలో నలుగురు దుర్మరణం


నుజ్జయిన కారు

యశవంతపుర: హాసన్ జిల్లా ఆలూరు తాలూకా ఈశ్వరహళ్లి కొడిగె వద్ద శుక్రవారం సాయంత్రం టిప్పర్ లారీ- ఇన్నోవా కారును ఢీకొంది. ఇన్నోవాలోని నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. హాసన్ తాలూకా కుప్పళి గ్రామానికి చెందిన చేతన్ (24), గుట్టేనహళ్లికి చెందిన అశోక్ (35), తట్టెకెరెవాసి పురుషోత్తమ (28), చిగళూరువాసి దినేశ్ (30)లు మృతులు. సకలేశపుర నుంచి హాసన్‌కు ఇన్నోవా కారులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్‌లారీ వేగంగా ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు కాగా నలుగురూ తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు క్షతగాత్రులు హాసన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలాన్ని ఎస్పీ హరిరాం శంకర్ పరిశీలించారు. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

విమానాలకు ఆటంకం

బనశంకరి: ప్రతికూల వాతావరణం వల్ల శనివారం మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాల ల్యాండింగ్‌కు ఆటంకం ఏర్పడింది. బెంగళూరు నుంచి మంగళూరుకు వచ్చిన విమానం మేఘావృతం, పెనుగాలుల వల్ల దిగడానికి ఆస్కారం లేకపోవడంతో దగ్గరిలోని కణ్ణూరుకు మళ్లించారు. అక్కడ దిగిన విమానం మంగళూరులో వాతావరణం చక్కబడ్డాక తిరిగి వచ్చి ల్యాండయింది. ముంబై నుంచి మరో విమానానికి కూడా అదే పరిస్థితి ఎదురైంది.

బహిష్కరణ నోటీసులపై ఆక్రోశం


నోటీసులు వచ్చిన భజరంగదళ్ కార్యకర్తలు

యశవంతపుర: మంగళూరుకు చెందిన ముగ్గురు భజరంగ్‌దళ్ కార్యకర్తలకు బహిష్కరణ నోటీసులు ఇవ్వడంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక ధోరణలు అవలంభిస్తోందని మండిపడుతున్నారు. ఇటీవల మంగళూరు సుల్తాన్ జ్యువెలరీ కార్యక్రమంలో బాలచంద్ర అత్తావర, గణేశ్ అత్తావర, జయప్రకాశ్ శక్తినగరలు పదే పదే శాంతిభద్రతలకు విఘాతం కలిస్తున్నారు. దీంతో పోలీసులు మిమ్మలను ఎందుకు బహిష్కరించకూడదో చెప్పాలని నోటీసులు ఇచ్చారు. బహిష్కరణ విషయాన్ని మంగళూరు కమిషనర్ కులదీప్‌కుమార్ జైన్ సమర్థించుకున్నారు. నోటీసులు తీసుకున్న వ్యక్తులు ఎవరనేది తమకు ముఖ్యం కాదని, శాంతిభద్రతలే ముఖ్యమన్నారు. అయితే గోవధ నిషేధ చట్టాన్ని పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు హిందూపర సంఘాలు మండిపడ్డాయి.

ఎస్ఐ ఉద్యోగాల స్కాంపై న్యాయ విచారణ

- కాంగ్రెస్ సర్కారు ఆదేశం
- హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ వీరప్పకు బాధ్యతలు





శివాజీనగర: గత బీజేపీ సర్కారు హయాంలో దేశమంతటా సంచలనం సృష్టించిన 545 పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ల (ఎస్ఐ) పోస్టుల రాతపరీక్షలో జరిగిన కుంభకోణంపై సిద్దరామయ్య ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ బీ.వీరప్ప నేతృత్వంలో న్యాయ కమిషన్‌ను ఇందు కోసం నియమించారు. జస్టిస్ వీరప్ప కొన్నినెలల కిందటే రిటైరయ్యారు. ఏసీబీని రద్దు చేసి, లోకాయుక్తను పునః ప్రారంభించాలని వేసిన వ్యాజ్యాలను ఆయనే విచారించారు. ఈ స్కాంలో ఏం జరిగిందో విచారణను పూర్తిచేసి మూడు నెలల్లో నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

ఏమిటీ కేసు..

అప్పటిప్రభుత్వం 545 ఎస్ఐ ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించింది. 2021 అక్టోబరులో పరీక్షలు జరగ్గా కొన్ని సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థులకు బ్లూటూత్ ఉపకరణాల ద్వారా సమాధానాలు చేరవేశారు. అలాగే సమాధానాపత్రాలనూ దిద్దించారు. ఇందులో ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 40 లక్షల వరకూ వసూలు చేసినట్లు అభియోగాలున్నాయి. కలబుర్గిలో ఒక ఆంగ్ల పాఠశాలలో పరీక్ష సెంటర్‌లో ఈ అక్రమాలు భారీగా సాగాయి, పాఠశాల యజమాని రుద్రేగౌడ పాటిల్ ఈ స్కాంను నడిపించాడు. కొన్నిరోజులకు అక్రమాలు గుప్పుమనడంతో బొమ్మై సర్కారు దర్యాప్తు చేసి రుద్రేగౌడతో పాటు మరికొందరు నిందితులు, 50 మందికి పైగా పరీక్షార్థులను సీఐడీ అరెస్టుచేసింది. అదనపు డీజీపీ అమృత్‌పాల్ సహా పెద్దసంఖ్యలో ఎస్ఐలు, డీఎస్పీల పాత్ర ఉన్నట్లు తెలిసి అరెస్టులు కూడా నిర్వహించారు. ఈడీ కూడా విచారణ సాగించింది.

వారి ఆలోచన ఏమిటో: బొమ్మై

కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించడంలో వారి ఆలోచన ఏమిటో తనకు తెలియదని బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై అన్నారు. అక్రమాల గురించి తెలిసిన ఆరోజే సీఐడీ విచారణకు తాము ఆదేశించడమైనది, ఇప్పటికే చార్జ్‌షీట్ సమర్పించడమైనది. మళ్లీ న్యాయ కమిషన్‌కు వెళుతున్నారు. అన్నీ కూడా కోర్టులో ఉన్నాయన్నారు.

కోర్టు ఆదేశాల తరువాతే ఎస్ఐ నియామకాలు: హోంమంత్రి

ఎస్ఐ ఉద్యోగాల కుంభకోణంలో విచారణ సాగుతోంది, మరోవైపు నియామక ప్రక్రియను కొనసాగించడానికి కోర్టు ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నట్లు హోం మంత్రి జీ పరమేశ్వర్ తెలిపారు. శనివారం బెంగళూరులో తన నివాసంలో మంత్రి ప్రియాంక్ ఖర్గేతో భేటీ జరిపిన తరువాత విలేకరులతో మాట్లాడారు. 545 ఎస్ఐ ఉద్యోగాల భర్తీని మళ్లీ మొదటి నుంచి నిర్వహించాలని గత సర్కారులో ఉత్తర్వులు వచ్చాయి. ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియను ప్రారంభించనుందని, లేదంటే సిబ్బంది కొరత తలెత్తుతుందని అన్నారు. సోషల్ మీడియాలో బోగస్ వార్తల ప్రసారాన్ని అరికట్టేందుకు చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం, మంత్రులపై వ్యక్తిగతంగా నకిలీ వార్తలతో సమస్యలు వస్తున్నాయి, దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టడమైనదన్నారు.

ఉగ్ర చెల్లింపులపై తనిఖీ

బనశంకరి: అనుమానిత ఉగ్రవాదుల బ్యాంకు అకౌంట్లను సీసీబీ పోలీసులు తనిఖీ చేయగా డిజిటల్ చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఖాతాల్లోకి ఎవరి నుంచి ఎంత నగదు జమఅయింది. ఎన్ని నెలల నుంచి డబ్బు వస్తోంది, వాటి నుంచి ఎవరెవరికి జమచేస్తున్నారు అనే సమాచారం సేకరిస్తున్నారు. విదేశాల్లో దాక్కున్న మాస్టర్ మైండ్ జునైద్ ఈ ఐదుమందికి నిధులు ఇస్తున్నట్లు తెలిసింది. నగదును ఎలా జమచేశారు అనేదానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కాగా, ఐటీ సిటీలో ఐదుమంది అనుమానిత ఉగ్రవాదుల అరెస్టుపై నగర పోలీసులు సమగ్ర నివేదికను కేంద్ర హోంశాఖ కు అందజేశారు.


ధార్వాడలో వర్షంలో బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం



శనివారం కొడగు జిల్లాలోని హారంగి డ్యాం గేట్లను ఎత్తడంతో పరుగులు తీస్తున్న జలాలు. ఎగువన వర్షాలతో డ్యాంలోకి వరదనీరు చేరుతోంది.

ఆస్పత్రికెళ్లిన ఆర్టీసీ బస్సు

- గుండెపోటు బాధితునికి చికిత్స


బస్సుతో డ్రైవర్, కండక్టర్

తుమకూరు: బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో డ్రైవర్ బస్సును సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం సాయంత్రం హోసదుర్గ నుంచి బెంగళూరు మార్గంలో వస్తున్న కేఎస్ ఆర్‌టిసి బస్‌లో హోసదుర్గ తాలూకాలోని ఆలగట్ట వాసి కుమారస్వామి (65), భార్యతో కలిసి వస్తున్నాడు. ఆవళగెరె వద్ద కుమారస్వామికి గుండెల్లో నొప్పి, చెమటలు వచ్చి పడిపోయాడు. బస్సు డ్రైవర్ కంసారప్ప వెంటనే బస్సును చిక్కనాయకనహళ్ళి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి బాధితున్ని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

నా జీవితంలో ఇదే మొదటిసారి: సీఎం

బనశంకరి: తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో మొదటిసారిగా విపక్షపార్టీలు సభలో లేకుండా బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బీజేపీ నేతలు ఫ్రీడం పార్కులో ధర్నా చేయడంపై శనివారం విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ శాసనసభ సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చించడం వదిలిపెట్టి బయట పోరాటం చేస్తే ప్రయోజనం లేదన్నారు. విపక్ష నేతలు కూడా చర్చల్లో పాల్గొనాలని, మూడు వారాల పాటు సమావేశాలు నిర్వహించామని కానీ సభా సమయం వృథా చేశారని దుయ్యబట్టారు. స్పీకర్ చర్యలకు తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ బీజేపీ ధర్నా

శివాజీనగర: బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష బీజేపీ బెంగళూరుతో పాటు శనివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా చేపట్టింది. స్వతంత్ర ఉద్యానవనంలో బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాన్ని ఖండిస్తూ ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 48 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారు. 12 హత్యలు జరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని బీజేపీ కార్యర్తలు నినాదాలు చేశారు. గ్యారెంటీ పథకాలను సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు.

కువెంపు వర్సిటీ స్నాతకోత్సవంలో రభస

- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ఎన్ఎస్‌యూఐ యత్నం
- పలువురు అరెస్ట్


నిరసనకారులను తరలిస్తున్న పోలీసులు



శివమొగ్గ: శివమొగ్గ జిల్లా శంకరఘట్ట కువెంపు విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవం గందరగోళం మారింది. గవర్నర్ గెహ్లాట్ మాట్లాడుతుండగా ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ధర్నా చేయడంతో అధికారులు నివ్వెరపోయారు. వివరాలు... వర్సిటీలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వేడుకలను ప్రారంభించారు. ఆయన ప్రసంగించబోతుండగా ఒక్కసారిగా ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ లోనికి దూసుకువచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని అడ్డుకుని వారిని తరలించారు. దీంతో కొద్ది సేపు ఏమి అర్థం కాక గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ...వర్సిటీలో సిబ్బంది నియామకాల్లో చాలా అక్రమాలు జరిగాయని, దానికి కారణం వర్సిటీ వీసీ అని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సు బోల్తా, డ్రైవర్ దుర్మరణం

- 25 మందికి గాయాలు



యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర సమీపంలోని జాతీయ రహదారి 53లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా 25 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బెంగళూరు నుంచి గోవాకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు శనివారం తెల్లవారుజామున యల్లాపుర సమీపంలో వేగంగా వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన ప్రయాణికులను యల్లాపుర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైద్య విద్యార్థులపై దాడి

యశవంతపుర: మెడికల్ కాలేజీ విద్యార్థులపై దుండగులు దాడి చేసిన ఘటన మంగళూరు పణంబూరి బీచ్ వద్ద జరిగింది. మంగళూరుకు చెందిన ప్రతిష్ఠిత ఏజె మెడికల్ కాలేజీ విద్యార్థులు శనివారం ఉదయం బీచ్‌కు వెళ్లారు. బైక్‌లో వెంబడించిన దుండగులు విద్యార్థులపై దాడి చేశారు. బజ్పె కాపికాడ్ వద్ద అడ్డగించి విద్యార్థి మహమ్మద్ హఫీస్ (20)పై దాడి చేశారు. బీచ్‌కు నలుగురు విద్యార్థులు వెళ్తుండగా అందులో ఇద్దరు అన్యమతస్తులుండటంతో దాడి చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.